శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

విశ్వావసు

చైత్ర-ఆషాఢములు

సంపుటము ౫౪ సంచికలు ౧-౨

దేవభాషలందుఁ దెలుఁగు లెస్స.

Journal of the Telugu Academy
KAKINADA

Vol. 54 Parts 1-2

మా రచయితలు.

1. శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు.

వీరు M.A. Pud. పట్టభద్రులు ఉస్మానియా విశ్వకళాపరిషత్తు ఆంధ్రశాఖాధ్యక్షులు, ఆంధ్రభాషావేత్త, నన్నయభట్టాది గ్రంథకర్తలు.

2. శ్రీ బిరుదరాజు రామరాజుగారు.

వీరు M.A. Phd. పట్టభద్రులు ఉస్మానియా విశ్వకళాపరిషత్తులో ఆంధ్రభాషోపన్యాసకులు, ఆంధ్రగేయ వాఙ్మయకర్తలు.

3. శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు.

వీరు M.A. పట్టభద్రులు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో ఆంధ్రభాషోపన్యాసకులు, శ్రీనాథకవినిగూర్చి ప్రత్యేకముగ పరిశోధనము గావించినవారు.

4. శ్రీ శిష్ట్లా రామకృష్ణశాస్త్రిగారు.

వీరు M.A. పట్టభద్రులు. మదరాసు విశ్వకళాపరిషత్తులో ఆంధ్రశాఖాధ్యక్షులు, ఆంధ్రమండలి వీరశైవవాఙ్మయచరిత్రకారులు.

5. శ్రీ మోచర్ల రామకృష్ణకవిగారు.

వీరు నెల్లూరిపురవాసులు న్యాయవాదులు, సుప్రసిద్ధాంధ్రకవులు.

6. శ్రీ శనగన నరసింహస్వామిగారు.

వీరు M.A. పట్టభద్రులు. ఆంధ్రభాషోపన్యాసకులు.

7. శ్రీ పి. సాయినాధశాస్త్రిగారు.

వీరు M.A. పట్టభద్రులు. విజయనగరము కళాశాల ఆంధ్రభాషోపన్యాసకులు.

8. శ్రీమతి రావూరి సుబ్బమ్మగారు.

ఈ విదుషి. ఉభయభాషాప్రవీణ పట్టమునొంది; చిరకాలము ప్రభుత్వ పాఠశాలలలో నుపాధ్యాయినిగానుండి, ఉద్యోగవిరామమును బొందుచున్నది.

శ్రద్ధాంజలి — డాక్టరు జోగారావు.

1911—1965

క్రోధి సంవత్సరాంతమున మా కార్యనిర్వాహక సభ్యులలో నొకరగు శ్రీ ఇవటూరి జోగారావుగారు శివ సాయుజ్యము నొందిరి. వీరు కాకినాడ పట్టణములోని వివిధ సంస్థలలో సభ్యులుగానుండి ప్రజాదరణమునకు పాత్రులైరి. వీరి మరణమువల్ల వైద్యవృత్తి యొక ప్రసిద్ధ భిషగ్వరుని, కాకినాడపట్టణము ప్రజారంజకుడైన పౌరుని పోగొట్టుకొనెను.

వీరి కుటుంబమునకు మా సానుభూతి.

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

విశ్వావసు చైత్ర - ఆషాఢ మాసములు.
సంపుటము 54. : : సంచికలు 1-2
సంపాదకుఁడు : శ్రీ కుందూరి ఈశ్వరదత్తు.

విషయసూచిక.

ప్రాచీనాంధ్ర వాఙ్మయమందలి ప్రమాణములు.

డా. దివాకర్ల వేంకటావధాని.

ఆధునికకాలమున నన్నిరంగములందు, ముఖ్యముగా విద్యా వాఙ్మయరంగములందు, ప్రమాణములు పతనము చెందినవని పెద్దలనుచుండుట తఱచుగా వినుచుందుము. వారట్లనుటకుఁ బ్రాచీనాధునిక ప్రమాణములందుఁ దారతమ్య మధికముగాఁ గానవచ్చుచుండుటయే కారణము. చిత్రమేమనఁ బ్రమాణములు పెంపుచెందవలెనను ప్రచారమెంత యెక్కువగా వినఁబడుచున్నదో అంత యెక్కువగా నవి పలుచబడుచున్నవి. క్లేశసాధ్యమైన యుదాత్తతపై నభిమానము తగ్గి లాఘవసౌకర్యములపై నాసక్తి పెరుగుట, లక్షణానుసరణముకంటెఁ దదుల్లంఘనమే స్వాతంత్ర్యమను భ్రాంతితోఁ గూడిన భావము ప్రబలుట, వ్యుత్పత్తిరాహిత్యమువలన సదసద్వివేచనతాలోపముతో పాటసద్విషయమును సద్విషయముగా గ్రహించు నవివేకము హెచ్చగుట, అల్పసిద్ధికై ఆడంబరముతోఁ గూడిన యహంకార మతిశయించుట, ప్రమాణపతనమునకు ముఖ్యములైన కారణములు. ఇట్టి స్థితిలో నున్నదానితోఁ దృష్టిపడి యూరకుండక కొందరైనఁ బ్రమాణములు పెంపుచేయవలెనని యాందోళనము సాఁగించుట కొంతవఱకు శుభోదర్కమే. ఈ భావమే లేనిచోఁ బతనము నిరాటంకముగా సాఁగి సాఁగి కొలఁదికాలముననే పరిపూర్ణత ప్రాపించుటకవకాశమున్నది. దీని నరికట్టుటకు యత్నించుటతోపాటు ప్రాచీనప్రమాణముల పరిపాటి నెఱుంగుట యెంతైన నవసరము. అందలి యుత్తమత్వమును నేటి వైశిష్ట్యమును మిశ్రము కావించి మన మొక ప్రశస్తమైన పద్ధతిని బ్రతిష్ఠించుకొనుట కది వీలుకలిగించును.

లాక్షణికులు ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసములు మూఁడింటిని గావ్యహేతువులుగాఁ బరిగణించిరి. ప్రాచీనాంధ్రకవులు పలువురిలో

...ి మూఁడు హేతువులు సమభాగములుగాఁ గనిపించును.
...అవి యట్లు లేనివారుకూడఁ గొందఱిప్పుడుండి యుందురు.
...వారు కావించిన రచనలే యంతగా వ్యాప్తినొందక యిప్పటికిని
...వాళపత్ర గ్రంథ భాండాగారములందే యపరిశోధితములుగా నుండి
...పోయినవి. ప్రతిభావంతులైన రచయితలెప్పుడు నెల్లదేశముల
...యుందు నుందురు. భగవద్దత్తమైన యీప్రతిభకుఁదోడు వారితర
హేతువులకుఁగూడ నిరవులు కాఁజాలినచో వారిరచనలు నుదాత్త
ములును సహృదయజన స్తుతిపాత్రములునై యలరారును. ఆ
మూఁడును బుష్కలముగాఁ గలిగిన వారై యుండుటచేతనే ప్రాచీనుల
...సాహిత్యము పఠితల బుద్ధిహృదయములు రెండింటిని రంజించు శక్తితో
...భిల్లి యుత్తమప్రమాణముల కాదర్శములు కాఁజాలినవి. అందుచే
...సాహిత్యమున నుత్తమప్రమాణములు నెలకొల్పవలెనన్న రచయితలు
...దానిని సమకూర్చు హేతువులన్నిటిని సంపాదించుటకు యత్నము
...యవలసియున్నది. కారణములు సమగ్రములై యుండుచోఁ గార్య
ములు కూడ సౌందర్యసామగ్ర్య సంశోభితములై యలరారుటలో
...సందేహముండదు.

పూర్వాంధ్రకవులు లక్షణగ్రంథములతో నధికమైన పరిచ
యముకలవారు. వారందఱి లక్షణములను సానుభూతితోఁ బరికించి
తదనుగుణముగాఁ గావ్యరచన కావించెడివారు. ఈ లక్షణాను సర
ణము వారి స్వాతంత్ర్యము నరికట్టి కొన్ని యెడల వారి ప్రతిభకుఁ
గూడఁ బ్రతిబంధకముగా నుండెనని తలంచువారు కొందఱున్నారు.
...ని వారు కేవల లక్షణదాసులు కారు. ప్రతిభానుగుణముగాఁ
...క్షణములను, లక్షణానుగుణముగాఁ బ్రతిభను మలచి
...వ్యరచనకుఁ గడంగినవారు. అందుచే వారి కావ్యములందు

లక్షణములకుఁ బ్రతిభ, ప్రతిభకు లక్షణములు మెఱుఁగులు దిద్దుచుండెను. శ్రీనాథయుగమునందలి కావ్యములను, తరువాత వెలువడిన ప్రబంధములను బరికించిన నీ విషయము తేటతెల్లము కాఁగలదు. ప్రబంధకవులు తమ రచనలలో సంస్కృత మహాకావ్యములయు నాటకములయు లక్షణములు జోడించి వానికొక వైలక్షణ్యము కలిగించిరి. పద్యములు వ్రాయునప్పుడు వృత్తవైవిధ్యమును బాటించుటచేతను, నడుమనడుమ సుందరములైన వచనభాగములను జొప్పించుట చేతను, వారు తమ కావ్యములందొక నూతనత్వమును వెలయించిరి. కాని వారందఱు ననుసరించిన లక్షణమొక్కటియే యగుటచే వానియందుఁ బ్రతిభా పార్థక్యముతోపాటు ధర్మసాధారణ్యము కూడఁ గొంత గోచరించుచుండును. నియమబద్ధతలో నిట్టి సమానత్వ ముండక తప్పదు. దాని నొక దోషముగాఁ బరిగణించుటకంటె దానిపై పరివేషమువలె ప్రత్యగ్రప్రభలు వెదజల్లు ప్రతిభాతిశయమును బరికించి ప్రమోదమందుట మంచిది. అనంతరప్రబంధయుగమునందలి కవులు కొందఱు లక్షణములకే ప్రాధాన్యమొసంగి అనుకరణమయములైన కావ్యములు రచించినమాట నిజమే. అది వారి ప్రతిభాలోపమునకు నిదర్శనము. ఈ ప్రతిభాలోపమే వాని ప్రచారమునకును గొంతయాటంకము కలిగించినది.

క్రీ. శ. 16వ శతాబ్ది ఆరంభము వఱకును దెలుఁగున వెల్వడిన గ్రంథములు పెక్కులు సంస్కృతమునుండి అనువదింపఁబడినవే. కవిత్రయము వారు పంచమవేదమైన భారతము నాంధ్రీకరింప మారన మార్కండేయపురాణమును పోతన మహాభాగవతమును దెనిఁగించిరి. శ్రీనాథుఁడు నైషధమహాకావ్యమును పూర్తిగా ననువదించుటయే కాక హరవిలాసమున కుమారసంభవమందలి గౌరీకల్యాణభాగమును సం

గ్రహముగా నాంధ్రీకరించెను. అతని కాశీఖండ భీమఖండములుకూడ
అనువాదములే. దండిదశకుమార చరిత్రమును కేతన చంపూకావ్య
ముగా ననువదించెను. వాల్మీకిరామాయణము తెలుఁగున భాస్క
రాదులచే చంపూరూపమును బుద్ధారెడ్డిచే ద్విపదరూపమును బొంది
నది. విద్ధసాలభంజిక, శాకుంతలము, ప్రబోధచంద్రోదయము అను
సంస్కృతనాటకములు తెలుఁగున ప్రబంధరూపమున అనువదింపఁబడి
నవి. ఇట్లు సంస్కృతగ్రంథములను తెలుఁగున ననువదించుటలో
తెలుఁగు కవులు చూపిన కౌశలము ప్రశంసా పాత్రమైనది. వారి
అనువాదవిధానమును రెండు విధములుగా విభజింపవచ్చును. కవి
త్రయము వారి అనువాదము కథానువాదము. వారు మూలమునం
దలి కథాసూత్రమును మాత్రము విడువకుండఁ దమ కనవసరములని
తోఁచినచోట్లఁ గొన్ని భాగములను తగ్గించి, అవసరములని తోఁచిన
చోట్లఁ గొంత భాగమును బెంచి, అనౌచిత్యములను బరిహరించి భార
తానువాదమును సాగించిరి. వారి భారతము పేరునకనువాదమే
యయ్యు నిజమునకు స్వతంత్రకావ్యమువలెనే భాసించును. శ్రీనాథా
దులయాంధ్రీకరణము భావానువాదము. వారును ఎకనెడఁ గొన్ని
మార్పుచేర్పులు చేయుచు ననౌచిత్యములను బరిహరించుచు ననువా
దము సాగించిన మాట నిజమేయయ్యు భారతకవులంతి స్వాతంత్ర్యము
వహించియుండలేదు. వారు మూలమునందలి కథను గాని భావము
ములనుగాని యొక్కడను విడిచివేయక వానిని స్వాయత్తీకరించుకొని
తమ భాషకు జాతీయమునకు ననుగుణముగా సమర్థతతో ననువదించి
యుండిరి. మూలగ్రంథముల ప్రధానతత్త్వమున కెచ్చటను భంగము
కలిగింపకుండుట, వీలైనచో మూలమునకుఁగూడ మెఱుఁగులుదిద్దుట
తెనుఁగుకవుల అనువాదపద్ధతియందలి ప్రధానగుణములు. అనువాద
విషయమున వారు ప్రతిష్ఠించిన ప్రమాణమనన్యసాధ్యమైనది. అందు

చేతనే రసనిధానములని చెప్పఁదగిన సంస్కృత నాటకములను బూర్వాంధ్రకవులనువదించి యుండలేదే అను విచారము తెలుఁగు వారికి మిగిలిపోయినది. మూలములను మఱపించునట్లనువాదములను వెలయించువారి విన్నాణము శ్లాఘాలంఘనజాంఘికమైనట్టిది.

వస్తువు నెన్నుకొనుటలోఁ గూడ బూర్వులు సంస్కృతలక్షణమునే యనుసరించిరి. ప్రఖ్యాతమైన యితివృత్తమునుగ్రహించి దానిని వర్ణనాదులతోఁ బెంచి కావ్యమును సంతరించుట ప్రబంధకవులపరిపాటి. ప్రబంధయుగమునందలి కృతులలో నొక్క కళాపూర్ణోదయము మాత్రమే కల్పితవస్తుకము కానవచ్చుచున్నది. దానిని రచించిన పింగళి సూరనార్యుఁడు తాను దరువాత రచించిన ప్రభావతీప్రద్యుమ్నములో మరలఁ బ్రఖ్యాతవృత్తమునే స్వీకరించినాఁడు. భట్టుమూర్తి కేవల కల్పనాకథలను కృత్రిమరత్నములని నిరసించినాఁడు. అది ఆ కాలమున ప్రచారమందుండిన సాధారణాభిప్రాయము కావచ్చును. అందుచే సంఘమునుండియో లోకమునుండియో వస్తువును సేకరించుట అప్పుడు చాల నరుదు. పాల్కురికి సోమనాథుఁడు లోకమునుండి కొన్నికథలు గ్రహించి తనకావ్యములలోఁ జేర్చెను. కాని యా సాంప్రదాయ మాతనితోనే యాగిపోయినది. వర్ణనలయందత్యాసక్తిగల ప్రబంధ కవులు కథావిషయమున నంతగా శ్రద్ధ వహింపలేదని కొందఱు విమర్శకులందురు. అది యథార్థమే. వారు వర్ణనమున కొసంగినంత ప్రాధాన్యము కథాకల్పనమున కొసంగియుండలేదు. ఈ విషయమునఁ గూడ నపవాదమని చెప్పఁదగిన దొక్క కళాపూర్ణోదయమే. కాని కొన్ని పూర్వకావ్యములలోఁ జక్కని పాత్రచిత్రణములతోడను, సన్నివేశ కల్పనములతోడను, ఉపదేశప్రదానములతోడను గూడి పద్యరచిత

ములయ్యు నిప్పటి కథానికలకెందును దీసిపోని రమణీయములైన కథ లక్కడక్కడ గానిపించును. వానిని జూచినప్పుడాకవులు కథాకల్ప నమునెడ నెందుకుపేక్ష వహించిరాయను విచారము కల్గుచుండును. శ్రీనాథుని గుణనిధికథ, రామకృష్ణుని నిగమశర్మకథ, రాయలవారి మాలదాసరికథ మున్నగునవిందుకుఁ దార్కాణములు.

పూర్వకవుల కావ్యములందలి నాయకులు పలువురు ధీరోదాత్తులు. వారు రాజులో రాజకుమారులో తత్సదృశులోనై యుందురు. దీనినిబట్టి యందలి నాయికులసంగతి మన మూహింపవచ్చును. సామాన్యప్రజలనుండి ప్రబంధకవులెవ్వరును నాయికానాయకులను గ్రహించియుండలేదు. కావ్యముపదేశాత్మకమై కూడ నుండుట వాంఛ నీయమగుటచే లాక్షణికులు త్తమ ప్రకృతికులే నాయకులుగా నుండఁ దగుదురని శాసించిరి. మఱియు శృంగారాది రసములు లోకోత్తర నాయకాశ్రయత్వముచేతనే సమ్యక్పరిపోషము నందుట కవకాశముం డుటయు వారట్లు నియమించుటకు హేతువు. ఏలయన నవి నీచాశ్రయ ములగుచో ధర్మహీనములగుటయు తద్ద్వారా కావ్యము దుర్నీతిబోధక మగుటయు సంభవించును. అందుచే పూర్వకావ్యములలో సామాన్య ప్రజాప్రవృత్తి వర్ణనకంతగా నవకాశము కలుగలేదు. నిరంకుశోపా ఖ్యానము, విప్రనారాయణ చరిత్రము మున్నగు ప్రబంధములలో సాంఘికచ్ఛాయ లెక్కువగాఁ గనిపించుమాట సత్యమేకాని అట్టి వాని సంఖ్య చాల తక్కువ. ప్రబంధకవులు రాజాంతఃపురముల నుండి సామాన్యగృహముల కెన్నఁడును దిగియుండలేదను నపవాదమున్నను వారు సంఘమునందలివ్యక్తులే కావున తమ కావ్యములలోఁ బరోక్ష ముగా సామాన్య ప్రజాజీవితప్రవృత్తులను గూడ నెడనెడ తడవియుం డకపోలేదు. దీనికి రాయలవారి ఆముక్తమాల్యద చక్కని నిదర్శ

సము. అది యానాటి సాంఘికాది పరిస్థితులకు దర్పణమువంటిది.

పూర్వాంధ్రకవులు రసపోషణమున సిద్ధహస్తులు. కావ్యములలో శృంగారవీరములలో నేదోయొకటి అంగిరసముగా నుండవలెనను లక్షణము ననుసరించి వారు వానినే, అందును శృంగారరసమునే, తమ కావ్యములం దెక్కువగా వర్ణించియుండిరి. ఇతర రసములు వారి కావ్యములలో నంగములుగా మాత్రము గోచరించును. భారతాది విస్తృతగ్రంథములలో నాయాసన్నివేశములను బట్టి సర్వరసముల సముచిత పరిపోషమును గనిపించును. కాని శ్రీనాథుని తరువాత వెలువడిన కావ్యములలో శృంగారరసపోషణమునకే ప్రాధాన్యము హెచ్చు. శృంగారరసము నౌచిత్యమర్యాద నతిక్రమింపకుండ సభ్యముగా వర్ణించుట కొంచెము క్లేశకరమైన విషయము. ఏలయన దానికి రచయితను గూడఁ బరవశునిఁజేసి నిగ్రహబాహ్యునిఁ గావించుగుణమున్నది. తెలుఁగు కవులలోఁ గవిత్రయము వారిశృంగారమును వర్ణించుటలో నద్భుతమైన నిగ్రహము ప్రదర్శించిరి. నన్నయ నాయకాదుల సంగమేచ్ఛను 'నిజహృదయం బెఱిఁగించె' 'నిజాభిప్రాయం బెఱిఁగించె' అనియే చెప్పునుగాని వాచ్యముగా నెచ్చటను బ్రకటింపఁడు. తిక్కన యెఱ్ఱనలు నాయికావర్ణనము గావించునప్పుడు సాముదాయిక సౌందర్యమునే వర్ణింతురుగాని ప్రత్యంగ వర్ణనము గావింపరు. వారు రచించిన సంభాషణములును బరమౌచిత్యభాసురములై ప్రశంసాపాత్రములుగా నుండును. నాచనసోముఁడూర్వశీనరకాసుర సంభాషణమున శృంగారమును విచ్చలవిడిగావర్ణించి కొంత నిగ్రహహీనత ప్రదర్శించినాఁడు. శ్రీనాథుని కావ్యములందును, ప్రబంధములందును శృంగారరసవర్ణన విషయమున నీనిగ్రహము కొంతతక్కువగనే కనిపించును. దానికైన హేతువులలోఁ దత్కాలప్రభావముకూడ నొకటి. కాని

వారు చాలవఱకు ధర్మ్యమైన శృంగారమునే వర్ణించిరి. దక్షిణాంధ్ర యుగమున వెలసిన ప్రబంధములలో శృంగారరసవర్ణనమున నిగ్రహ లోపము పూర్తిగా గోచరించును. వారు కావ్యప్రయోజనములలో నానందమునకే కాని యుపదేశమున కంతగాఁ బ్రాముఖ్య మొసంగి యుండలేదు. అందుచేతనే అప్పుడు తారాశశాంకవిజయము, అహల్యా సంక్రందనము, సారంగధరచరిత్రము మున్నగు కావ్యములుదయించి నవి. ఈ యుపదేశరాహిత్యముచేతను, శృంగారవిశృంఖల వర్ణనము చేతను అప్పటికావ్యములు శబ్దార్థసౌందర్యభూయిష్ఠములయ్యు నుదా త్తతాహీనములుగాఁ గానిపించును.

కావ్యములం దష్టాదశవర్ణన లుండవలెనని లాక్షణికులనియ మము. పురాణములం దీవర్ణనములన్నియుఁ గనిపించునుగాని యవి నాతివిస్తృతములుగానుండును. ఆంధ్రకవులలో నీవర్ణన ప్రియత్వము మొట్టమొదట నన్నెచోడునిలో హెచ్చుగాఁగనిపించును. శ్రీనాథుఁడు నైషధము నాంధ్రీకరించిన పిమ్మట నందలివర్ణనలను మనసులోనుంచు కొని తరువాతి కవులు తమ కావ్యములలోఁగూడ నట్టి వర్ణనలను సాగించిరి. ప్రబంధకాలమున కది అపరిహార్యమైన ఒక లక్షణమే యైపోయినది. కొంచెమించుమించుగా నీవర్ణనలన్నియు నన్ని ప్రబం ధములందును గోచరించును. అవి పెక్కతిశయోక్త్యుత్ప్రేక్షాదులతోఁ గూడియుండుటచే వానిని జదువుచున్నప్పు డొక స్వప్నప్రపంచమున సంచరించుచున్నట్లు కనిపించును. అందుచేతనే కొందఱు విమర్శకులు ప్రబంధకవు లైహికప్రపంచమునువీడి గంధర్వనగరవిహారము కావింతు రని చెప్పుచుందురు. కాని అందలి అతిశయోక్తులను దొలఁగించి పరిశీలించినచో వారి సూక్ష్మాతిసూక్ష్మ పరిశీలనపాటవము సర్వతో ముఖమై యాశ్చర్యము కలిగించును. ప్రబంధముల ప్రౌఢిపరిపాకమున

కాలంబము లేవర్ణనలే. వానియందాకవుల పాండిత్యమొకవంక, పద ప్రయోగపాటవ మొకవంక, భావనాశక్తియొకవంక ప్రత్యక్షములై పఠితలకు వారియెడ నపారమైన గౌరవభావమును రేకెత్తించును. వారి భావనాసంపద యమోఘమైనది. 'రవికానని చోఁ గవి గాంచునే కదా' యనుసూక్తి వారియెడ సార్థకము. ఈ భావన క్రమముగా సన్న గిల్లి అనంతర ప్రబంధకవులలో ఊహాతిశయముగా పరిణమించినది.

పూర్వాంధ్రకవులు కావ్యజీవితమైన ధ్వని సౌందర్యమును బూర్తిగా గుర్తించినవారు. తిక్కన సంభాషణలు పెక్కు ధ్వని గాంభీర్యమున కిరవులై రమ్యములుగా నుండును. నాచనసోమనాథుని ఉత్తరహరివంశమున నుక్తిచమత్కారము సర్వతోముఖముగా గోచరించును. ప్రబంధకవుల రచనలలో ధ్వనిగాంభీర్యమో, ఉక్తిచాతుర్యమో, అలంకారపాటవమో కనిపింపని భాగమేయుండదు. వసుచరిత్ర ఆముక్తమాల్యద ధ్వన్యలంకార శోభితమై ప్రబంధయుగమున కొక వన్నెవాసి చేకూర్చినది. దక్షిణాంధ్రయుగమునందలి కావ్యములకుఁ దలమానికమైన విజయవిలాసమున శబ్దార్థాలంకారసౌష్ఠవముతోపాటు వ్యంగ్యచమత్కారమును విరివిగా గోచరించుచుండును. పూర్వకవులెల్లరు కావ్యకళామర్మజ్ఞులనుటకు పెక్కుదాహరణములు చూపవచ్చును.

ద్విపదకావ్యములును తిక్కన నిర్వచనోత్తర రామాయణమును దప్ప పూర్వాంధ్రకావ్యములన్నియు చంపూకావ్యములే. గద్య పద్యమిశ్రితములైన చంపూకావ్యములు చదువునప్పుడు గద్యమయములో కేవలపద్యమయములో యైయుండు కావ్యములను పఠించునప్పుడువలె విసుగుదల జనింపదు. నడుమనడుమ చేర్పఁబడు గద్య భాగములు పఠితకునవైవిధ్యముచే నుత్సాహాతిశయము కలిగించు చుండును. పురాణమునందలి వచనములు విషయప్రధానములై మిక్కిలి

సరళముగనుండును. ప్రబంధములనాఁటికి వచనరచనాక్రమము మిక్కిలి మార్పుచెందినది. అందలి గద్యము లర్థశబ్దాలంకార భూయిష్ఠములై రచయితల అపార పాండితీ శౌండీర్యమున కాటపట్టులై అత్యంతప్రౌఢములుగానుండును. ఛందోరహితత్వము తప్ప వానికిని అందలి పద్యములకును భేదమంతగా నుండదు. ఈ వచనములు ప్రాయికముగా వర్ణనాపరిపూర్ణములై బాణభట్టువచనమును దలఁపునకుఁ దెచ్చుచుండును.

పూర్వాంధ్రకవులెల్లరు విద్వత్కవులు. వారెంతకవులో అంత పండితులు. అందుచే వారిరచన లక్షణానుగుణమై నిర్దుష్టముగానుండును. అచ్చతెనుఁగు కావ్యములను వ్రాసినవారు తప్ప మిగిలినవారు సంస్కృత పదప్రయోగాసక్తినే యెక్కువగాఁ బ్రకటింతురు. వారి రచన సమాసజటిలమై పండితజనైకవేద్యముగా నుండును. అచ్చటచ్చట సంభాషణములను రచించుపట్ల వారు చక్కని తెలుఁగు పలుకులను గూడ వాడుచుందురు కాని అట్టిఘట్టములు చాలతక్కువ. పురాణకవులు శబ్దార్థములకు సమానమైన ప్రాధాన్య మొసంగిరి. ప్రబంధములలో నర్థముకంటె శబ్దమే యెక్కువ ప్రాభవము వహించినట్లు కన్పించును. దక్షిణాంధ్రయుగమునాటికా శబ్దాభిమానము మఱింత హెచ్చినది. శైవకవులు దేశీయతను జాను తెనుఁగును బహువిధముల ప్రశంసించియుండిరి. వారి కావ్యములందుఁగూడ సంస్కృతపదప్రయోగ మధికముగనే గోచరించును కాని వారు కొంతస్వాతంత్ర్యము వహించి తమనాఁడు వ్యవహారమందున్న పలుకుబడులను జాతీయములను వైరి సమాసములను విరివిగా వాడుటకు యత్నించియుండిరి. భాషావిషయమున వారు వహించిన యీ స్వాతంత్ర్యమే వారి కావ్యముల ప్రశస్తిప్రచారములకుఁ గొంతవఱకంతరాయము కల్పించినవి. మొత్తముమీఁద పూర్వాంధ్రకవులు కావ్యనిర్మాణమునందువలెనే

భాషాప్రయోగము నందును లక్షణానుగుణ్యమునే యెక్కువగ
ప్రదర్శించిరి.

సంస్కృతలాక్షణికుల ననుసరించి పూర్వాంధ్రకవులు పలుపుర
కావ్యమునకు సద్యఃపరనిర్వృతితోపాటుపదేశప్రదానమును గూడ
ప్రయోజనముగా భావించిరి. అందుచే వారి రచనలందు రసవత్త్వో
దేశవత్త్వములు రెండును సమానాంతరముగా గోచరించుచుండును.
ఆదికవి నన్నయ కావ్యము విశ్వశ్రేయస్కరముగా నుండవలెనని చెప్పుట
యిందుచేతనే. "నన్నయభట్టు తెనుంగునన్ మహాభారత సంహితా
రచన బంధురుండయ్యె జగద్ధితంబుగన్" "కృష్ణద్వైపాయనుం డర్థిలోక
హితనిష్ఠంబూని కావించె ధర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు తేఖ్యం
బైన యామ్నాయమున్" "బమ్మెర పోతరాజొకండు భాగవతంబు
జగద్ధితంబుగన్" మున్నగు వాక్యములుకూడ నీవిషయమునే సూచించు
చున్నవి. పురాణవాఙ్మయము నీతి తత్త్వప్రధానమని వేఱుగాఁ జెప్ప
నక్కఱలేదు. ప్రబంధములందుసైతము సూక్ష్మముగాఁ బరిశీలించి
నచో నుపదేశప్రదానము సువ్యక్తమగును. మనుచరిత్ర జితేంద్రియత్వ
ప్రాధాన్యము, ఆముక్తమాల్యద, పాండురంగమహాత్మ్యము భక్తి
ప్రాధాన్యమును, పారిజాతాపహరణ మహంకార ప్రశమనమును
బోధించుచున్నవి అనంతర ప్రబంధయుగమునందు మాత్రముపదేశ
మునకు ప్రాధాన్యము పూర్తిగా సన్నగిల్లినది. అప్పటికవులు పలు
వురు "తస్మైనమః స్వాదుపరాఙ్ముఖాయ" అనుభావమును ప్రోదిచేసి
నట్టివారే. ఆనందమొక్కటే వారి యేకైకలక్ష్యము. శైవకవులు
పలు విషయములందు స్వతంత్రులయ్యుఁ దమకావ్యములందు మతము
నకు తత్సంబంధితత్త్వమును ప్రచారముచేయుటకు నెక్కువ ప్రాము
ఖ్యము నొసంగిరి. మొత్తముమీఁద నేకార్యమొనరించినను లౌకికోప

యోగముతోఁ బాటాముష్మిక ప్రయోజనమును గూడ ముడిపెట్టుట పూర్వుల పరిపాటి.

ఈ విధముగా పూర్వాంధ్రకవులు పలువురు రసవస్తు నాయ కాదులయందును ఇతర కావ్యనిర్మాణవిశేషములందును సంస్కృతలాక్షణికులు సూచించిన మార్గమునే యనుసరించిరి. ఇట్లని వారు కేవలము గ్రంథానుకరణము కావించిరని భావింపరాదు. ఆ లక్షణముల ననుసరించుచునే కొన్ని విషయములందు స్వప్రతిభోచితముగా నూత్నమార్గములను వెలయించిరి. అనఁగా నొకనియమమునకు లోఁబడియే వారు స్వాతంత్ర్యము ప్రకటించి యుదాత్తము ప్రశంసనీయమునైన సాహిత్యమును సృజించిరి. వారి కావ్యము లిహమున నానందము చూఱయిచ్చి పరమున మోక్షమునకు దారిచూపు పాటవమునకు పేరుపొందినవి. వారిలోఁ గొంద ఱాముష్మికమును విడిచి యైహికమునకే ప్రాకులాడినవారు లేకపోలేదు. కాని అట్టివారిసంఖ్య చాలస్వల్పము. ప్రాచీనులల్పసిద్ధితోఁ దనివి చెందినవారు కారు. ఉత్తమసిద్ధి సముపార్జనమునకై వారున్న శక్తియంతయు ధారవోసి కృతకృత్యులు కాఁజాలిరి. వారి యడుగుజాడ లాంధ్ర సారస్వతమున కుత్తరోత్తరాభ్యుదయ పరంపరల నావహించుఁగాక.

—•—

శశి వింశతి

శ్రీ శనగన నరసింహస్వామి.

1

తమమను పూర్ణసాగరము ద్రావు నగస్త్యుఁడు, సర్వజీవలో
కమునకు భోగభాగ్యము లఖండముగా నిడురాజు, కైరవ
ప్రమదల మోములం గలతఁ బాపు భుజంగుఁడు, చంద్రకాంత బృం
దముల గరంచు భావుకుఁడు తారకనాథుఁడు మిమ్ము బ్రోచుతన్ !

2

శరనిధిశుక్తిగర్భమున జన్మముగాంచిన ముత్తియంబు, ని
ర్జరులకు నిత్యమైన మధుశాల, చకోరవిహంగమ ప్రపా
శరణము, సస్యసంతతుల సాకి వెసం బెఱిగించు మందు, చం
దురుఁడు భవత్సుఖంబుల ననూనముగా వెలయించుఁగావుతన్ !

3

తెలివలిపంబు లంగముల దీరిచి, వేనలులందు మల్లెలన్
దలముగ నింపి, చిన్నగవు తళ్కులవెన్నెలఁ జిమ్ముచుం బ్రియ
స్థలములు చేరఁబోవు నభిసారికలం దన శీతగౌరర
శ్ములు నిగిడించి సాకు శశిశేఖరుఁడు మిమ్ముల సాకుగావుతన్!

4

శ్రీపరమేశకేశకుజశృంగము పూచిన పూలగుత్తి, ల
క్ష్మీపతి మోమునం జెలువ చిందెడు వామవిలోచనంబు, భూ
మీపరమానుబింబనము ద్రింగు మణీముకురంబు, మానినే
త్రోపరిహర్షబాష్పకణ మనుష్ణమయూఖుఁడు మిమ్ము నేలుతన్ !

5

విరహితమానినీతతికి వేయివెలుంగులవాఁడు, జారతా
పరులకు చోరచక్రియుగపాళికి గర్భవిరోధి, రాగసం
గరవశదంపతిం గలిపి గౌరవముంగొను రాయబారి, పం
కరుహరిపుండు మీ హృదయకాంక్షితముల్ నెఱవేర్పుఁగావుతన్ !

6

మూఁడుజగంబులున్ నిదురమున్గి విరామము నొందుచుండ, నో
మోడక యర్ధరాత్రిమున నుజ్జ్వలవేషము దాల్చి, చుక్కపూ
బోఁడులమధ్య నోలగము పొంది ధరాపతిభంగి నాడుచుం
బాడుచుఁ గాలముం గడపు పార్వణచంద్రుఁడు మిమ్మునేలుతన్ !

6

నీలవియన్మహాతలము నిర్మలమైన సరోవరేణ్యముం
బోలఁగ, తారకాతతులు పూచిన తామరపూలచాలుగాఁ
గ్రాలఁగ, చంద్రికాలహరికారుచిరోర్మ్మిల రాజహంసమై
తేలి విహారమున్ నెఱపు దివ్యుఁడు చంద్రుఁడు మిమ్ముఁ గాచుతన్ !

8

జలదపథోదధిం బొడము స్వాదుసుధాకలశంబు, ప్రాక్సతీ
తిలకము ఫాలదేశమున దిద్దెడి కుంకుమబొట్టు, శైలభి
న్నిలయమతల్లికాగ్రమున నిల్పు సువర్ణఘటంబు, రిక్కచె
ల్వలగమికాఁడు మీమధురవాంఛలు సర్వము దీర్చుగావుతన్ !

9

విరహితభామినీజనము వేయితెఱంగుల దూఱు దుర్యశః
స్ఫురణము పేర లాంఛనము పూన కళంకితుఁడైనవాఁడు; తా
మరసపత్రవతామణులు మాటికి రోయుచునుండ భీతిమై
సురిగి యమాసయందుఁ దలసూపని చంద్రుఁడు మిమ్ము నోముతన్ !

10

పడఁతుల చిత్తవీథికలఁ బంచశరాగ్ని రగిల్చి తద్గతిం
బొడమినధూమ మంబరము పొందినవాంబుదముల్ సృజింప; నం
డెడనెడ మాటుచెందివెలపేది బయల్పడు పాలసంద్రపుం
బుడుతఁడు మీకు సౌఖ్యములు పూర్ణముగా విరజిమ్ముఁ గావుతన్ !

11

గాదిలిబావ శౌరి, లయకాలమునందు జగంబులెల్ల న
మ్మోదమునాన ముగ్ధశిశుమూర్తి ధరించి సముద్రశయ్య ని
ద్రాదరుఁడైన చంద మపహాస్యముగా నొనరింప నెంచి; య
బ్భోదధియందు పండుకొనియుండు శశాంకుఁడు మిమ్ముఁ బ్రోచుతన్ !

12

సుతుఁగనినంతకా దతనిఁజూచి జనంబు స్తుతించునప్పుడే
పితృమతి సంతసించునను పెద్దలవాక్యము నిశ్చితంబుగాన్
సుతుని నుతించు లోకమునుజూచి కరంబును బొంగు నాపగా
పతిసితగాంచి గర్వపడు పార్వణచంద్రుడు మిమ్ము నేలుతన్ !

13

మాసిన చీరవీడి యసమానసితాంశుకమున్ ధరించి పే
రాస శచీహృదీశవిమలాశఁ బ్రతీక్షఁబొనర్చు శర్వరీ
వాసకసజ్జికన్ దరియవచ్చి కరంబులుసాచి మర్మముల్
రోసి కరంగు చంద్రముఁ డుదగ్రమదంబులు మీకొసంగుతన్ !

14

దివిజుల పట్టణంపు మొగదీసుచు దీపము, సౌరబాలికా
నివహము లాటలాడుఁగొను నిగ్గులబంతి, నభఃపథమొక్క భూ
భువనముఁ జూచి మెచ్చు శచిపుల్లముఖాంబురుహంబు, రోహిణీ
ధవపరిపూర్ణబింబము సదాభవదర్థము లిచ్చుఁగావుతన్ !

15

ముందు వియన్నదీకుముదముగ్ధల దేరిచి, కన్నుదోయికిన్
విందొనరించి, పైనపృథివీసరసీసరసోత్పలాంగనా
తుండిలమానసముం దిగుచు ధూర్తుఁడు, దక్షిణనాయకుండు, పూ
ర్ణేందుఁడు మీకు భోగము లహీనముగా దయసేయుఁ గావుతన్ !

16

కలశసముద్రముం దఱువఁగా బొడసూపిన వెన్నముద్దయై
జెళుకుల నీను నభ్రమణిభిత్తిక దోఁచిన భూమిగోళమై
తిలకము దిద్దికోన్ మఘవుదేవి గ్రహించిన నిగ్గుటద్దమై
వెలుఁగులు జిమ్ము పూర్ణశశిబింబము మిమ్మలరించుఁగావుతన్ !

17

తామసదుర్వనిం దునుము దారుణమైన లతాలవిత్ర ము
ద్దామతమోవరాహముఖధామ వినిర్గతదంష్ట్ర యామినీ
కామిని కొప్పునం దుఱుము కమ్మనిగేదఁగి పువ్వురేక, శ్రీ
సోముని రేఖ, మిమ్ము సుఖసామరసంబులు ద్రోల్చుఁగావుతన్ !

18

తన సహజన్మ లక్ష్మి మురదానవభేది భుజాంతరంబు నం
దునికిని బొందఁగాంచి స్వకులోన్నతి నిల్పఁగ నిశ్చయించి, రు
ద్రుని తలమీఁద నెక్కి బహుధూర్జటికాలతికాలతాంతపా
వనతనుఁగాంచు శీతరుచిబాలుఁడు మిమ్ములఁబ్రోచుఁగావుతన్ !

19

కలువ మెఱుంగుఁ గుబ్బెతలఁ గౌఁగిటఁ జేర్పఁగ సాహసంబుతోఁ
గొలఁకుల నీరిలో నుఱుకు గూఢచరుండు, పసిండికోరలన్
దొలఁకు సుమాసవంబులను దోఁచి నెలంతల ముద్దుమోములన్
బులకలు పేర ముద్దుగొను పూర్ణసుధాంశుఁడు మిమ్ము నోముతన్ !

20

సురకథమెక్కి, మచ్చరణశూరులు కోకిలవందిమాగధ
ప్రకరము వెంటరా, పథికభామలఁ గొట్టఁగ నేఁగు పువ్వునా
యకు నడుమంతరంపు సిరి కద్దమరేయిని బట్టు మౌక్తిక
ప్రకటసితాతపత్రము ముడుభర్త భరించుత మిమ్ము నెప్పుడున్ !

(సూర్యశతకమును స్మరించి-)

\- సమాప్తము -

ఓం

శ్రీ కాళిదాసు — ధర్మశాస్త్రవిజ్ఞానము.

(విద్వాన్ శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి)

"ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా"*

విశ్వకల్యాణమునకు "ధర్మము" మూలమగుచున్నది. ధర్మము సత్కీర్తి సంధాయకము. విశ్వములోని విశిష్టకీర్తి విశ్వకల్యాణ కా కము. కాఁగా ధర్మము పరంపరా సంబంధమును బట్టి ప్రపంచ స స్థితికి మూలకారణమగు చున్నది. దీని వ్యుత్పత్త్యర్థముకూడఁ బైవిష యము నే విశదీకరించుచున్నది. విలోకింపుఁడు. "ధ్రియత ఇతి ధర్మః" "ధర్మ" శక్తిచేతనే యీ చరాచర ప్రపంచము ధరింప (నిలువ)ఁబడ చున్నది. 'ధారణాద్ధర్మమిత్యాహుః' అను సూక్తి కూడఁ బైవిషయ మునే సుస్పష్టము చేయుచున్నది.

పై విధముగా ప్రపంచ మాంగల్యమునకు మహితకారణము లైన యీ 'ధర్మములు' శ్రీ కాళిదాస కావ్యములందు సందర్భాను సారముగాఁ బొదుగఁబడియున్నవి. శ్రీ కోలచల మల్లినాథసూరి తన సంజీవినీ వ్యాఖ్యలోఁ బై ధర్మములకుఁ జక్కని ప్రమాణ వచనములను శ్రుతిస్మృతి పురాణాదులనుండి యుద్ధరించి చూపి యనేక ధర్మసూత్ర ములను పాఠకలోకమునకు సుపరిచితము చేసినాఁడు. ఈ వ్యాఖ్యయే లేనిచో కాళిదాస కవితామాధురి యిప్పటికిని మఱుఁగుపడి యుం డెడిదేమో.§

శ్రీ కాళిదాసకవి తనకుమారసంభవములోఁ బార్వతీ జననము నకు ముందుగ మైనాక (సోదర) వర్ణనమును జేసినాఁడు. '(భ్రాతృ

---

* తైత్తిరీయోపనిషత్సూక్తి.

§ "భారతీకాళిదాసస్య దుర్వ్యాఖ్యావిషమూర్ఛితా,
ఏషాసంజీవినీ టీకా తామద్యోజ్జీవయిష్యతి ॥" (మల్లినాథసూరి)
చూ. రఘువంశవ్యాఖ్యారంభము.

మతియైన కన్యకయే వివాహమునకు యోగ్యమైనది' అను భారతీయ ధర్మమును పాఠకులకుఁ దెలుపుటకే పై వర్ణనముద్దేశింపఁబడినది. ఈ ధర్మమునకుఁ బ్రమాణమును జూపుచు మన మల్లినాథసూరి తన సంజీవినీవ్యాఖ్యలో

"పితా నజ్ఞాయతే యస్యాః భ్రాతా యది న విద్యతే।
నోపయచ్ఛేత్తు తాం కన్యాం ధర్మలోప భయాత్సుధీః॥"

"ఏ కన్యకకు తండ్రి ఫలానా అని తెలియకుండునో, ఏ కన్యకకు సహోదరుఁడు లేఁడో, అట్టికన్యకను బుద్ధిమంతుఁడు వివాహమాడరాదు" ఇది ధర్మానుశాసనము. ఈ ధర్మవిషయమునే కృష్ణయజుర్వేదమంత్రప్రశ్నములోని యొక మంత్రమిట్లు విస్పష్టము సేయుచున్నది."

"అభ్రాతృఘ్నీం వరుణాఽపతిఘ్నీం బృహస్పతే."

వరుఁడు తనవివాహవేళ, నూతన వధువును వినూత్నముగ విలోకించునపుడు వరుణ దేవుని సంబోధించి 'ఈమెకు సోదర సంపద సుస్థిరమగుఁగాక'యని ముందుగాఁ గోరును. కాఁగా మన కాళిదాసు సూచించిన యీ శ్రుత్యర్థమును స్పష్టీకరించెడి స్మృతిని జూపి మన సూరి పైధర్మమును బాఠకులమనస్సులలోఁ బాదుకొల్పినాఁడు. ఈ స్మృతి ప్రమాణమునే సూరి చూపకున్నచో కాళిదాసుయొక్క భావమగమ్యగోచరమై యీ పాటికంతరించి యుండెడిదేమో? ఎవరికెఱుక? ఈపైనాక వర్ణనమును నన్నెచోడుఁడు (టెంకణాదిత్యుఁడు) కాళిదాస కావ్యము నుండియే గ్రహించి యుండనోపు. ఈ చోడకవి కాళిదాసకృతినుండి యెన్నియో విషయములను స్వీకరించియున్నాఁడు.*

ఇట్టి విశిష్ట ధర్మవిషయములు కాళిదాసకృతులలో లెక్కకు మిక్కిలిగ నున్నవనుటలో నీక్రింది యుదాహృతులే నిదర్శనములు

* చూ. "కాళిదాస నన్నెచోడకవుల కల్పనారీతులు" అను నా వ్యాసము.

కాఁగలవు. ఈ కవి, పార్వతీదేవిచే పంచాగ్ని మధ్య తపమును జేయించు సందర్భమునఁజెప్పిన శ్లోకభావమిది.

"పార్వతీదేవి తనకు నాల్గువైపులను అగ్ని ప్రజ్వరిల్లుచుండఁగా గ్రీష్మకాల మధ్యందినసమయమునఁ గన్నులు మిఱుమిట్లు గొల్పు చున్న సూర్యునిఁగన్నులు మూయక తదేకధ్యానముతోఁ జూచుచు దపము సేయసాగెను.' (చూ. కు. సం. సర్గ 5. శ్లో 20) ఈ శ్లోకములో '...చతుర్ణాంజ్వలతాంహ విర్భుజాం...' అని నాల్గు అగ్నులే పేర్కొనఁబడినవి. ఈ నాల్గు అగ్నులమధ్యను నిలిచిచేయు తపము పంచాగ్నితపము కాఁగలదా? అను సందేహము జనించును. కాని 'సూర్యుఁడుకూడ నొకయగ్నియే' అను విషయమును

'అగ్నిస్సవితా। సవితైవాగ్నిః'

అను శ్రౌతవచనము స్పష్టముచేయుచున్నది. ఈ శ్రౌతవచనార్థము నే మనమహాకవి పంచాగ్ని మధ్యతపస్సంధర్భమున మనకుఁ దెలిపినాఁడు. ఇంతియేకాక యిటనింకొక విశేషముకూడఁ గలదు. 'గ్రీష్మకాలములో పంచాగ్నిమధ్యతపమునే సేయవలయును. వర్షాకాలములో దపస్సు చేయువారు * కేవలభూమిమీఁదనే పరుండవలెను.' అను ధర్మ విశేషమునకుఁ బ్రమాణవచనము గాఁదనసంజీవినిలో'గ్రీష్మేపంచాగ్ని మధ్యస్థో వర్షాసు స్థండిలే శయః', అను వచనమును జూపినాఁడు. సూరిచూపిన యీధర్మనిదర్శనమును బట్టియే మన కాళిదాసు పార్వతి యొక్క వర్షాకాలతపమును వర్ణించుచు

"శిలా శయాం తామనికేతవాసినీం నిరంతరా స్వంతర వాతవృష్టి షు। వ్యలోకయన్నున్మిషితై స్తటిన్మయైః మహా తపస్సాక్ష్య ఇవస్థి తాః క్షపాః॥" (5-25) గిరిజ వర్షాకాలపు రాత్రులందు విపరీతమైన

* పక్క లేని వట్టినేల.

గాలివాన వేధించుచుండఁగా వట్టిఱాలపైఁ బరుండి కఠోరముగాఁ దన తపమును సాగించుచున్నది. ఇట్టి యీమె కఠోరతపమును దమ కన్నులారఁగాంచుచున్నట్లు నాఁటిరాత్రులు తమ మెఱుపుదృష్టులతోఁ దత్కఠోర మహాతపస్సునకు సాక్షులైచూచుచున్నవి. ఇట మొదటిపాదమునకుఁ బ్రమాణము "వర్షాసుస్థండిలేశయః" అని చూపఁబడినది. ఇఁక ద్వితీయపాదార్థమునకుఁ బ్రమాణమును జూపుదు సూచిమహాశయుఁడు మానవులకువలె రాత్రులకుఁగూడ నీ క్షణశక్తియున్నదని "ఆదిత్యచంద్రావనిలోఽనలశ్చద్యౌర్భూమిరాపోహృదయంయమశ్చ। అహశ్చరాత్రిశ్చఉభేచ సంధ్యే సర్వస్య జనాతి సమస్తవృత్తం॥" ప్రతి మానవుని ప్రవర్తనమును సర్వకాలసర్వావస్థలయందును గనిపెట్టుచుఁ బదునాల్గు (భూతములు) మందిసాక్షులు సర్వదా చూచుచుందురు. వారెవరనఁగా సూర్యచంద్రులు 2, అగ్ని 3, వాయువు 4, ఆకాశము, 5, భూమి 6, జలము 7, హృదయము 8, యముఁడు 9, రాత్రి 10, పగలు 11, రెండుసంధ్యలు 13, ధర్మము 14, ఈ పదునాల్గుమంది సాక్షులును అందఱియాశయములను గనిపెట్టుచుందురు. గాన ప్రస్తుతమునఁ బైపదునాల్గింటిలో నొకటియగు 'రాత్రి' యీమె మహాతపమునకు సాక్షియైయున్నది. ఈ విశిష్టవిషయమును మనమహాకవి యిట సందర్భానుసారముగ మనకు బోధించి, పాప భావపంకిలములగు కొందఱ చిత్తములకుఁ బ్రకాశమార్గమును జూపినాఁడు. ఇంతమంది సాక్షులమధ్య బ్రతుకుచున్న మానవుఁడు ఎవరికిఁ దెలియకుండునని కొనుచు మోసపుఁ బన్నుగడలతో తనవారిని మోసగించుచుఁ దన్నుధన్యున్మన్యునిగా నెంచి జీవించుట ఎంతటి మూర్ఖతాప్రభావమో కదా! ఎంతటి యుపహాస్యకరకృత్యమో కదా! న్యాయాధికారి సన్నిధిలో నొకనిని హింసించి యాహింసాకృత్యమును నొరులెఱుంగకుండఁ జేసితినని భుజము లెగురవేసికొన్నవాని కృత్యము వంటిదే పై

కృత్యముకదా! దీనికి నిష్కృతి? అనుభవము. ఇట్లే యీ కవి పుష్య మాసరాత్రులలోఁ బార్వతీదేవిచే జలములలోనుండి తపస్సుచేయించుటకుఁ బ్రమాణము, మనుస్మృతివచనము.

'అప్సువాసస్తు హేమంతే క్రమశో వర్ధయే త్తప,'

'హేమంతర్తువులలో నీళ్ళలోనుండి తపస్సుచేయువారి తపము క్రమాభివృద్ధిఁ జెందును.'

ఇట్లే మాయావటువు పార్వతితో ప్రసంగించు సందర్భమున "ఓ భామినీ! నీవు పురుషార్థత్రయములో ద్వితీయతృతీయ పురుషార్థములను వీడి మొదటిదగు 'ధర్మ'మునే సేవించుచుండుటచేఁ బురుషార్థములలోనెల్ల "ధర్మమే" శ్రేష్ఠతమమని భావించెదను.' మన కవీశ్వరుఁడు ఈశ్వరపాత్రచే నిట్లు పలికించుటలో నితనియొక్క యీ క్రింది యుపనిషదర్థవిజ్ఞానమే మూలమనుకొందును. చూ (కు. సం సర్గ 5. శ్లో. 38) "ధర్మోవిశ్వస్యజగతః ప్రతిష్ఠా। లోకేధర్మిష్ఠం ప్రజా ఉపసర్పంతి। ధర్మేణపాపమపనుదతి। ధర్మేసర్వం ప్రతిష్ఠితం తస్మాల్ ధర్మం పరమంవదంతి' చూ.(తైత్తిరీయోపనిషత్తు.) ఇట్లే మాయావటువు మాటిమాటికిని బరమేశ్వర నిందసేయుచున్నప్పుడు పార్వతి తనచెలికత్తెతో' చూ.(సర్గ 5 - 83 శ్లో)

"ఓ చెలీ! ఈ వటువింకను నీశ్వర నిందకుఁబూనుకొనుచున్నాఁడు. కనుక నీవు వీనినిటనుండి గెంటివేయుము. కారణమేమనఁగా ఈశ్వర నిందసేయువాని కొక్కనికేకాదు పాపము. ఆ నిందనువిను వారికిఁగూడ పాపమంటుకొనును" 'మహాపురుషులకుఁ జేసిన నిందను విను వారు కూడఁ బాపాత్ములగుదురు' అనుటకుఁ బ్రమాణముగా నూరి.

"గురోః ప్రాప్తః పరీవాదో న శ్రోతవ్యః కదాచన।
కర్ణౌ తత్రపిధాతవ్యౌ గంతవ్యంవా తతోన్యతః॥

“గురు (మహాత్ములగు) జనులకుఁ జెందిననిందను శిష్యులు వినరాదు. చెవులనైన మూసికొనవలెను. లేక మఱియొకచోటికైనఁ బోవ వలెను. ఎట్లైనను శ్రేయస్కామునికి గురునిందాశ్రవణము పాపజనకము. గాన దాని నెట్లయిన వినకుండనుండవలెను. ఔరా! మన మహాకవి కావ్యరత్న పేటికలో నెన్నిరకముల ధర్మరత్నములు భద్రపఱుపఁబడి నవో! ఇవన్నియు నధికారులగు పాఠకోత్తములకొఱకే యుద్దిష్టములై యున్నవికదా! శ్రీ మల్లినాథసూరియను తాళముచెవి మనకుఁ బ్రాప్తిం చనిచో నీ కావ్యరత్న పేటికలోని యమూల్యరత్నములు మనకిట్లు లభించియుండెడివికావేమో ?

ఇట్లే యీశ్వరాఽఽదేశముపై రాయబారులుగావచ్చిన సప్తర్షు లకు, ఈశ్వరునికై గిరిజనడుగవచ్చినవారికి * సమాధానముగా హిమ వంతుఁడు తన కన్యకనుగూర్చి యిట్లు పలుకును.

“అమ్మా! ఓ గౌరీ! ఇటురమ్ము. ఇదిగో సప్తర్షులు రాయబారులై యీశ్వరునికిఁ బత్నిగా నిన్నడుగ వచ్చినారు. కనుక నేనందుల కం గీకరించి నిన్ను ఆ (మహేశ్వరునికి) తపస్వికై ‘భిక్ష’గా నొసంగదలఁ చితిని. వచ్చినవారు సాక్షాన్మునీశ్వరులు. వరుఁడు విశ్వభర్త. నా గృహస్థజీవితము ధన్యమైనది.” చూ. (6-88) ఇట గిరిరాజు తన తనయను ఈశ్వరునికియ్యకొనుటను కాళిదాసు ‘భిక్ష’ అని పేర్కొను టలోఁ గల ప్రమాణమునుగూర్చి మనసూరిమహాశయుఁడు ఈ క్రింది స్మృతివాక్యముఁ జూపినాఁడు.

---

* “సుహృదస్సమవేతాన్ మంత్రవతో వరాన్ ప్రహిణుయాత్ । (వరః) మదర్థం కన్యాం వృణీధ్వం” ఇతివరాన్ ప్రేషయతి॥ చూ. ఆపస్తంబ గృహ్యసూత్రము. ఈ సూత్రమునుబట్టి నేఁటి కట్నములు నాఁడు లేవు. అని చెప్పవచ్చును.

"రత్నాది స్తంబ పర్యంతం సర్వం భిక్షా తపస్వినః"

"తపస్వికిఁ జేసెడు ప్రతిదానము అనగా రత్నము మొదలు చిన్న * మొక్కవఱకుఁ గలవస్తువులలో నేవస్తువైనను 'భిక్ష' క్రిందనే పరిగణింపఁబడును' కనుక మన మహాకవి యీ ధర్మమునుబట్టి యీ తపస్వికిఁ జేయు కన్యాదాన విషయమునుకూడ 'భిక్ష' అని వాక్రోనుటలో నెంతో ధర్మవిషయము ఈ శ్లోకరత్నపేటికలో భద్రపఱుపఁబడినదని చెప్పకతప్పదు. ఈ విషయమును మనము మన సూరిసత్తముని వలననే తెలిసికొనగలిగితిమికదా! పైశ్లోకార్థమునుబట్టి పూర్వఁ కాలమునుండియు వరుఁడు కన్యావరణార్థై తన స్నేహితులను గన్యాదాతవద్దకు "మదర్థం కన్యాంవృణీధ్వం" అని చెప్పిపంపుటయు వారి యభ్యర్థనమున కనుకూలముగా దాత "వృణీధ్వంతస్మైదాస్యామి" అని తనయంగీకారమును దెలుపుట, సనసనాతన సంప్రదాయ మిట మన మహాకవిచేఁ జక్కగఁజూపఁబడినది. ఈ యాచారముచే నాఁటి జనసంఘము నేటి వరశుల్క బాధనుండి ఎంత రక్షింపఁబడినదోకదా! ఆపస్తంబ మహర్షి మున్నగు సూత్రకర్తలు లోకకల్యాణమునుగోరియే కదా తమసూత్రములలో నిట్టిలోకహితకర సంప్రదాయములను జేర్చినారు. లోకశ్రేయస్సు, సంఘసౌభాగ్యము, తద్ద్వారమున లోకకల్యాణము అనుదీనియందు మన మహర్షులకెంత యాసక్తియో! ఎంత చక్కని మక్కువో! ఇట్లే మనమహాకవి, ఈశ్వరపరిణయ మహోత్సవానంతరమున ఈశ్వరునిచే మామగారికి నమస్కరింపఁజేయును. ఈ సందర్భములో మన సూరిమహాకవి ప్రమాణమును జూపుచు నెవరెవరు నమస్కరింపఁదగినవారో మనకిట్లు తెలియఁజేసినాఁడు.

"ఋత్విక్పితృవ్య శ్వశుర మాతులానాం యవీయసాం।
ప్రవయాః ప్రథమంకుర్యాత్ప్రత్యుత్థాయాభివాదనం॥"

* చూ. శబ్దరత్నాకరములో 'స్తంబము'

ముందుగాలేచి నమస్కరింపఁదగినవారు ఎవరనఁగా ఋత్విజులు, పిన తండ్రులు, పెత్తండ్రులు, మామగారు, తనకంటెఁ బెద్దవారైన మేన మామలు, వీరికి శ్రేయోభిలాషియగువాఁడు లేచి నమస్కరింపవలెను' ...లోకసంగ్రహమేవాపిసంపశ్యన్ కర్తుమర్హసి "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః" అను గీతావాక్యములనుబట్టి యెట్టివా రైనను ముందు తరములవారికి, అప్పటివారికిని మార్గదర్శకముగా స్వస్వ ధర్మము నాచరించవలెను" అను ధర్మరహస్యమును దెలుపుటకే మన కాళిదాసు మహేశ్వరునిచే మామగారైన హిమవంతునికి వందనముచేయించినాఁడు. ఇట్టి భారతీయసంప్రదాయములు ఒక్క భారతదేశమునకేకాక ప్రపంచమునకే శ్రేయోదాయకమనుటలో సందేహము లేదు. చూ. కు. సం. (సర్గ. 7-శ్లో 54) ఇట్లే "ఈశ్వరుఁడు పునస్సంధానాఽగారమునఁ బ్రవేశించినాఁడు" అను సందర్భమున మన కాళిదాసు 'భూమిపైఁ బక్క (శయ్య) కలకేళీగృహమును బ్రవేశించి నాఁడ'ని తెలిపినాఁడు. '...క్షితివిరచితశయ్యం కౌతుకాగారమాగాత్॥' చూ. (కు. సం. సర్గ. 7 శ్లో 94)

ఈ యాచారము (సంప్రదాయము) నకుఁ బ్రమాణమును జూపుచు మనమల్లినాథ యజ్వ ఆశ్వలాయనసూత్రము నుద్ధరించి నాఁడు. (7-94)

"అతఊర్ధ్వం అక్షారలవణాశినౌ, అధశ్శాయినౌ, బ్రహ్మచారిణౌస్యాతాం" ఈ విషయమునే ఆపస్తంబ సూత్రకారుఁడు కూడ 'త్రిరాత్రముభయోరధశ్శయ్యా బ్రహ్మచర్యంక్షారలవణవర్జనంచ" అని సూత్రించినాఁడు. అనఁగా వివాహానంతరమున మూఁడురాత్రుల వఱకు ఆ నూత్నదంపతులు ఉప్పు, కారములేని సాత్వికాహారము తినుచుఁ గ్రిందఁబరుండి బ్రహ్మచర్యము సలుపవలెను. ఈ సూత్రార్థ

మునే ఆరోగ్యశాస్త్ర మనఁదగిన కామశాస్త్రమునిట్లు విస్పష్టముగా వివరించుచున్నది.

"అథపరిణయరాత్రౌ పరిక్రిమేన్నైవకించిత్ తిస్సృషు చరజనీషు స్తబ్ధభావాధునోతి। త్రిదినమిహనభింద్యాద్బ్రహ్మచర్యం సచాస్యా హృదయమనురుధ్య స్వేచ్ఛయానర్మకుర్యాత్॥" ఇప్పటి కొంతమంది వరులు ఈ శ్లోకార్థమును దెలియఁదగియుండిరి. "వివాహమునాఁటి రాత్రి వరుఁడు ప్రారంభోత్సవమునకుఁ బ్రయత్నించరాదు. కారణ మేమనఁగా నూతనవధువు వివాహత్రిరాత్రపర్యంతము భావచలనము లేక స్తబ్దత చెందిన భావముతోనుండును. గనుక నీత్రిరాత్రములలో వరుఁడు బ్రహ్మచర్యవ్రతదీక్షితుఁడు కావలెను. ఇచ్చట నింకొక విశేషముకలదు. కృష్ణయజుర్వేదీయ మంత్రప్రశ్నములలో నొక మంత్రార్థమును బట్టి స్త్రీకి మొదటివరుఁడు సోముఁడనియుఁ దరువాతివాఁడు గంధర్వుఁడనియు మూఁడవవాఁడు అగ్ని యనియు నాల్గవవాఁడు మనుష్యుఁడనియుఁ గలదు * కనుక సోముఁడు గంధర్వునకు, గంధర్వుఁడగ్నికి, అగ్నిమానవునకుఁ గన్యకనీయవలెను. కనుక నాల్గవవాఁడైన మానవవరునికి నాల్గవరోజుననే ఆ నూత్నవధువుపై అధికార మేర్పడును. కనుక నీ భారతీయసంప్రదాయమునుబట్టి వివాహములో నాల్గవ రోజు చేయఁదగిన శేషహోమపునస్సంధానమంత్రములను పురోహితులు కేవలవాచికముగా నేకరువు పెట్టుచుండుట నేఁటికిని భారతదేశమున సంప్రదాయమై యున్నది. దీనినే "శేషగ్ంసమావేశనేజపేత్" అని ఆపస్తంబుఁడు సూత్రించినాఁడు. పై సూత్రములలోని పరమార్థమును బాగుగ గుర్తెఱిగిన మన మహాకవి "క్షితివిరచితశయ్యం

---

* "సోమః ప్రథమోవివిదే గంధర్వోవివిద ఉత్తరః। తృతీయో అగ్నిష్టేపతిస్తురీయస్తే మనుష్యజాః।...' (మంత్రప్రశ్నము)

కౌతుకాగారమాగాత్" అని వర్ణించి సూరిమహాశయుని ముఖమున మనకుఁ బైవిశిష్టధర్మవిషయములను విస్పష్టము చేసినాఁడు. భారతీయ భవ్యసంప్రదాయ రత్నములకుఁ గాళిదాస కావ్యములు రత్నపేటిక లనుట సమంజసమే కదా!

ఇట్లే మునులు సంధ్యాసమయమున అర్ఘ్యప్రదానము విడిచి రను సందర్భమున మన మహాకవి యిట్లనుచున్నాఁడు.

'అర్ఘ్యప్రదానసమయములో శాస్త్రజ్ఞులైన మునులు తమ కాలిమడమలు నేలకుఁ దగులకుండఁ బైకెత్తి పవిత్రోదకములుకల దోసిళ్ళతో నర్ఘ్యప్రదానము లిచ్చుచు నక్షత్రోదయమునఱకు గాయత్రినిదమలో జపించుచున్నారు.' దీని మూల మిట్లున్నది.

'పార్ష్ణిముక్తవసుధా స్తపస్వినః పావనాంబురచితాంజలిక్రియాః।
బ్రహ్మగూఢమభిసంధ్యమాదృతాః శుద్ధయే విధివిదో గృణంత్యమీ॥'

చూ. (కు. సం. సర్గ 8. శ్లో 47) ఇట మునులు తమ కాలిమడమల లెత్తి యర్ఘ్యప్రక్షేపణ మొనర్చుటకుఁ బ్రమాణముగా శ్రీసూరి శ్రౌతిస్మృతివాక్యమిట్లున్నది.

"గోశృంగమాత్ర ముద్ధృత్యముక్తపార్ష్ణిః క్షిపేజ్జలం" మఱియు పద్యతృతీయపాదమునకుఁ బ్రమాణమిచ్చుచు సూరి 'జపన్నాసీత గాయత్రీం ప్రత్యగాతారకోదయాత్" అని చూపినాఁడు. "విధివిదః" అను విశేషణముచే "జ్ఞాత్వాకర్మాణికుర్వీత" అనఁగా మనము చేయు ప్రతికర్మము నర్థవంతముగను ఆదరముతోను జేయవలయుననియు "శుద్ధయే" అను పదముచే నట్టి యర్థవత్క్రియాచరణము మానవుని చిత్తశుద్ధికిఁ గారణమై మోక్షప్రదమగుననియు నిటఁ బాఠకోత్తములకుఁ దెలుపుచు (కాంతాసమ్మితముగా) నిట్టి కర్మాచరణముతో మోక్షము పొందవలెనని కాళిదాసకవి పాఠకులను బ్రోత్సహించుచున్నాఁడు.

ఇట్లే యీశ్వరుఁడు తాను సంధ్యాకాలములోనే సంధ్యవార్చు టకుఁగల కారణమును దన ప్రాణేశ్వరికిఁ దెలుపుసందర్భమున మన మహాకవి యీశ్వరముఖమున 'ఓ కోమలాంగీ! పూర్వము బ్రహ్మ, అగ్నిష్వాత్తు' మున్నగు పితృదేవతలను సృజించిన పిమ్మట తాను విసర్జించిన శరీరమే సంధ్యారూపమై ద్విజులచే సాయంప్రాతస్సమయ ములయందు సేవింపఁబడుచున్నది. ఓ మానినీ! (ఆలోచనలేనిదానా! అని సంబోధనకర్థము) ఈ సంధ్యసాక్షాత్ బ్రహ్మస్వరూపమేమై యుండుటచే నిట్టి సంధ్యయందు నాకింతటి గౌరవముకలదు." చూ. కు. సం. (8-52) ఈ విశిష్ట ధర్మవిషయమునకుఁ గల ప్రమాణమును మనసూరి విద్వన్మణి భవిష్యత్పురాణమునుండి ఇట్లు ఉద్ధరించినాఁడు.

"పితామహః పితౄన్ సృష్ట్వామూర్తిం తాముత్ససర్జహ ।
సా ప్రాతస్సాయ మాగత్య సంధ్యారూపేణ సేవ్యతే ।
ఏతాం సంధ్యాం యతాత్మానో యేతు దీర్ఘముపాసతే ।
దీర్ఘాయుషో భవిష్యంతి నీరుజః పాండునందన ॥"

పై భావమే యీ శ్లోకములో సమముగాఁ జూపఁబడినది.

ఇట్టి ధర్మసూక్ష్మము లీ కుమారసంభవమున నింకను గలవు. ఇఁక నీ కవి రఘువంశకావ్యములోఁ జూపిన ధర్మవిషయములను విలో కించుదము.

దిలీపమహారాజు భార్యాసమేతుఁడై వసిష్ఠాశ్రమముఁజేరి యట వసిష్ఠుని సందర్శించు సందర్భమున "స్వాహాదేవిచే అగ్నివలె, అరుం ధతీదేవిచే ఆరాధింపఁబడుచున్న వసిష్ఠమహర్షిని, దిలీపుఁ డాతని యను ష్ఠానాంతర కాలమందు సందర్శించెను" అని చెప్పినాఁడు. చూ. రఘు వంశ కావ్యము (సర్గ 1. శ్లో 56) ఇట వసిష్ఠుని అనుష్ఠానానంతరమందే రాజామునిని సందర్శించుటకుఁ గల కారణమును జూపుచు సూరి తన సంజీవినిలో

"సమిత్పుష్పకుశాఽగ్న్యంబు మృదన్నాక్షత పాణికః ।
జపం హోమంచకుర్వాణో నాభివాద్యోద్విజోభవేత్ ॥''

"బ్రాహ్మణుఁడు సమిధలనుగాని పుష్పము మొదలైన వానినిగాని చేతఁబట్టి హోమము సేయుచున్నప్పుడును లేక జపము సేయుచున్నప్పుడును వచ్చిన యతిథు లాతని నమస్కరింపఁవలదు.'' అని యనుష్ఠానమధ్యములో అభివాదన నిషేధమును జెప్పినాఁడు. ఈనిషేధము తెలియని కవి యిట్లు చెప్పఁగలఁడా? తెలిసినవాఁడు కనుకనే కాళిదాసు తదనుష్ఠానమందే రాజు మునిని దర్శించినాఁడని పై ధర్మవిషయమును విశదపఱిచినాఁడు. ఇట్లే వసిష్ఠుఁడు దిలీపునిగూర్చి కుశలప్రశ్న చేయు సందర్భములో "పప్రచ్ఛకుశలం రాజ్యే రాజ్యాశ్రమమునిం మునిః ॥ (1-58) "కుశలము" నడిగెను.'' బ్రాహ్మణుని "కుశలము' అడుగవలెను. ఇట్లే క్షత్రియుని "అనామయమా" అని యడుగవలెను. ఈ నియమమునుబట్టి యిటక్షత్రియుఁడైన దిలీపుని"అనామయమా'' అనియడుగవలసియుండఁగా రాజు బ్రాహ్మణునకుఁ దగినట్లు"కుశలమే'' అనియడిగినాఁడు. కారణము 'రాజ్యాశ్రమమునిం' అను విశేషణముచే నట్టి యర్హత ఈ రాజునకుదగియున్నదని మహాకవి యిట మనకు సూచించినాఁడు.

తనయింటికి వచ్చినవారిలో నేయేవర్ణములవారి నేయేరీతిగాఁ గుశలప్రశ్నము గావించవలెనో? అను ప్రశ్నకు సమాధానముగా సూచి మనుస్మృతినుండి యీ ప్రమాణముం జూపెదను.

"బ్రాహ్మణం కుశలం పృచ్ఛేత్ క్షత్రబంధుమనామయం ।
వైశ్యం క్షేమం సమాగమ్య శూద్రమారోగ్యమేవచ॥''

ఇట్లే దిలీపరాజేంద్రుఁడు వసిష్ఠమహర్షి యొద్దకేగి తన సంతానాభావమునకుఁ గారణమడుగు సందర్భమున వసిష్ఠమహర్షి "రాజా నీవు పూర్వ మొకసారి దేవేంద్రుని సేవించి తిరిగి భూలోకమునకు వచ్చు సమయమున మార్గమధ్యమునఁ గామధేనువు కల్పవృక్షచ్ఛాయనాశ్రి

యించి యున్నది' (1-75) "ప్రదక్షిణముచేసి నమస్కరింపఁదగిన యీ కామధేనువును నీవుపేక్షించితివి. కారణమేమనఁగా ఋతుస్నాతమైయున్న నీ భార్యను కలిసికొననిచో "ధర్మహాని కల్గును." అను నాలోచనలోనున్న నీవా ధేనువును జూడలేదు" (1-76) నన్నిట్లవమాన పఱిచితివి గాన నా సంతానమును సేవింపనిదే నీకు సంతానము కలుగకుండుఁగాక" యని యీ కామధేనువు నిన్నుశపించెను" (1-77) ఇందు డెబ్బదియేడవ శ్లోకములో మన కవి మన కెన్నెన్నో ధర్మసూక్ష్మములను దెలిపినాఁడు. ఆ సూక్ష్మములను సూరి మనచేతికి అనఁటిపండు నొలిచియిచ్చినట్లిచ్చినాఁడు. చూడుఁడు. "ఋతుస్నాతయైన భార్యను దప్పక కలిసికొనవలెను అనుటకుఁ బ్రమాణముగా మనుస్మృతినుండి

"ఋతుకాలాఽభిగామీస్యాత్ స్వదారనిరతస్సదా।"

ఇట్లు ఋతుకాలములో భార్యను గలిసికొనని భర్తకుఁ గలుగుదోషమెట్టిదో తెలుఁపుచు పరాశరస్మృతినుండి

'ఋతుస్నాతాంతు యో భార్యాంస్వస్థస్సన్నాధిగచ్ఛతి।
బాలగోఘ్నాపరాధేనయుజ్యతేనాఽత్రసంశయః॥'

'ఋతుస్నాతయైయున్న భార్యను స్వస్థచిత్తుఁడై కలిసికొననిభర్త బాలహత్యాజనిత పాపముతోఁదుల్యమయిన పాపము చేసినవాఁడగును

ఇచ్చట' ఋతు' కాలమునుగూర్చి 'కాలామృతము' అను జ్యోతిశ్శాస్త్రగ్రంథములో నిట్లు తెలుపఁబడినది. *

---

* ఈ గ్రంథము వావిళ్ళవారిచేఁ బ్రకటితము. టీకాకారుఁడు వేంకటయజ్వ అనియున్నది. 'ఉత్తరకాలామృతము' అను జ్యోతిశ్శాస్త్రగ్రంథము కాళిదాసకృతమని దాని ముఖపత్రముపైఁగలదు. దానికిది పూర్వమైనచో నీ "కాలామృతము' కూడ కాళిదాసకృతమనవచ్చునుగదా.

'స్త్రీణామా ర్తవదర్శనాది దివసేస్వథషోడశస్తు తు పాః ।
పుత్రార్థీవర యేత్ఫూసుసుముఖీం తాస్వేవశుద్ధాంకృశాం॥'

... ...

... ... (చూ. కాలామృతము ప్రథమబిందువు)

ఈ ఋతురాత్రిలలో నేవిసంగమార్హములు? ఈ ప్రశ్నకు

"ఋతుస్వాభావికా స్త్రీణాంరాత్రయష్షోడశస్మృతాః ।
తాసామాద్యాశ్చతస్రస్తు నింద్యా ఏకాదశీచయా ।
త్రయోదశీచ శేషాస్తు ప్రశస్తాదశరాత్రయః ॥' (మనువు)

"రజోదర్శనము మొదలు పదునాల్గు రాత్రిలు స్త్రీలకు ఋతురాత్రిలు. అందు మొదటినాల్గురాత్రిలు, ఏకాదశీత్రయోదశులు కాక మిగిలిన సమదివసరాత్రిలు సంగమార్హము లు. గాన ప్రస్తుతములోఁ జైనిచేకొనిన దశరాత్రులలో దిలీపుఁడు స్వర్గమునుండి తిరిగి వచ్చునది ఒకరోజై యుండవలెను.

దిలీపుఁడు భార్యాసహితముగ వసిష్ఠాశ్రమములో మొదటి రాత్రిని నియమముతోఁ గడపెను. అను సందర్భములో మన కవి కులగురువు చెప్పినశ్లోకార్థమిది. 'దిలీపుఁడు నియమవతియగు భార్య సహాయముగలవాఁడై గురునిర్దిష్టమైన పర్ణశాలలో దర్భలచాపపైఁ బరుండి వసిష్ఠుని శిష్యులయధ్యయనముచే సూచింపఁబడిన తుదిభాగముకల రాత్రిని గడపెను.'

"......తచ్ఛిష్యాఽధ్యయన నివేదితాఽవసానాం
సంవిష్టః కుశశయనే నిశాంనినాయ' రఘు (1-95)

ఈయపరరాత్రియందలి యధ్యయన సంప్రదాయమునకుఁ బ్రమాణము నుఁ జూపుచు సంజీవినిలో సూరి గౌతమధర్మసూత్రగ్రంథమునుండి

'నచాప్యపర రాత్రాదా బ్రహ్మఽధీత్యపునస్స్వపేత్"

తెల్లవాఱుజామున (మూఁడవయామములో) వేదము పఠించినవాఁడు
తిరిగి పరుండరాదు. కనుక నిశయొక్క అవసానకాలములో వేదపఠనము
మిగిలిన రాత్రిభాగములోఁ దిరిగి నిద్రించకుండుట ధర్మముగాన దిలీ
పుఁడును వేదపఠనముచే మేల్కాంచి తిరిగి పరుండక యవశిష్టరాత్రి
గడపెనఁట ఇట్లే యీ దిలీపనరేంద్రుఁడు తనభార్య గర్భవతియై
పిమ్మట ఆమెకు 'పుంసవనము' మొదలగు సంస్కారములు జరిపించెను
"...యథాక్రమం పుంసవనాదికాః క్రియాః... సదృశీర్వ్యధత్తసః"
(రఘు సర్గ 3 శ్లో 10)
షోడశకర్మల వరుస యిట్టిది.

"గర్భాధానం పుంసవనం సీమంతో జాతకర్మచ । ... అను
వరుసనుబట్టి మన మహాకవి యిట పుంసవనము పిమ్మట 'సీమంతము'
ను గ్రహించినాఁడని తెలియును. ఈ 'పుంసవనము' స్త్రీలకు 2, 3
మాసములలోఁ జేయఁదగినట్లు 'ద్వితీయే తృతీయే వా మాసి పుంసవనం'
అను స్మృతివాక్యము ప్రమాణము. ఈ పుంసవనము పురుషనక్షత్ర
ములోఁ జంద్రుఁడు కూడియున్నప్పుడు చేసినచో పురుషసంతతి కలుగు
నఁట. ఈ సంస్కారనామములోనే యీ విషయము విలీనమై యున్నది.
"పుమాన్ సూయతే అనేనకర్మణా ఇతి పుంసవనం." దీనికిఁ బిమ్మట
'అనవలోభనం' అను సంస్కారాంతరము నాల్గవమాసమున గర్భిణీ
స్త్రీకి జరుపఁదగియున్నట్లు 'చతుర్థేఽనవలోభనం' అను ఆశ్వలాయన
సూత్రకారుని వాక్యము వ్యక్తము సేయును. ఇఁక "షష్ఠే అష్టమే వా
సీమంతోన్నయనం" అను యాజ్ఞవల్క్యమహర్షి వాక్యమునుబట్టి
'సీమంతము' 6, 8 మాసములలోఁ గర్తవ్యము. ఈ స్మృతివిహిత
ధర్మములన్నిటిని బాగుగాఁ దెలిసిన మన కవీశ్వరుఁడు సందర్భాను
సారముగ మనకుపదేశించుటద్వారమున ధర్మరక్షణతోఁ లోకరక్షణము
చేసి లోకకల్యాణకర [illegible]నాఁడు "ధర్మోరక్షతి-రక్షితః" అని కదా

సూక్తి. పై సంస్కారములవరుసలో 'సీమంతము' తరువాతది 'జాత కర్మ'.* దీనినిగూర్చి మనమహాకవి "దిలీపునకుఁ" బుత్రుఁడుకలిగెను. అను సందర్భమున ఒక శ్లోకములో "...మణిరాకరోద్భవః ప్రయుక్త సంస్కార ఇవాధికంబభౌ" (3-18) అనెను. ఇఁట నీకవి "సంస్కార" పదముతో జాతకర్మ సంస్కారమువలన శిశువునకు, కషణాదిసంస్కారమువలన మణికివలె క్రొంగ్రొత్తశక్తులు, ప్రకాశము లగునని సూచించినాఁడు. ఆశ్లోకభావమిది. "దిలీపునకుఁ బుత్త్రుఁడుదయించినంతనే జాతకర్మ సంస్కారము చేయబడెను. ఈ సంస్కారముచే శిశువు, కషణాది సంస్కారముచే గనినుండి పుట్టిన మణివలె నధికముగఁ బ్రకాశించెను. (రఘు. సర్గ 3. శ్లో 18) ఈ సంస్కారము శిశువులకుబొడ్డుకోయకపూర్వమే చేయఁదగియున్నట్లు "ప్రాఙ్నాభికృంతనాత్పుంసో జాతకర్మవిధీయతే" అను మనుస్మృతి వాక్యమువలన వ్యక్తమగుచున్నది. మఱియు నీ సంస్కారముచే శిశువునకు జన్మకాలమందు సంక్రమించిన బాలారిష్టాదిదోషములుపశమిల్లి, ఆయురారోగ్యైశ్వర్యములు గల్గునని జాతకర్మఫలశ్రుతి యిట్లు తెలుపుచున్నది.

"జాతస్యారిష్టనాశాయనీరోగత్వాయసర్వదా ।
దీర్ఘాయుష్యాయ చాన్యత్ర సర్వసంపత్సమృద్ధయే ।
జన్మన్య శుభయోగానాం వినాశాయ విశేషతః ॥

(బార్హస్పత్య సంహిత)

---

* 'జాతమాత్రేణకర్తవ్యం కర్మజాతకర్మ'. ఈ సంస్కారములోని విశేషములు, ఎన్నెన్నికలలో దీనికిఁగల సంబంధము మొదలగునవి. నా రచితమైన 'ఉపనయనమంత్రార్థ దర్పణము'లో దర్పణములోవలెఁ జూపఁబడినవి.

ఈ విషయము మన యనుభవములోఁగూడ ప్రత్యక్షమైనదే. పరికింపుఁడు. అభ్యంగనాది సంస్కార విరహితమైన శరీరము మాలిన్యయుతమై క్రమముగ అనారోగ్యభూయిష్ఠమై రోగాణువులచే వ్యాపింపఁబడి స్వాధీనమునుండి శిథిలమైనట్లు, జాతకర్మాది సంస్కారవిరహితమైన వాని బుద్ధివృత్తులు, మనస్సు బాలారిష్టాదిగ్రహములచేఁ బీడితములై పటుత్వముదప్పి స్వాస్థ్యవిరహితములై ఎండ లేనిప్రదేశములోఁ బెరిఁగిన మొక్కలవలె వెల్త్రెలలువేసి రూపఱియుండుననుట అనుభవసిద్ధము లేకదా! దీనినిబట్టి ద్విజులకు జాతకర్మాది సంస్కారములు మణులకుఁ గషణాది సంస్కారములవలె స్వశక్తిప్రకాశకములై నిజప్రాభవములను వెలువరించునని యిట మన కాళిదాసు 'ప్రయుక్త సంస్కార ఇవాధికం బభౌ' అను సందర్భమును బురస్కరించుకొని చక్కఁగ సూచించినాఁడు. ఇఁకఁ జౌల సంస్కారమును, ఉపనయన సంస్కారమునుగూడ రఘుకుమారునికి మనమహాకవి జరిపించినాఁడు. చౌలము అనఁగా పుట్టువెంట్రుకలు తీయించుట. ఇది ద్విజబాలునికి మూఁడవయేట చేయఁదగినట్లు "జన్మనోఽధి తృతీయేవర్షేచౌలం పునర్వస్వోః" అను ఆపస్తంబసూత్రము సూత్రించినది. మొదటి సంవత్సరములోఁగూడఁ జేయవచ్చునని మనువుమతము.

'చూడాకార్యా ద్విజాతీనాం సర్వేషామేవధర్మతః।
ప్రథమేబ్దే తృతీయేవాకర్తవ్యా శ్రుతిచోదనాత్ ॥'

ఇట్లే ఉపనయన సంస్కారమునకుఁగూడ ద్విజబాలురకు గర్భషష్ఠము మొదలు గర్భాష్టమువఱకు యుక్తకాలమైనట్లు "గర్భాష్టమేషు బ్రాహ్మణముపనయీత। * గర్భైకాదశేషు రాజన్యం, గర్భద్వాద

* శిశువుమాతృగర్భములోనున్న తొమ్మిదిమాసములు కలిపిలెక్కింపఁగా అనఁగా 7 సంవత్సరముల 3 మాసములకు బాలునికి గర్భాష్టమవత్సరము మొదలగును. ఇట్లే గర్భషష్ఠాదులుకూడ లెక్కింపవలెను.

శేషం వైశ్యం॥" అని ఆపస్తంబము సూత్రించుచున్నది. క్షత్రియ వైశ్యులకు వరుసగా గర్భైకాదశ (11) సంవత్సరము, గర్భద్వాదశ వత్సరము ఉపనయనమునకు యుక్తకాలములు. (ఇంక గామ్యసంవత్సర ములలో నుపనయనము చేయుటనుగూర్చి మనువే "పంచమే బ్రహ్మ వర్చసకామం, అష్టమమాయుష్కామం, దశమే అన్నాద్యకామం. ఏకా దశ ఇంద్రియకామం ద్వాదశే పశుకామమితి" "ఆషోడశాద్బ్రాహ్మ ణస్య అపతితా సావిత్రీ" అని పదునాఱేండ్లవఱకు ఉపనయనకాలమును బొడిగించి మన మహర్షులు మనకు జాలినంత యవకాశమును గల్పిం చినను మనము కుమారులకు (పదునాఱవ సంవత్సరములోనైనను ఈ ముఖ్యసంస్కారమును జేయమికిఁ గారణము కిరీటస్థానము నాక్రమించిన (తలకెక్కిన) మన ఉపేక్షాభావమే మూలము అనవలెను గదా. అదనుపదును లేక నాటిన విత్తనమువలె సకాలములోఁ జేయని సంస్కారము వ్యర్థమే యగునుగదా!

ఇట్లే ఉపనయనానంతరమున రఘుకుమారుడు తండ్రినుండి అస్త్రవిద్యను నేర్చునపుడు నల్లయిఱ్ఱి చర్మమును ధరించి సమంత్రక ముగా అస్త్రవిద్యనభ్యసించుచున్నాఁడని మనమహాకవి "త్వచం స మే ధ్యాం పరిధాయ రౌరవీం *

అశిక్షతాస్త్రం గురుణైవ మంత్రవిత్॥ (రఘు 3-31)

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు క్రమముగా విద్యాభ్యాసకాలమందు ధరించవలసిన చర్మయజ్ఞోపవీతము లివియని మల్లినాథసూరి మన కెఱుకపఱిచినాఁడు.

'కార్ష్ణరౌరవబాస్తాని చర్మాణి బ్రహ్మచారిణః।

వసీరన్నానుపూర్వేణ శాణక్షౌమాదికానిచ॥ (మనుస్మృతి)

ఈ రచర్మయజ్ఞోపవీతధారణము వటువులకు దీర్ఘాయుర్దాయకరమని మఱియొక విశేషవాక్యమిట్లు నుడువుచున్నది.

---

* రురుర్మహాకృష్ణసారః। యాదవ నిఘంటువు.

"అజినో త్తరీయోహి దీర్ఘాయుర్భవతి"

ఇంకను ఇట్టి ధర్మవిశేషము లీ కాళిదాసకృతులం దెన్నియేనికలవు. రఘువంశము 3-3 లో గోదానవ్రతమునుగూర్చి 3-70 లో వానప్రస్థ ధర్మమునుగూర్చి 4-25 శ్లోకములో యుద్ధయాత్రకు బైలుదేఱుటకు ముందు చేయఁదగిన కృత్యవిశేషములనుగూర్చి ధర్మవిశేషములుకలవు.

పైవిధమునఁ గాళిదాసు తన కావ్యములలో సూత్రప్రాయముగాఁ జెప్పిన విశిష్ట వివిధ ధర్మవిశేషములను మన మల్లినాథసూరి ప్రసిద్ధ ప్రమాణములతో వివరించి తన "సంజీవిని"ని భారతీయ జీవితమునకు సంజీవినిగనే యొనర్చినాఁడు. మానవుఁడు తనజీవిత రక్షణకొఱకు ధర్మరక్షణ చేయుట అగత్యమైయున్నట్లు "ధర్మోరక్షతిరక్షితః" అను సూక్తి సువ్యక్తము చేయునుగదా! ఇట్టి ధర్మములన్నియుఁ బ్రత్యేకముగా నారోగ్యసూత్రమిళితములై మానవునకు అవశ్యానుష్ఠేయములగుచునేయున్నవి. ఇట్టిధర్మమును రక్షించలేని మానవుఁడు తనను దానురక్షించుకొనలేని స్థితిలోనున్నాఁడనియే చెప్పవలెనుగదా! "యతోధర్మ స్తతోజయః" అను సూక్తినిబట్టి ధర్మములేనిచోట నెట్టి జయముకలుగదని స్పష్టమగుచున్నది. కనుక మానవునకు సర్వాభ్యుదయ సంధాయకమైనది ధర్మమే యనియు, నిట్టి స్వధర్మాచరణముతో మానవాళి, ఇహపరసౌఖ్యములను బడసి ముక్తిపొందుట యుక్తమనియుఁ గాళిదాసకావ్యలక్ష్మి కాంతాసమ్మితముగ లోకమునకు బోధించి విశ్వకళ్యాణదీక్షతో దీపించుచుః బ్రపంచప్రశస్తిని సంపాదించుకొని కొమరుమిగులుచున్నదని నివేదించుచున్నాను.

రత్నచ్యుతి

—శ్రీ మోచెర్ల రామకృష్ణకవి.

సీ॥ కువలయచక్రిమాఘోషించి కంపించె
నస్తంగమించెనా యాప్తుఁడంచు
దెసలేనివారమైతి మటంచు నాక్రంద
నమొనర్చెనా శాంగనాచయంబు,
పండితుని మొడంద పన్నీరుపూతావు
లిఁక నాకులేవని యేడ్చెగాలి,
నాకసాచివ్యంబునకు ముప్పుగల్గునే
మోయంచుగీష్పతి యుమ్మలించె,

గీ॥ జ్వలనుఁ డనివార్య దుర్శోకసాధ్వసమున
వివశుఁడగుచు, విలాపించి, విహ్వలించి,
కుమిలె జహ్వరులాలును గూర్చినట్టి
పరిశయవృత్తాంత సత్వర వ్యాపనమున.

ఉ॥ ఐహికలోక జీవితసమాప్తి నతం డెటనల్పినాఁడొ, యా
గేహముఁజేరి యాసుకృతికిన్ జనులిచ్చిన తర్పణోగ్రసు సం
దోహము మానవాళి పదధూళినడంచి కళిందనందినీ
స్నేహముఁ గోరిపోయికలసెన్ విలపించెడి తన్మహానదిన్. 2

చం॥ ప్రకటితశుద్ధసత్త్వయగు భారతరాజ్యరమాలలామ, యా
త్మకుఁ బ్రియమై, తదీయగళమండన మధ్యగమైతనర్చుచున్
సకల జగత్ప్రమోదకర శాంతికశాద్యుతులన్ వెలార్చు, నా
యకమణి రాలిపోయెనకటా! దుఃతిక్రమకాలవాహినిన్. 3

చ. మృతి మనవంటి మానవుల కే; యమృతుల్ సుకృతుల్;
స్వతంత్ర భా
రతజనతా మహాభ్యుదయ రాజ్యరమా రథచోదకుండు, పం
డిత జవహర్ పరిధానిక కమనీయతదీయయశశ్శరీర మీ
క్షితిపయి శాశ్వతంబుగ వసించు వినూతన కాంతు లీనుచున్. 4

ఉ. ఆ మహనీయమూర్తి విమలాశయదీప్తు లఖండవిశ్వ భ
వ్యామృతమార్గదర్శక దయాకరదీపిక లౌనుగావుతన్
ప్రేమరసస్వరూపు నతనిన్ గికురించిన వారి గెల్పుటన్
బూమెలు మాయుతన్ భరతభూమికి సౌఖ్య జయంబు
లబ్బుతన్. 5

శ్రీ పీఠికాపురాధీశ్వరుల షష్టిపూర్త్యుత్సవ సందర్భమునఁ జదివిన శ్లోకములు.

ఉభయభాషాప్రవీణ : శ్రీమతి రావూరి వేంకటసుబ్బమ్మ.

1. జయతు జయతు శ్రీమాన్ పీఠికాపుర్యధీశో
జయతు నిఖిలశాస్త్రార్థతత్త్వసద్బుద్ధిదీప్రః .
జయతు జయతు సర్వైస్స్తూయమానో గుణజ్ఞైః
జయతుచ సనితాంతం రావువంశాబ్ధిచంద్రః.

2. కేచిచ్ఛస్త్రనిరూఢశక్తికలితాః కేచిచ్చశాస్త్రప్రియాః
కేచిత్సంచితవైభవాః స్వకమభివ్యాప్తార్తదీనావనాః
సంత్యద్యాపిహి తత్ర తత్ర నతు తేష్వేకోపి సర్వప్రియాః
త్వం సర్వత్రిచ దత్తవైభవనిధిర్జేగీయసే సర్వదః.

3. సాక్షాద్బ్రహ్మసమాజమందిరవరస్త్వద్ జ్ఞానవారాన్నిధేః
నిత్యం పండితమండలీ ప్రవదతి త్వామేవ శాస్త్రప్రియం
దృష్ట్వాచాంగ్లకళావివర్ధన కళాశాలాం భవన్నిర్మితాం
నిమ్నోద్ధారక దక్షకత్వమపి తే మన్యేహ్యపూర్వోపమమ్.

4. శ్రీమత్పీఠపురీ ప్రభుత్వవిభవం త్వాం రామరాయాత్మజం
యస్యాపిస్వకులక్రమాప్త సచివాస్తే సుబ్బరాయాదయః
యస్యాభూన్మహిషీదయాదిమహితా సాధ్వీచ చిన్నాంబికా
తం త్వాం భూషయితుం కవిత్వవిభవే నేయం సమర్థేవకిం.

5. పూర్వోక్తైర్విభవైర్విభూషితవపుర్జేగీయతాం సంతతం
హ్యాచంద్రార్కవివృద్ధపుత్త్రవిభవస్సత్పౌత్త్రసంపత్పరః
కించానందయతు ద్వితీయమపి తే షష్ట్యుత్సవం తేజసాః
త్వత్తాన్సదృశ్య ముపేత్య పాలనపరాస్స్యుర్భారతే పార్థివాః.

::::::::::::

శ్రీనాథుని శివరాత్రిమాహాత్మ్యము - శిథిలపూరణము.

శ్రీ డాక్టరు బి. రామరాజు, ఎం.ఏ., పి.హెచ్.డి.

శ్రీనాథ కవిసార్వభౌముఁడు రచించిన శివరాత్రిమాహాత్మ్యమును ఆంధ్రసాహిత్యపరిషత్తు (కాకినాడ) వారు చాలసంవత్సరములక్రిందట ౧౯ వ ప్రకాశనముగాఁ బ్రచురించినారు. లభించిన యేక శిథిలప్రతి యాధారముగా శ్రీ కట్టి సాంబమూర్తిశాస్త్రిగారు దానిని పరిష్కరించిరి. ఆనాఁడు వారికి లభించినది నాలుగాశ్వాసముల గ్రంథమే కనుక శ్రీనాథుఁ డంతే రచించియుండునని యూహించి తమపీఠికలో నటులే వ్రాసిరి. ఒకటి రెండక్షరములు శిథిలములైన చోటులందుఁ బూరించిరి. మిక్కిలిగా శిథిలములైన తావులందుఁ జుక్కల గుర్తులుంచియు ముద్రించినారు. ఇందుల కాంధ్రసాహిత్యలోక మంతేనియు వారికి ఋణపడియున్నది.

ఇటీవల శివరాత్రి మాహాత్మ్యము తాళపత్రగ్రంథ మొకటి నాకు మెదకుమండలమున దన్నారముగ్రామమున నొక జంగము దేవరకడ లభించినది. వ్రాయసగాని పేరుగాని వ్రాసికొన్న తేది గాని లేవు. తాటియాకుల స్థితినిబట్టియు, లిపినిబట్టియు ఈ ప్రతి వయస్సు 250-300 ఏండ్లమధ్యన నుండునని యూహించుచున్నాను. వ్రాయసగాని పొరపాటులు కొన్నియున్నను, ఇది మిక్కిలి చక్కని ప్రతి. చక్కనిదే కాక సమగ్రమైన ప్రతికూడ. అనఁగా నిది యైదాశ్వాసములుగల ప్రతి. దీనిలో నైదాశ్వాసము లుండుటయే కాక ముద్రితములైన నాలుగాశ్వాసములందు లేని కొన్నిక్రొత్తపద్యము లధికములుగాఁగలవు. ముద్రితప్రతిలోని శిథిలభాగములన్నియు దీనిలోఁ జక్కగా భద్రముగా నున్నవి. మీఁదుమిక్కిలి దీనిలోఁ గొన్ని పాఠభేదములున్నవి. ఈ విధముగా నీ తాళపత్రగ్రంథము మిక్కిలి ప్రశస్తమైనది. పైఁ జెప్పిన నాల్గువిషయములు దృష్టియందుంచికొని నాకు

లభించిన యీ క్రొత్తప్రతివైశిష్ట్యమును దిఙ్మాత్రముగాఁ బ్రదర్శించుటయే ప్రకృత కర్తవ్యము.

1. పంచమాశ్వాసము :— ముద్రితప్రతిలో నాలుగాశ్వాసములే యున్నవి. సుకుమారుఁడు పరమశివుని యనుగ్రహమునఁ బ్రమథుఁడగుట యందలి వృత్తాంతము. చతుర్థాశ్వాసాంతమున మునులు సూతుని "చిన్నవోయి యముండేమి చేసెఁబిదప" అని యడిగిన ప్రశ్నకు సమాధానము పంచమాశ్వాసమునఁగలదు. పంచమాశ్వాసమున ౭౧ గద్యపద్యములున్నవి. యముఁడు చిత్రగుప్తునితో సంభాషించి తన యశక్తాధికారమునుగూర్చి పరమశివునకే విన్నవింప నిశ్చయించుకొని కైలాసమున కేఁగుట, కైలాసవర్ణనము, శివునిస్తుతించుట, సుకుమారుని పాపకార్యములుచెప్పుట, శివుఁడు యమునకు శివరాత్రిమాహాత్మ్యమును శివభక్తుల లక్షణములును జెప్పుట, యముఁడు తనలోకమునకుఁ దిగివచ్చి తన భటులకు శివుఁడు చెప్పినవన్నియు మరలఁజెప్పుట యిందలి వృత్తాంతము. పంచమాశ్వాసము ప్రారంభపద్య మిట్లున్నది.

క. శ్రీదేవత ప్రియసేవక
   భూదివిజాశీర్వివృద్ధభూరిశ్రీ పు
   ణ్యోదయ! సమస్తజన సం
   మోదన శుభకరవసంత! ముమ్మయశాంతా!

2. అధికపద్యములు :— ముద్రితప్రతిలో లేనివి ఈ తాళపత్రములలో నధికముగాఁగొన్నిపద్యములున్నవి.అచ్చైనప్రతిలోనుండి తాళపత్రప్రతిలో లేనివానిఁగూర్చి ముందుగా మనవి చేయుదును. అచ్చుప్రతి ప్రథమాశ్వాసమందలి 96వ పద్యమును, ద్వితీయాశ్వాసమందలి 59, 105 పద్యములును తృతీయాశ్వాసములోని 24, 133 పద్యములును నాకు లభించిన తాళపత్రగ్రంథమునఁ గానరాలేదు.

ఇఁక నధికపద్యముల సంగతి, అచ్చుప్రతిలో ప్రథమాశ్వాసము ఆఱవ పద్యము తరువాత ఐదుపద్యములును ఆశ్వాసాంత గద్యమునకు ముం దొక మాలినీవృత్తమును, ద్వితీయాశ్వాసము 102వ పద్యము తరు వాత ఐదుగద్యములును, తృతీయాశ్వాసము 43వ పద్యము తరువాత నొకపద్యమును 121వ పద్యము తరువాత నెనిమిది గద్యపద్యములును, చతుర్థాశ్వాసము 9వ పద్యము తరువాత నాలు గద్యపద్యములును, ఈ తాళపత్రిప్రతిలో నధికముగాఁగలవు ఇట్టి యధికపద్యములం దొండు రెం డుదాహరణములు.

ముద్రితప్రతి ప్రథమాశ్వాసము ఆఱవపద్యము తరువాత తాళపత్రిప్రతిలో వీరభద్రస్తోత్రి మిట్లున్నది.

క. యుక్తాయుక్త నిరీక్షణ
శక్తుఁడు గాఁడితఁ డన కజస్రము కరుణా
సక్తమతి మమ్ముఁ బ్రోవుము
భక్తపరాధీన! వీరభద్రస్వామీ!

ద్వితీయాశ్వాసమునుండి మఱియొకపద్యము. యజ్ఞదత్తుఁడు సుశీలా దేవి సమక్షమున సుకుమారుని సంభోధించి యిట్లనుచున్నాఁడు.

గీ. అన్న! సుకుమార! యేలయ్య! యనుదినంబు
గోఱుకుఁ దనమున ధూర్తులఁగూడి తిరిగె
దకట! మీయమ్మ గాంచె నిన్నధికనియతిఁ
గోరి వీరవ్రతంబున గొడ్డు వీఁగి

(పై పద్యము రెండవ పాదము "గోరుకుందనమున ధూర్తులంగూడి తిరిగె" అనికలదు. ఈ పాదములోని మొదటిపదము గోరతనమో లేక గొఱకుఁదనమో తెలియదు. నేను మాత్రము గొఱకుఁదనముగా దిద్దినాను.)

3. శిథిలపూరణములు :— ముద్రితప్రతిలో శైథిల్యములనేకములు గలవు. వీని నన్నింటిని ఈ క్రొత్తతాళపత్రప్రతి ద్వారమునఁ బూరించుకొనవచ్చును. ఇట్టివానిలోఁ గొన్ని యుదాహరణములు. శిథిలపూరణములు కుండలీకరణములందుఁ గాంచనగును.

1. ప్రథమాశ్వాసము ప్రథమ పద్యము ప్రథమపాద మిట్లు పూరింపనగును.

   శా. శ్రీ (గౌరీ స్తనగంధసారఘుసృణశ్రీ) వాసితోరస్థలీ.

2. షష్ఠ్యంతములందు మొదటిపద్యము పూర్వార్ధ మిట్లు పూరింపనగును.

   క॥ (సత్యహరిశ్చంద్రునకును
   నిత్యప్రతిమాన) దాన నిర్మలమతికిన్.

3. ప్రథమాశ్వాసము ౧౬ వ పద్యము మొదటిపాద మిట్లు పూరింపనగును.

   ఉ॥(ఎక్కడఁబోయెనో ధరణి యిందువిభాకరు) లెం దణంగిరో

4. చతుర్థాశ్వాసము ౧౦ వ పద్యము నాల్గవపాద మిట్లు పూరింపనగును.

   రాజు (చెకుట మెఱుఁక) రా మద్దించి.

4. పాఠాంతరములు :— ముద్రితప్రతితో నీ క్రొత్త తాళపత్రప్రతిని బోల్చిచూడఁగాఁ బాఠభేదము లనేకములు కనఁబడినవి. కొన్నిచోట్ల ముద్రితప్రతి పాఠములే సమంజసములుగా నున్నవి. మఱి కొన్నిచోట్లమాత్రము తాళపత్రప్రతిలోని పాఠములే సమంజసములుగా నున్నవి. ఇట్టివానికిఁ గొన్నియుదాహరణములు. అధోరేఖాంకిత పదములకు కుండలీకరణమునందలి పదములు తాళపత్రప్రతిలోని పాఠాంతరముగా గుర్తింపఁ బార్థిన.

1. ప్రథమాశ్వాసము 75వ పద్యము.
   గీ॥ పాన్పుడిగ్గవు దురవలేపమున నెఱిఁగి. (నీవు)
2. ప్రథమాశ్వాసము 77వ పద్యము.
   గీ॥ దంభకోడావతార ముద్ధతివహించి. (కోలా)
3. ప్రథమాశ్వాసము 95వ పద్యము.
   గీ॥ సంభవించె మహాస్తంభ శంభుమూర్తి. (నలస్తంభ)
4. ప్రథమాశ్వాసము 105 వ పద్యము.
   గీ॥ కలదు నీకనపాయంబు కాలకంఠ.
   (కలదె నీకు నపాయంబు)
5. ద్వితీయాశ్వాసము 62వ పద్యము.
   గీ॥ కట్నమిచ్చె నృపాలుండు కన్నుదనియ (కట్టనిచ్చె)
6. ద్వితీయాశ్వాసము 78వ పద్యము.
   ఉ॥ అక్షయ వర్ణితాఖ్యుఁడు గరంబు సువర్ణలతానిబద్ధమున్.
   (రక్తకుఁ బుండరీక నఖరంబు)
7. తృతీయాశ్వాసము 133వ పద్యము.
   ఉ॥ మంగళగీతవాద్య పరిమండిత ముంద్రకరుండలీకళా.
   (ముద్రికకుండలీ)
8. చతుర్థాశ్వాసము 3వ పద్యము.
   క॥ కలకల వింకల కోమల. (కలవింకంబుల)

9 చతుర్థాశ్వాసము నాల్గవపద్యము.
   సీ॥ సమదకాంతార కాసరయూధ సమ్మర్ద సంభూత
   డిండీరశకలవాహి. (కోమంథ)

10. చతుర్థాశ్వాసము ౯౫వ పద్యము.

గీ॥ దానములు పెక్కుఁజేసిన దానఁగాని. (దోసములుఁజేసె)

ఇట్టి పాఠాంతరములింకను బెక్కు గలవు. నాకు లభించిన ఈ తాళపత్రప్రతి వైశిష్ట్యమును దిఙ్మాత్రముగానైనను ఈ వ్యాసమునఁ బ్రదర్శింపఁ గలిగినాననుకొందును.

రాజమహేంద్రవర రెడ్డిద్వైరాజ్యము.

శ్రీ కుందూరి ఈశ్వరదత్తు.

శా॥ ఈక్షోణిన్నినుఁ బోలు సత్కవులు లేరీ నేటికాలంబునన్,
దాక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయ గంధసార ఘుసృణ ద్వైరాజ్యభారంబు న
ధ్యక్షించున్ గవిసార్వభౌమ! భవదీయ ప్రౌఢసాహిత్యముల్.

పై పద్యము శ్రీనాథకృత కాశీఖండములోఁ గృతిపతియగు వీరభద్రారెడ్డి శ్రీనాథకవి నుద్దేశించి చెప్పిన ప్రశంసాపద్యము. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు శ్రీనాథకవి జీవితములో నీపద్యము యొక్క భావమును గూర్చి చర్చించి యిట్లు వ్రాసియున్నారు. "ఈ కాశీఖండములోని పద్యముయొక్క భావమేమని నేఁడందఱు పండితులనో సాహితీ గోష్ఠిగలవారి నడిగితిఁగాని యెవ్వరును దృప్తికరముగాఁ జెప్పఁజాలకపోయిరి. కొందఱు ద్వైరాజ్యభారంబనుటకు బదులుగా ద్వైరాజ్యభావంబన వలయుననియు, ద్వైరాజ్యభావంబనఁగా వైరభావంబనియు, 'అధ్యక్షించున్' అనఁగా వహించుననియు నర్థము చెప్పిరి. ద్వైరాజ్యమనఁగా వైరమనునర్థ మే నిఘంటువునఁ గలదో చెప్పఁజాలరైరి. మఱికొందఱు రెండురాజ్యముల యొక్క బరువును బరిపాలించునని యర్థము చెప్పుచున్నారు. "ఓ, కవి చక్రవర్తీ!" ఈ నేఁటికాలమునం దీభూమిలో నీవంటి సత్కవులు లేరు. నీ సంబంధమయిన ప్రౌఢసాహిత్యములు ... దాక్షారామ చళుక్య భీమవరములలో నివసించుచుఁ బాటలయందును ఆటలయందును నేర్పుకలిగియున్న వేశ్యాస్త్రీలయొక్క చనుఁగవల యందలి మంచిగంధము, కుంకుమపువ్వు రెండురాజ్యముల యొక్క బరువును బరిపాలించునని శబ్దార్థము స్ఫురించుచున్నది గాని, భావము విస్పష్టముగ స్ఫురింపనందున నీకాలమునందలి సాహితీమండితులయిన పండితుల కపభ్రమలు కలు

గుటకుఁగారణమగుచున్నది. ఈ పద్యము యొక్క భావమును దెలిసికొనవలెనన్న నాకాలము నాఁటి దర్బారుల తీరులెట్టివో, ఆచారములలోను, నడవళ్లలోను నేవి దూష్యములుగావో, కవి సాంప్రదాయములెట్టివో దేవదాసీప్రతిష్ఠాపనమెట్టిదో వీనినెల్ల నవగాహనముఁ జేసికొన్నమీదట సాధ్యపడునుగాని, స్థూలదృష్టితోఁజూచు నీకాలపువారి కంతగా బోధపడదు. కవిహృదయమును గ్రహించినగాని వ్యాఖ్యలపహాస్యభాజనములగును ..ఎట్లు రాజసభల యందు వేశ్యాస్త్రీలయొక్క వక్షోజద్వయమునందలి గంధసారఘుసృణముల యొక్క సౌరభములు సభాంతరాళమున నల్గడలఁబర్వి సభ్యుల నానందపరవశులం గావించునో, యట్లే వాని నతిశయించి కవిసార్వభౌముని ప్రౌఢసాహిత్యములు కూడ సభ్యుల నానందపరవశులఁజేయునని భావమె గాని యంతకన్న విపరీతభావమేమియు లేదు. ఇట్లు ప్రౌఢముగా ప్రభువుల సభలలో వర్ణించుట యాకాలమున గౌరవలోపముగా భావింపఁబడకుండుట చేతనే శ్రీనాథకవిసార్వభౌముఁడు తన్నుఁగూర్చి పలికినట్లు ప్రభువునోటఁబలికించినాఁడు" (శ్రీనాథకవి. పుటలు 268-269)

ద్వైరాజ్యమనఁగా నేమి?

శ్రీ వీరభద్రరావుగారి పరిశోధనాతత్త్వమునకుఁ బైవిషయమొక నిదర్శనము. తమదృష్టికిఁ గనఁబడిన విషయములు తమకుఁ దెలిసినంతవఱకు చర్చించి, భావిపరిశోధకులకు మార్గదర్శకుఁడౌటయే చరిత్రకారుని పరమధర్మమని భావించినవారు. శ్రీనాథుఁడా పదమును వ్యర్థముగ ప్రయోగించెనని భావించుట చిత్తవిక్షేపము. శ్రీనాథుఁ డద్దానిని ప్రబలభావగర్భితముగాఁ బ్రయోగించినాఁడు. అయ్యది రెడ్డిరాజ్యాంగ చరిత్రకొక విచ్ఛిత్తిని జేకూర్చిన సుప్రసిద్ధ చరిత్రాంశము. ద్వైరాజ్యమనఁగా నొకరాజ్యమునే యిద్దఱు ప్రభువులు పరిపాలించు సంస్థానము. దీని బాగోగులను గూర్చి కౌటిల్యుని యర్థశాస్త్రమున నిట్లు విశదీకరింపఁబడినది.

* ద్వైరాజ్య వైరాజ్యములలో ద్వైరాజ్యమన్యోన్య పక్షద్వేషానురాగముల చేతను పరస్పర సంఘర్షణము చేతను నశించును. జీవితుండగు శత్రువును బలాత్కరించి సంపాదింపబడిన వైరాజ్యవిషయమున దాని ప్రభువు ఇది నాది కాదని తలంచుచుం బ్రజలకుంగర్శనాపవాహనము (?) లొనర్చును; లేక రాజ్యమును పణ్యముగం జేసి లాభమొందుటకు యత్నించును; లేక జనులు విరక్తులయినచో రాజ్యమును విడిచి వెళ్లిపోవును.

శ్రీనాథుఁడు వేమవీరభద్రారెడ్ల ద్వైరాజ్యమును పద్యము వెంబడి పద్యములో వ్యక్తపఱచియున్నారు.

రాజమహేంద్రవర రాజ్యము కాటయవేమునికిఁ బురుషసంతానము విచ్ఛిన్నము కాఁగా, నతని కుమార్తె యగు అనితల్లికి సంక్రమించెను. అనితల్లిని వీరభద్రారెడ్డి పెండ్లియాడెను. అట్టి యనితల్లి పట్టపు దేవిగా వీరభద్రారెడ్డి రాజమహేంద్రవర రాజ్యమేలెను. ఈ రాజమహేంద్రవర రాజ్యపీఠమును వీరభద్రారెడ్డి జ్యేష్ఠ సోదరుఁడగు వేమారెడ్డి యపరివిక్రమసహాయముచే నధిష్ఠించెను ? శ్రీనాథుఁడు కాశీఖండకృతిలో వర్ణించిన విషయములోను గమనింపవేడుచున్నాను. వీరభద్రభూపాలుఁడొక్కనాఁడు,

సీ. త్రైలోక్య విజయాభిధంబైన సౌధంబు
చంద్రశాలా ప్రదేశంబు నందు
సచివసైన్యాధీశ సామంత నృపవర
సీమంతినీ జనశ్రేణి గొలువ
శాస్త్ర మీమాంసయు సాహిత్య గోష్ఠియు
విద్వత్కవీంద్రులు విస్తరింపఁ
గర్పూర కస్తూరికా సంకుమదగంధ
సార సౌరభము దిక్పూరితముగ

తే. నిజభుజావిక్రమంబున నిఖిల దిశలు
గెలిచి తమరాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరునిజాంక మాశ్రయించి
నిండు కొలువుండెఁ గన్నుల పండువగుచు.

వ. అప్పుడు నన్నుం బిలువం బంచి సముచితాసనంబునం గూర్చుండ నియమించి యున్న యవసరంబున,

తే. రాయవేశ్యాభుజంగ సంగ్రామ పార్థ
గాయగోవాళ వేమనక్ష్మాధవుండు
గూర్మియనుజన్ము హృదయంబు గోర్కి యెఱిఁగి
యర్థి నన్నుఁ జూచి యిట్లని యానతిచ్చె.

సీ. ... ...

తే. నైషధాదిమహాప్రబంధములు పెక్కు
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడవనఘ !
యిపుడు చెప్పఁదొడంగిన యీప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్యపేర.

పై పద్యము తర్వాత "ఈక్షోణిఁ నిన్నుబోలు సత్కవులు" అను పద్యము చెప్పఁబడినది. కాశీఖండమును దెనుంగుఁగా నొనర్పుటకుఁగల హేతువులలో నొకటిగా మొట్టమొదట

"ఆంధ్రక్ష్మామండలాఖండలుండైన
వేమభూపతి కృపావీక్షణంబు"

అని శ్రీనాథుఁడు వేమభూపాలుని యెడ గౌరవము ప్రకటించినాఁడు.

పై పద్యములను బట్టి వేమవీరభద్రారెడ్లు రాజమహేంద్రవర రాజ్యము నిద్దఱును గలిసి పరిపాలించునట్లు స్పష్టము. ఇంతకన్నను

వేమారెడ్డి వేమవరము శాసనము పై విషయమును బ్రస్ఫుటమును గావించుచున్నది.

వేమవీరభద్రా రెడ్ల యన్యోన్యానురాగము వేమారెడ్డి వేమవరము శాసనము వేనోళ్ల వ్యక్తపఱచుచున్నది. అందు వీరిద్దఱు రామలక్ష్మణులను బోలియుండిరనియు, వీరిద్దఱు రాజమహేంద్రవర రాజ్యమును బాలించుచుండిరనియు విస్పష్టము గావింపఁబడెను. వేమభూపాలుని పరిస్థితి ప్రత్యేకముగా వర్ణింపఁబడెను.

(1) "వేమ శ్రీ వీరనాయకవీరభూపౌ తేషాం ప్రభూతౌ నితరామ భూతాం।
యథావరౌ పంక్తిరథాత్మజానాం గుణోన్నతౌ రాఘవలక్ష్మణౌ తౌ।

(2) తరుణసరసిజాస్యౌ తావభూతాం ప్రశస్యౌ
సకలనృపవరేణ్యౌ సజ్జనానాం శరణ్యౌ
రవిహిమకరకల్పౌ రామసౌమిత్రితుల్యౌ
రణశిరసి విభంగౌ రాజవేశ్యాభుజంగౌ.

(3) రాజ్ఞోస్తయో రాజమహేంద్రనామా రామాభిరామాజని రాజధానీ
అనేక మాతంగతురంగపూర్ణా శశాంకసంకాశవిరాజిసౌధా

(4) ధర్మాననున్నమయన్ రిపూన్వినమయన్ రాజ్యశ్రియుంవర్ధయన్
పాపంసంశమయన్ ప్రజాశ్చరమయన్ విద్వజ్జనాన్ స్థాపయన్
కీర్తింసంచరయన్ దిశాసు నిఖిలక్షోణీభృతామాశ్రయో
రాజా రాజమహేంద్రనామనగరే వేమేశ్వరో జృంభతే॥

పై శ్లోకములవల్ల రాజమహేంద్రవర రాజ్యము ద్వైరాజ్యమని నిర్ణయించుట కెట్టి యభ్యంతరమును లేదు. కాఁగా, శ్రీనాథుఁడు వ్యక్తపఱచిన భావమేదియో గ్రహింపఁవలసియున్నది. 'ద్వైరాజ్య

భారము'లోని భారపదమునకు 'కుచభారము' 'నితంబభారము' మొదలగు సమాసములలోని 'భార' పదమున కెట్టి యర్థమో. యిచ్చుట నాయర్థమె పొసఁగును. 'అధ్యతిష్ఠించు' పదమునకు పరిపాలనము గావించుననెడి యర్థమును జెప్పికొనినను జెప్పుకొనవచ్చును. లేదా పరిఢవిల్లు ననియు నర్థమును గావింపనొప్పును.

అట్లని యూహించినచో నీ పద్యముయొక్క తాత్పర్యమిట్లుండనగును.

“ఆంధ్రభూమండలమున నేఁటికాలమున నీతో సమానులగు సత్కవీశ్వరులు లేరు. ఓ, కవిసార్వభౌమ! దాక్షారామ, చళుక్యభీమవర వారకామినులవక్షోజద్వయ గంధసారఘుసృణలేపముల సౌరభములచే విరాజిల్లెడు (నా)ద్వైరాజ్యముపై నీ ప్రౌఢసాహిత్యములు పరిఢవిల్లుచున్నవి, లేక ప్రాభవమును వహించుచున్నవి.”

పై సమన్వయము సమంజసమో కాదో చెప్పుటకు పండితవరేణ్యులే శరణ్యము. ఇదియొకవిశిష్టమైన విషయము పరిశీలింపఁదగ్గది.

ఆంధ్రదేశములోని ద్వైరాజ్యములు.

ఆంధ్రదేశములోని ద్వైరాజ్యములనుగూర్చి (Dual Kingship) యిదివఱకు శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులవారు ఆంధ్ర ఇతిహాసక పరిశోధక మండలివారి త్రైమాసిక పత్రికయందొకసారి చర్చించి, కోనహైహయుల శాసనములోని విషయములు పేర్కొని, పిఠాపురము మల్లపదేవుని శాసనముదాహరించి యందు నాల్గుతరముల ద్వైరాజ్యసంస్థాపనమునుగూర్చి చర్చించియుండిరి. వారు రాజమహేంద్రవర ద్వైరాజ్యమునుగూర్చి ప్రస్తావించి యుండలేదు. పేరునకు వీరభద్రారెడ్డిరాజనియు, వాస్తవికముగా, వేమారెడ్డి యేరాజనియు మాత్రము చెప్పి యూరకుండిరి. ఈ ద్వైరాజ్యములో ఆంధ్రదేశ ప్రాచీన రాజ్యాంగతంత్రచరిత్రములో నొకవిశిష్ట సన్నివేశము. కొటి

లన్నఁ డీ ద్వైరాజ్యములు ఆయా రాజ్యముల పరస్పర చిత్తవృత్తుల ననుసరించియుండుననియు, రాజ్య విచ్ఛిత్తికే మూలములనియు నొక్కి వక్కాణించియున్నాఁడు. మన రాజమహేంద్రవర రెడ్డి ద్వైరాజ్య మట్టిదికాదు. వేమవీరభద్రారెడ్లు పరస్పరానురాగములుగల రామలక్ష్మణులను బోలుటచే రాజమహేంద్రవరరాజ్యవైభవ మెంతటి యుచ్ఛ్రస్థితినిగాంచెనో సారస్వతమును, చరిత్రయుఁ జెప్పకచెప్పుచున్నవి. ఆ విషయమిచ్చట వ్రాయుట చర్వితచర్వణము. భీమఖండ కాశీఖండకృతులే పై విషయమునకుఁ బ్రతికృతులు.

గ్రంథపరిశీలన పట్టిక.

(1) కాశీఖండము-శ్రీనాథుఁడు

(2) శ్రీనాథుఁడు-శ్రీ చిలుకూరి వీరభద్రరావు

(3) అర్థశాస్త్రము-కౌటిల్యుఁడు ఆంగ్లానువాదము. పుట 395
(శ్యామశాస్త్రి) (1915)

(4) అర్థశాస్త్రము-కౌటిల్యుఁడు-ఆంధ్రానువాదము పుట 357
(శ్రీ వెంకట రంగయ్య-వెంకటశాస్త్రి) (1923)

(5) ప్రాచీన హిందూ దేశమున ద్వైరాజ్యములు.

(Dual Kingship in Ancient India-Sri P. Srinivasachari, Andhra Historical Research Society, Journal of- Volum XII; Part III: January 1939)

(6) వేమవరము శాసనము. (శా. శ. 1356)

Epigraphia Indica Vol. XIII

పై శాసనము శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు రచించిన "శ్రీనాథ కవితా సమీక్ష" యను గ్రంథములో ననుబంధముగఁ బ్రచురింపఁబడినది.

(7) మాళవికాగ్నిమిత్రము-కాళిదాసు

పంచమాంకము:-

రాజ: మాద్గల్య-తత్ర భవతో ర్యజ్ఞసేన మాధవ సేనయో ర్ద్వైరాజ్య మిదానీ మవస్థాపయితు కామోఽస్మి॥

(ద్వైరాజ్యము-ద్వయో రాజ్ఞో ర్భావః కర్మవా)

("ద్వౌ రాజానౌ యత్ర స ద్విరాజా దేశః. తస్యభావః ద్వైరాజ్యం")

(8) ద్వైరాజ్యము (1) A Kingdom divided between two Princes, or Kings.

(Apte; Macdonell; Monier-Williams వారల సంస్కృతాంగ్ల నిఘంటువులలో నిచ్చిన ఆంగ్లపరిభాషికములు)

(2) A rule of a Country by two kings-Shamasastry Ardhasastra.

శ్యామశాస్త్రిగారి ఆంగ్లానువాదము.

శృంగార నైషధకర్తయగు శ్రీనాథుఁడు
పల్నాటి వీరచరిత్ర కర్తయగునా.?

శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి.

ద్విపద పల్నాటివీరచరిత్రను శ్రీనాథుఁడు, మల్లయ, కొండయాదులు రచించిరని గ్రంథస్థవిషయములనుబట్టి తెలియుచున్నది. మిగిలినవారివిషయ మెట్లున్నను, శ్రీనాథుఁ డనఁగనే, శృంగారనైషధకర్తయు నితఁడు నొకరా, వేరా, యనుమీమాంస బహుకాలమునుండి చెలరేగి పండితులను గలవరపఱచుచున్నది. ఆంధ్రసారస్వతవిమర్శనమున నది యొక క్లిష్టసమస్యగా పరిణమించినది. యథార్థమున కాంధ్రనైషధకర్తయే పల్నాటివీరచరిత్రకర్తయైనచో నాంధ్రులు గర్వింపవలసినకారణమేకాని, న్యూనతపడవలసిన కారణము గాదు. ఏలన, భారమువంటి పల్నాటివీరచరిత్రకు కర్తయగు శ్రీనాథుఁడు, వ్యాసునివంటి వాఁడయినాఁడని. కాని శృంగారనైషధకర్తయు పల్నాటివీరచరిత్రకర్తయు నొకరే యనువాద మెంతప్రబలముగా నున్నదో, కాదనుమతముగూడ నంతతీవ్రముగనే పండితులలో నుండుటచే, నేది సత్యమునకు సన్నిహితముగా నున్నదో విచారింపవలసియున్నది. జనసామాన్యమున కీచర్చతోఁబని లేదుకాని, సత్యగ్రాహపారీణులగు పండితుల కిది తప్పక యవసరమే. "సత్యము దేవునికిఁ దెలుసని" తేలికగ కొట్టివేసిన ప్రయోజనము లేదు. ప్రతివిషయమునను సత్యము దేవునికిఁ దెలియకపోదు, కాని దేవుఁడు ప్రత్యక్షమైయిదమిత్థమని సాక్ష్యము చెప్పఁడుకదా! మఱియు నీకాలమున దేవునికళ్లలోఁగూడ దుమ్ముకొట్టి, సత్య మసత్యముగను, నసత్యము సత్యముగను జేయఁగల మహానుభావులు బయలుదేరిరి. కాన బాహ్యాంతర ప్రమాణములనుబట్టి, యేవాదము సత్యసమీపముగనుండునో నిర్ణయింపవలసిన బాధ్యత పరిశోధకుల కున్నది. పరిశోధనప్రయోజనమే యిది. పరిశోధనలఫలితముగా నెన్ని సత్యవిషయములు బయలుపడలేదు? వాదోపవాద

ములచర్చ నికషమువంటిది. కాని యీచర్చలు సహేతుకముగను, సప్రమాణముగ నుండిన సత్యము తేలఁగలదేకాని, కేవల మూహలపై నాధారపఱచిన నవి గగనసౌధములుమాత్రమే కాఁగలవు. సత్యాన్వేషణబుద్ధితో, నిర్లిప్తభావముతో, నిష్పక్షపాతముగ, వ్యక్తిగతముగాని వాదవిమర్శ తోడ్పడగలదేకాని, యేదోయొకమతమునకుఁ గట్టిపెట్టుకొని, దాని కనుగుణముగ వాదము సాగించిన ప్రయోజనముండదు. "ప్రమాదో ధీమతామపి" యందురుకాన, పూర్వుల వాదము లప్రతిహతము లని భావింపక, పునఃపరిశీలనచేసి, దోషములున్నచో మార్చుకొని, సప్రమాణము, సహేతుకమునైన మతము నంగీకరించుట న్యాయ మగును. అందు గుణమున్నచో బాలురయభిప్రాయమైనను పరిగ్రహింపఁ దగినదేకాని పరిహరింపఁదగదు.

ద్విపద పల్నాటివీరచరిత్రభాగముగు 'కల్లుప్రతిష్ఠ' గ్రంథావతరణికనుబట్టి 'కల్లుప్రతిష్ఠ-బాలచంద్రులయుద్ధ' భాగములు కవిసార్వభౌముఁడైన శ్రీనాథుఁడు రచించినాఁడని అక్కిరాజు ఉమాకాంతంగారు నిర్ణయింపఁగా, తా నావాదమునే బలపఱచినాఁడ నని 'విశాలాంధ్ర' ప్రతి పీఠికకర్తయగు పింగళి లక్ష్మీకాంతంగారు పీఠికాంతమునఁ దెలిపిరి. కాన ఉమాకాంతంగారు చేసిన నిర్ణయమందలి యౌచిత్యమును, వి. పీ. కర్త బలపఱచుటలోని సామంజస్యమును పరిశీలింపవలసియున్నది. కల్లుప్రతిష్ఠకర్తయు, శృంగారనైషధకర్తయు నొకరా, భిన్నులా యని నిర్ణయించుట కొక కల్లుప్రతిష్ఠావతరణికనుమాత్రము విచారించినచో సత్యము తేలదు, దానిని శృంగారనైషధ, భీమఖండ, కాశీఖండ, హరవిలాసాది గ్రంథావతరణికలతో జాగ్రత్తగాఁ బోల్చిచూచినఁగాని యథార్థము నిర్ణయింపరాదు. కల్లుప్రతిష్ఠ గ్రంథావతరణికలోని శ్రీనాథనామము, భారద్వాజగోత్రమును గాంచి, భ్రాంతిచేతనో, లేక తనస్వగ్రామమైన

గుత్తికొండ పల్నాడుసీమలో నుండుటచే నభిమానముచేతనో, శృంగారనైషధకర్తయే యతఁడని భావించి, ఉమాకాంతంగారు, అందలి పేలవత్వాది దోషముల నేదోయొకవిధముగా సమర్థించి, దాని కొక బృహత్పీఠిక వ్రాసి, యతుకులబొంత కొకస్వరూపమును గల్పించినారు. సారస్వతమున వారు పడినపొరపాటులలో నిది యొకటి. వారు పొరపడిన విషయములు. (1) శ్రీనాథుఁడు కర్ణాటుఁడుగాని యాంధ్రుఁడు గాఁడనుట (2) అతఁడు వీరశైవుఁడనుట (3) అతఁడే పల్నాటి వీరచరిత్రను వ్రాసినాఁడనుట (4) "నన్నయానువాదం యెంత యథమమై ఉత్తమాధికారులకు ఎంత అగ్రాహ్యమైనా, అత డారంభించిన పద్యం ఎంత మురికిలక్షణాలు కలది అయినా" అనిభావించుట (5) నన్నయకూడ కర్ణాటకవియే యనుట. (6) తిక్కన చేసిన ద్రౌపదీ కీచకుల శృంగారవర్ణన దూష్యమనుట మొదలైనవి. "ప్రమాదో ధీమతామపి" అనికదా. అందులో "లోకో భిన్నరుచిః" కూడ కలిసినది. ఉమాకాంతంగా రుద్దోలమైన పండితుఁ డనుటలో సందేహము లేదు. వారు (1)కల్లు ప్రతిష్ఠగ్రంథావతరణికను శృంగారనైషధాది గ్రంథావతరణికలతోఁ బోల్చియు. (2) కల్లు ప్రతిష్ఠావతరణికను ఇతర పల్నాటిచరిత్రభాగముల యవతరణికలతో విమర్శము చేయకయున్నను, (3) కల్లుప్రతిష్ఠ-బాలచంద్రుల యుద్ధములలోని భాషను, శైలిని శృంగారనైషధాది గ్రంథముల భాషాశైలులతో జాగ్రత్తగాఁ బోల్చియున్నను (4) కల్లుప్రతిష్ఠ-బాలచంద్రుని యుద్ధములందలి యనౌచిత్యములను జాగ్రత్తగా పరిశీలించియున్నను నీపొరపా టొనర్చియుండరు. వారిమతమందలి యౌచిత్యానౌచిత్యములను విచారింపకుండ, దానినే బలపఱచిన వి. పీ. కగ, ఉమాకాంతంగారి యుపపత్తులనే పునరుక్తి చేసి, వానిని సమర్థించుటకు వారి యుదాహ

రణములతోపాటు మఱికొన్ని యసందర్భములను జోడించి పూర్తి చేసిరి. కాన నామతమును పునఃపరీక్షించి యందలిదోషములను పైనఁదెల్పిన నాల్గు మార్గముల విచారించి సత్యమునకు సన్నిహితమైన విషయమును గ్రహింపవలసియున్నది.

స్థూలదృష్టితో విచారించినపుడు పల్నాటివీరచరిత్రకర్తయు నాంధ్రనైషధ కర్తయు నొకరు కాఁజాల రనుటకు ముఖ్యముగా మూఁడు కారణములు కనఁబడుచున్నవి. (1) నైషధకర్త శివారాధన పరుఁడు కాఁగా, పల్నాటివీరచరిత్రకర్త వైష్ణవభక్తుఁడుగాఁ దోఁచుచున్నాఁడు. (2) ఆంధ్రనైషధాధికృతుల భాషాశైలులు దీర్ఘసంస్కృత సమాసభూయిష్ఠమైన గంభీరశైలిలో నుండఁగ, వీరచరిత్రభాషాశైలులు తేటతెలుఁగుమాటలతో సరళమైనశైలిలో పేలవముగనున్నవి ఆంధ్రనైషధాది కావ్యములో, మహారాజులకు, వారిమంత్రులకు, ధనవంతులకు నంకితమీయఁబడి. కర్తకు కీర్తి ధనార్జన సాధకములు కాఁగ, వీరచరిత్ర పిచ్చుకకుంటులు పాడుకొనుట కుపయోగపడి, కర్తకు కీర్తి ధనార్జనముల కెంతమాత్ర ముపయోగింపకుండెను. ఇవి కాక మఱికొన్ని యితరకారణములుగూడఁ గలవు. అవి సందర్భానుసారముగ పరామర్శింపఁబడును. ప్రస్తుతము పైమూఁడు కారణము లెంతవఱకు సమంజసముగ నున్నవో పరిశీలింతము.

(1) ఆంధ్రనైషధకర్తయైన "శ్రీనాథుఁ డాచారమునకు వీరశైవుఁడైనను శివుఁడని విష్ణువని పోరాడెడు బుద్ధిమంతులవలెఁగాక, న్యాయశాస్త్రము లభ్యసించి జ్ఞానదృష్టిగలిగిన వేదాంతిగాఁ గనఁబడుచున్నాఁడు" అని అక్కిరాజు ఉమాకాంతంగారు తన పల్నాటివీరచరిత్ర ప్రథమభూమికలో వ్రాసియున్నారు. (మూ. పుట. 48– 1938వ. సం. ప్రతి.) నా 'వీరశైవాంధ్రవాఙ్మయము'ను సమీక్షించిన యొక యనామక ప్రబుద్ధుఁడు ఆంధ్రపత్రిక- (ఆదివారం,

ఆగస్టు 2-1953) లో "శ్రీనాథుడు ఆరాధ్య వీరశైవమును ప్రతిపాదించిన శివకవి" యని వీరశైవ మత సంప్రదాయము తెలియఁగక వ్రాసినాఁడు. వీరశైవులు లింగధారణమొనర్చి, శివేతరదైవములను స్మరింపకుండుటయేకాక, శైవులుగాని వారిదర్శన స్పర్శసంభాషణాదులనుగూడ నెఱపరు. శ్రీనాథుఁ డట్టివాఁడు కాఁడుగనుక వీరశైవుఁడు గాఁడు. ఈతఁడు 'ఈశ్వరార్చన కళాశీలుఁడ'యిన స్మార్త బ్రాహ్మణుఁడు. ఇందువలన నాంధ్ర నైషధకర్తకు విష్ణుభక్తి యెండు కాకపోయినను శివవిష్ణుభేదము పాటింపనివాఁడు. ఆంధ్రనైషధకర్తయే పల్నాటి వీరచరిత్రకర్తయని వాదించుటలోమాత్ర మొకవిప్రతిపత్తి లేకపోలేదు. ఉపాసకుల కితరదైవములందు ద్వేషభావము లేకపోయినను, తమయిష్టదైవమైన యుపాసనాధిదైవము నెక్కువభక్తిశ్రద్ధలతో నారాధించి, వానిమూలముననే తమయిష్టార్థసిద్ధిని పొందుట సంప్రదాయము. ఉపాసకు నాజ్ఞాపించి యేపనినైనను జేయించుకొనుట కుపాసనాదైవమున కున్నశక్తి, యితరులకుండదు. ఇట్టి యుపాసకో"పాసనాదైవముల సంబంధముమంత్రశాస్త్రసంప్రదాయము ఒకవ్యక్తి కొక్క-యుపాస్యదైవ ముండునే కాని, యనేకు లుండరు. ఇతరదైవములం దుపాసకునికి సామాన్యభక్తిశ్రద్ధ లుండవచ్చును. ఇట్టిచో, 'ఈశ్వరార్చనకళాశీలుఁడై'న యాంధ్రనైషధకర్త 'శివభక్తి పరుఁ డ'నుటయేకాక, "మాచెర్ల చెన్నకేశవపాదసేవారతుండ'నని చెప్పికొనుట యెట్లని సందేహము. "చెన్నకేశవుఁడు పల్నాటివీరుల కిష్టదైవముకాన, నాయనను స్మరింపకుండ పల్నాటివీరులకథను వ్రాయుట పొసగద"ని సమర్థింపఁదలఁచినచో, చెన్నకేశవునకు సామాన్యముగా నమస్కారము లర్పించి మాచెర్లచెన్నుని మదిలోనఁ దలఁచి" అనిన జాలు. కాని చెన్నకేశవపాదసేవారతుండ" నని తన యిష్టదైవమునుగూర్చి చెప్పికొని నట్లుగా విశేషముగా నుడువుట

పొసఁగదు. "శ్రీనాథుఁడను వాఁడ, శివభక్తిపరుఁడ" నని కదా, తన యిష్టదైవమును గూర్చి చెప్పికొనినది. మఱియు "శ్రీకంఠు పరమేశు శివు నాత్మఁ దలఁచి" అని యిష్టదేవతాస్మరణము చేసి, మరలఁ దాను 'శివభక్తుఁడే' నని యేల తెల్పవలెను. ఎఱ్ఱాప్రెగ్గడ శంభుదాసుఁడైన శివభక్తుఁడు కదా. అతఁడు హరివంశరచనకు ముందు హరిస్మరణ చేయవచ్చును. కాని, "హరిభక్తుఁడ" నని, "హరిదాసుఁడ" నని, "హరిపాదసేవారతుఁడ" నని తెల్పుకొనినచో, శంభుదాస్యమునకు, శంభుభక్తికి విశిష్టత్వమే చేకూరదు. ఒకవ్యక్తికిష్టదైవ మొకఁడే యుండును కాని పలువురు ఇష్టదైవము లుండిరనుట సరసము కాదు. కావున శివభక్తుఁడైన శ్రీనాథుఁడు చెన్నకేశవపాదసేవారతుఁడు గాలేఁడు; చెన్నకేశవపాదసేవారతుఁడైన శ్రీనాథుఁడు శివభక్తుఁడు గాలేఁడు. ఇందుచే శివభక్తుఁడైన యాంధ్రనైషధకర్తయగు శ్రీనాథుఁడు వేఱు. పల్నాటివీరచరిత్రకర్తయైన 'చెన్నకేశవపాదసేవారతుఁడగు శ్రీనాథుఁడు వేఱుకావలెను. కాన, 'శివభక్తిపరుఁడ' యను పాఠముగాని, 'మాచెర్ల చెన్నకేశవపాదసేవారతుఁడ' యనుపాఠము గాని ప్రక్షిప్తముగావలెను. 'శివభక్తిపరుఁడ'యను పాఠమే ప్రక్షిప్తమని వక్ష్యమాణకారణములను బట్టి నిర్ణయింపఁబడును. పోనీ, యింత చెన్నకేశవస్వామి భక్తుడగు శ్రీనాథుడు పల్నాటిలోని తేళ్ళను, రాళ్ళను, జొన్నకూడును, విధవలను, పురోహితులను వర్ణించినవాఁడు, మాచెర్లలోని చెన్నకేశవునిమీఁద నొక్క చిన్నపద్యము నైనఁ జెప్పలేదేమి పాపము? జాతీయకవికదా యతఁడు. పల్నాటి మండలముమీఁద నసహ్యభావమును, నందలిదేవులమీఁద నిరాదరమును గల శ్రీనాథునికి పల్నాటివీరులమీఁద నభిమానగౌరవము లెక్కడ నుండి వచ్చినవయ్యా, పిచ్చుకకుంటలకొఱకు పల్నాటివీరచరిత్రను వ్రాయుటకు?

(2) నైషధాదిగ్రంథములలో శ్రీనాథుఁడు ప్రౌఢసారస్వ
మున కనుగుణముగనుండుటకై సంస్కృతసమాసములను తీర్చిదిద్దె
ననియు వీరచరిత్రమును పాడుకొనుటకు సామాన్యజనులకు ప్రీతిక
ముగా నుండుటకై సులభశైలిలో రచించె ననియు మఱియు వార్ధక
మునలనఁ గలిగినబుద్ధి బలహీనతవలన పేలవములో నీరసములో
నైనభాగములను శ్రీనాథుఁడు రచించెనని సమర్థనపూర్వకము
నంగీరింపఁబడినది. ఇట్లు పండితు లంగీకరించుచున్నను కొంద రాగ
హించి, యది "కొందఱి యభిప్రాయముమాత్రమే" యని యావాద
మును సంస్కరింపఁజూచి చివరకు "ఒకరుభాషతకరు పల్నాటి
వీరచరిత్రకర్తృత్వముఁన శంకింపనక్కఅలే దనుచున్నారు. ఈభాష
శైలిలోపములను సమర్థించుచు "దీని కిదమిద్ధమని సమాధానము
చెప్పుట కష్టము"- "లేక మఱియేదైనను కారణము కావచ్చును"
అని యొకవాదమునకు సమాధానము చెప్పుచుండుటలోనే, యని
దుర్బలమైన సమాధానమని స్పష్టపడుచున్నదికదా! సమాధానము
సకారణమైనదిగను బలమైనదిగను లేకపోయినచో, పూర్వపక్షమే
నిలుచును. ప్రతిభాషలోను ప్రతిసుప్రసిద్ధకవికి నొకవిశిష్టమైన భాషా
శైలు లలవడును. ఆయాలక్షణములచేతనే యిది నన్నయశైలి, యిది
తిక్కనది. శ్రీనాథశైలి యిట్లుండును. పోతనశైలిలో విశేషమిది యని
నిర్ణయింపఁబడి గుర్తింపఁబడునుకదా. శైలివిషయమునుబట్టి మాఱు
చుండినను గూడ నాయావిషయములలో నాప్రత్యేకవ్యక్తిత్వము బుద్ధి
శాలురకు గోచరించుచునేయుండును. సామాన్యముగా కవులు శృంగా
రరసమును ప్రతిపాదించువిషయములను సరళమైనశైలిలో ప్రసాద
గుణముతోను, వీరకారుణ్యాదిరసములను ప్రతిపాదించువిషయములను
దీర్ఘసంస్కృతసమాసములతోఁ గూడినప్రౌఢశైలిలో రజోగుణము
తోడను రచించుట సంప్రదాయము, కాని శ్రీనాథమహాకవి తన

సహజశైలియగు దీర్ఘసమాసభూయిష్ఠమైన ప్రౌఢగంభీరమైనశైలితో శృంగారరసప్రధానమైన నైషధము నాంధ్రీకరించుటయేకాక, తన యితరగ్రంథములనుగూడ నట్లే రచించెను. ఇట్టివాఁడు వీరరౌద్రరసప్రధానమైన పల్నాటివీరచరిత్రమును తనకు సహజమైనశైలిని పోనాడి, యౌచిత్యమైనను బాటింపక సరళమైనశైలిలో నీరసము పేలవము నైనరచనను గావించె ననుట విశ్వసనీయముగఁ దోఁపదు. గుత్తకుఁ బుచ్చుకొనినభూమికి సిస్తుకట్టలేక, రాజభటులచే శిక్షపడి క్షోభపడుచున్న మనస్సుతో, నవసాన కాలమునఁ జెప్పిన

సీ॥ కవిరాజుకంఠంబుఁ గౌఁగిలించెనుగదా,
పురవీథి నెదురెండఁ బొగడదండ,
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబుపైఁ,
దగిలియుండెనుగదా నిగళయుగము,
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత,
వియ్యమందెనుగదా వెదురుకోడియ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెనుగదా
నగరువాకిట నుండునల్లగుండు
గీ॥ కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయెఁ దిలలుపెసలు
బొడ్డుపల్లెను గొట్టేటి మోసపోతి నట్లు
చెల్లింతుఁ డంకంబు లేడునూర్లు.

సీ॥ కాశికావిశ్వేశుఁ గలసె వీరారెడ్డి
రత్నాంబరంబు లే రాయఁడిచ్చుఁ?
కైలాసగిరిఁ బంటమైలారువిభుఁ డుండె
దినవెచ్చ మే రాజు దీర్పఁగలడు?
రంభగూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కే రాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱిహేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు?

సీ॥ భాస్కరుఁడు మున్ను దేవునిపాలి కరిగెఁ,
గలియుగంబున నిక నుండఁ గష్టమనుచు
దివిజకవివరు గుండియల్ దిగ్గురనఁగ,
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి॥

సీసపద్యములు గూడ ప్రౌఢశైలిలో నుండి రసవంతముగా నున్నప్పుడు, చెన్నుని కృపచేత చిత్తముప్పొంగి, బాలుని విక్రమ ప్రౌఢియంతయును, విరచించినది పల్నాటి వీరచరిత్ర రచనము నీరసంబుగ పేలవముగ నుండుటకు 'వార్ధక్యమువలనఁ గలిగినబుద్ధి బలహీనత' యని యారోపించుట యంతకంటెసమంజసము గాదు. పాల్కురికి సోమనాథుఁడు బసవపురాణపండితారాధ్య చరిత్రములను జనసామాన్యము పాడుకొనుట కొఱకు వ్రాసినాఁడు. ఈ రెండింటిలో పండితారాధ్య చరిత్ర నూతని వార్ధకమున రచింపఁబడినది. పండితారాధ్య చరిత్రలోని యీ క్రింది రచనలను తిలకింపుఁడు.

రౌద్రము :—"ఈ యసంఖ్యాత మాహేశ్వరోద్ధితసహా యత క్రోధోత్కటానలపటల విరచితజ్వాలల నెలనాటినోఁడ, ధరణీతలేశ్వరాధమ పతంగంబు భస్మమయ్యెడును, తద్బంధులు, సుతులు, విస్మయంబున నిష్ఠ భస్మమైపోదు." మహిమ పుట 57

అద్భుతము :-"అతుల మహాద్భుతోద్యతభక్తి, యుత సహాహిత మహిమోపేతుఁడగుచు, తచ్ఛుఖుర స్త్రిసంధానావధాన, నుచ్చైరువుగ మున్నువుచ్చినయుల్లి" మహిమపు 45. "కడలేని నిర్మల గాధమహాత్త్వజడతావిహార విస్తారోదకములు, నంగీకృతాయతోత్తుంగ శృంగాఘ ....

మంగళరంగ త్తరంగ సంఘములు పటుశైల చూడావిభాసి నీహారపటల ప్రకారవిస్తార ఫేనములు, శైలాగ్ర విహరణాసక్త పరిమథవిశాల దివ్యవిమాన చయనహిత్రములు, సరసుత తద్విమానధ్వజదండ గురుమహితోద్రిత్తాల కూపదండములు, సంచిత

నానాదిశాస్థాన చయసమంచిత ద్వీపాంతరానీకములను" (పర్వత పుట 228).

"మానితప్రాసాదమండప గోపు, రానీక, దీపప్రభాభ్యంతర మున, విలసిత వివిధ నవీనాంబరప్ర, కలితమండప మొప్పగావించి, యందు పరిచితక్రముకరంభా స్తంభముసుర, భరితోత్తరంగ శుంభ ద్వారత తులు సంచిత నీలదృషత్కుట్టిమములు, సంచితోత్పల సమా యత తోరణములు, మానిత బహుళ వర్ణమహితోపవార్ధి, ఫేనపుంజ ములును, బృథుతరంగములు భర్మాంబురంజిత పటుచిత్రవస్త్ర, నిర్మిత బహుపక్షినివహాతిశయము,అరుణాబ్జ కర్ణికారాశోకరక్త,కరవీర చంపక కైరవా ద్యభిలసురుచిరప్రసవ నిష్యూతమాలా ప్రకరబంధతత్ప్రమప్ప ఘంటికావళులు వారక చీకటి వర్ణితమంద, మారామదద్దీపమాలికా తరులు, ప్రాసాదగోపుర బహుహేమకలశ, భాసురద్యుతులు, శుంభ ద్ధ్వజద్దండ ఖచితభాస్వత్ప్రభకలితదీధితులు, ప్రచురప్రభల పేర్మి రాత్రుల్ పగళ్లు" (పర్వత 419-422)

పండితారాధ్య చరిత్రయందంతట నిట్టి భాగము లనేకములు కలవు. పై ద్విపదపంక్తులనుబట్టి జనసామాన్యము పాడుకొనుట కను వుగా నుండుటకుఁ గాని, వార్ధకమువలనఁ గాని కవి నీరసమును, పేలవమునగు రచన చేయుననుట సరసముగా నుండదు. ఇంతవఱ కెందులకు 70 సం.లు దాఁటిన వయసులో పింగళి లక్ష్మీకాంతము గారిటీవల రచించిన "తేజోలహరి" పద్యములు సమాసజటిలముగా నుండి ప్రౌఢగంభీరముగా లేవా? కాన వార్ధక వాదము విశ్వాస నీయము కాదు.

III శ్రీనాథుఁడు పిచ్చుక కుంట్లు పాడుకొనుటకు సుద్దుల కవి త్వము వ్రాసియుండఁ డనుట కతని స్వభావమును పరీక్షింపవలసి యున్నది. శ్రీనాథుని స్వభావమును గూర్చి కీ. శే. వేటూరి ప్రభా

సీ॥ భాస్కరుఁడు మున్ను దేవునిపాలి కరిగెఁ,
గలియుగంబున నిక నుండఁ గష్టమనుచు
దివిజకవివరు గుండియల్ దిగ్గురనఁగ,
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి॥

సీసపద్యములు గూడ ప్రౌఢశైలిలో నుండి రసవంతముగా నున్నప్పుడు చెన్నని కృపచేత చిత్తముప్పొంగి బాలుని విక్రమ ప్రౌఢియంతయును విరచించినది పల్నాటి వీరచరిత్ర రచనము నీరసంబుగ పేలవముగ నుండుటకు 'వార్ధక్యమువలనఁ గలిగినబుద్ధి బలహీనత' యని యారోపించుట యంతకంటె నసమంజసము గాదు. పాల్కురికి సోమనాథుఁడు బసవపురాణపండితారాధ్య చరిత్రములను జనసామాన్యము పాడుకొనుట కొఱకు వ్రాసినాఁడు. ఈ రెండింటిలో పండితారాధ్య చరిత్ర మాతని వార్ధకమున రచింపఁబడినది. పండితారాధ్య చరిత్రలోని యీ క్రింది రచనలను తిలకింపుఁడు.

రౌద్రము :—"ఈ యసంఖ్యాత మాహేశ్వరోత్థితసమా యత క్రోధోత్కట టానలపటలః విరచితజ్వాలల నెలనాటిచోడ, ధరణీతలేశ్వ రాధమ పతంగంబు భస్మమయ్యెడును. తద్బంధులు, సుతులు, విస్మ యంబున నిష్ఠ భస్మమైపోదు."　　మహిమ పుట 57

అద్భుతము :-"అతుల మహాద్భుతోద్యతభక్తి, యుత సమాహిత మహిమోపేతుఁడగుచు, తచ్ఛుకుర స్త్రిసంధానావధాన, మచ్చెరువుగ మున్నువుచ్చినయట్లు" మహిమపు 45. "కడలేని నిర్మల గాథమహాత్త్వజడతావిహార విస్తారోదకములు, సంగీకృతాయతోత్తుంగ శృంగాగ్ర ....

మంగళరంగ త్తరంగ సంఘములు, పటుశైల మాడావిభాసి నీహారపటల ప్రకారవిస్తార ఫేనములు, శైలాగ్ర విహరణాసక్త ఘిమథవిశాల దివ్యవిమాన చయనహిత్రములు, సరసుత తద్విమానధ్వజదండ గురుమహితోత్తాల కూపదండములు, సంచిత

నానాదిశాస్థాన చయసమంచిత ద్వీపాంతరానీకములను" (పర్వత పుట 228).

"మానితప్రాసాదమండప గోపు, రానీక, దీపప్రభాభ్యంతర మున, విలసిత వివిధ నవీనాంబరప్ర, కలితమండప మొప్ప గావించి యందు పరిచితక్రముకరంభా స్తంభముకుర, భరితో త్తరంగ శుంభ ద్వారతతులు నంచిత నీలదృషత్కుట్టిమములు, నంచితోత్పల సమా యత తోరణములు, మానిత బహు వర్ణమహితోపవార్ధి, ఫేనపుంజ ములునుఁ బృథుతరంగములు ధర్మాంబురంజిత పటుచిత్రవస్త్ర, నిర్మిత బహుప క్షినివహాతిశయము, అరుణాబ్జ కర్ణికారాశోకర క్త, కరవీర చంపక కైరవాద్యఖిలసురుచిరప్రసవ నిష్యూతమాలా ప్రకర బంధతత్ప్రవృ ఘంటికావళులు వారక చీకటి వర్జితమందు, మారామదదీపమాలికా తరులు, ప్రాసాదగోపుర బహుహేమకలశ, భాసురద్యుతులు, శుంభ ధ్వజదండ ఖచితభాస్వత్ప్రభ కలితదీధితులు, ప్రచురప్రభల పేర్మి రాత్రుల్ పగళ్లు" (పర్వత 419-422)

పండితారాధ్య చరిత్రయందంతట నిట్టి భాగము లనేకములు కను
కలవు. పై ద్విపదపంక్తులనుబట్టి జనసామాన్యము పాడుకొనుట కను
వుగా నుండుటకుఁ గాని, వార్ధకమువలనఁ గాని కవి నీరసమును,
పేలవమునగు రచన చేయుననుట సరసముగా నుండదు. ఇంతవఱ
కిందులకు 70 సం.లు దాఁటిన వయసులో పింగళి లక్ష్మీకాంతము
గారిటీవల రచించిన "తేజోలహరి" పద్యములు సమాసజటిలముగా
నుండి ప్రౌఢగంభీరముగా లేవా? కాన వార్ధక వాదము విశ్వాస
నీయము కాదు.

III శ్రీనాథుఁడు పిచ్చుక కుంట్లు పాడుకొనుటకు సుద్దుల కవి
త్వము వ్రాసియుండఁ డనుట కతని స్వభావమును పరిశీలింపవలసి
యున్నది. శ్రీనాథుని స్వభావమును గూర్చి కీ. శే. వేటూరి ప్రభా

కర శాస్త్రిగారు తమ శృంగార శ్రీనాథమందు 299 వ పుటలో "శ్రీనాథుఁడు మహాభోగపరాయణుఁడు .. ...శ్రీనాథుఁడు నిర్వ్యాజముగా నొక్క గ్రంథమేని పారలౌకికఫలము నపేక్షించి భగవదంకితము చేసినట్లు కానరాదు. స్వర్ణపాత్రభోజనము, దీనారటంకారముల తీర్థమాడుటలు, జాంబూనదాంబరాభరణ ధారణములు, కస్తూరికా సుగంధాంగరాగానులేపనములు, నుద్యానవిహారములు, శ్రీనాథుఁడపేక్షించెను. తదుపలబ్ధికై గ్రంథముల రచించెను. అతనికి యశోలిప్స యపారము. "కావ్యములు పెక్కు చెప్పియుఁ గాంతుఁ చనక, వెండియును గావ్యమొకటి గావింపఁదలఁచి"(భీమఖండము) శ్రీనాథుఁడెక్కడి కరిగినను కవితామహారాజ్య భద్రాసీనుఁడయి, శిష్యసంఘముతో కవితావిజయధ్వజముతో, బయల్వెడలెడివాఁడు" అని వ్రాసిన వాక్యములను ప్రత్యాఖ్యానము చేయువా రుండరు. ఇటువంటి స్వభావముగల శ్రీనాథుఁడు తన భోగములకుఁ గాని, కీర్తికిఁగాని తోడ్పడని సుద్దులకవిత్వమును పిచ్చుకకుంట్ల కొఱకై వ్రాసెననుట యతని స్వభావమునకు విరుద్ధమైన విషయమే కాని, పిచ్చుకకుంట్లపై నతని కసహ్యభావ మనికాని, గౌరవము లేదనికాని నిర్ణయింపరాదు. భగవంతునికిఁ గాని, పితృదేవతలకుఁ గాని ప్రీత్యర్థము గ్రంథముల వ్రాయనివాఁడు పిచ్చుకకుంట్ల కొఱకు వ్రాయునా, శ్రీనాథునికి పల్నాటి సీమతో ప్రత్యక్ష సంబంధములేదని యెవరనఁగలరు ? అతనికి మాచెర్ల, గురజాల, కార్యంపూడి, చంద్రభాగానదీతీరములు మాత్రమే కావు సుపరిచితములైనవి. అక్కడి తేళ్ళతోడను, రాళ్ళ గుట్టలతోడను, జొన్నన్నముతోడను, పురోహితు లింటికృత్యముల తోడను గూడ నెక్కువ పరిచయము గలదని యాతని చాటుపద్యములు చదివినవారందఱికి సుస్పష్టమే. శ్రీనాథుని యాంధ్రదేశాభిమానము, జాతీయకవిత్వ మితరరచనలను బట్టి యెట్లున్నను, పల్నాటి

దేశాభిమానము మాత్ర మీ చాటువులవలన విశదమగుచున్నది. కాన పల్నాటిదేశాభిమానముచే పల్నాటివీరచరిత్రను మాత్రము శ్రీనాథుడు రచించియుండఁడు.

"అంతకుముందే యీ కథను, ప్రజలు పాడుకొనుచు, వినుచు తన్మయులగుట కన్నులారఁజూచెను. దానిని అట్లే ప్రజలు పాడుకొని యానందింపవలయునని తలంచి, పద్యకావ్యమునకు అట్టి యోగ్యత లేదు కనుక, తాను గూడ, ఆ కథను పదరూపమున సంతరించియుండును" అని వి పీ కర్తచే సమర్థింపఁబడినది. ఇందులో "శ్రీనాథుఁడు అంతకుముందే యీ కథను ప్రజలు పాడుకొనుచు వినుచు తన్మయులగుట కన్నులార చూచెను" అని నిశ్చయించుటకు ప్రమాణమేమి? శ్రీనాథుని భావమఱఁదియగు దగ్గుపల్లి దుగ్గనగాని, లేక శ్రీనాథుని సమకాలికులుగాని, యెవరైన, యొకరుఁడైన నట్లు తెలిపెనా? ఎవరును దెల్పనిచో నీయూహ సత్యమని యెట్లు విశ్వసింపనగును. ప్రమాణరహితమైన యీ యూహకు సత్యత్వము, స్థిరత్వమును సిద్ధింపవు. కాన నది నిరాధారమై యంగీకారయోగ్యము గాక యుండును. మఱియు శ్రీనాథుని రచనయని చెప్పఁబడుచున్న 'కల్లుప్రతిష్ఠ-బాలచంద్రుని యుద్ధము' లలోనే నీరసములు, పేలవములునైన భాగములు పిచ్చుకకుంట్ల నోళ్లలోఁబడి భ్రష్టమైనవని వాదించినపుడు, శ్రీనాథుఁడు గూడ తాను మునుగా వినిన పల్నాటివీరుల కథగూడ నట్లే పిచ్చుకకుంట్ల నోళ్లలోఁబడి మూలరూపము భ్రష్టమై యుండునని యూహించి, యికముందు తాను రచించినచోఁగూడ నట్లే యగునని గ్రహింపలేక పోవునా? అందుచేఁ దనకు గౌరవహీనమగు నని సంకోచించియుండఁడా? మఱియు తనకు ముందున్న పల్నాటి వీరుల కథాగేయరూపమే "ప్రజలు పాడుకొనుచు, వినుచుఁ తన్మయులగుట కన్నులార చూచి,, సంతోషించినవాఁడును, "తన్ను,"

గూడ నావేశపూరితుని జేసిన "శ్రీనాథుఁడు మూలరూపము" పేలవముగా, నవ్యక్తరూపమున నున్నదనియు, తనకు తృప్తి నీయకపోయె' ననియు, కాన నాకథనే మరల" పాడుకొనుటకు, చదువుకొనుటకు వీలుగా, సామాన్య ప్రజలకు ప్రీతికరముగా, సులభశైలిలో బుద్ధి పూర్వకముగా రచించినాఁడని వాదించుటలో నౌచిత్య మేమున్నది ? వ్రాసిన దానినే మరల నల్లే గేయరూపమున వ్రాయుటలో శ్రీనాథుని రచనలో సారస్య మేముండును. అదియుఁగూడఁ గొన్ని భాగములలో పేలవము, నీరసముగ పరిణమించినదికదా, దీనివలన ప్రయోజనమేమి సిద్ధించినది. కాన శ్రీనాథుఁడు గేయరూపమునఁ బూర్వమున్న పల్నాటివీరచరిత్రను-లేదా, బాలుని యుద్ధమును తిరిగి గేయ రూపమున వ్రాయవలసిన యవసరము గానఁబడదు పూర్వగేయ రచనకంటె మేలుగా వ్రాయవలె నని పోటీపడుట నేటికాల రచయితలకే పనిగాని, శ్రీనాథునివంటి ప్రతిభాశాలికి తగదు. ఇంఁకచే పిచ్చుకకుంట్లకొలకు శ్రీనాథుడు వ్రాసెననుట (1) అతని స్వభావమునకు విరుద్ధమైనపని. (2) అనవసరము ననౌచిత్యము, సారస్యము లేని పనికూడ. (3) పూర్వాపర వాక్యములకు పరస్పర విరుద్ధములైన వాదన ఈసంర్భమున " మొదట పల్నాటిపదమును వ్రాసిన రచయిత యెవరని ప్రశ్నించుట వ్యవధి ప్రశ్న" అని వి. పీ. కర్త వ్రాసెను. కాని యీ ప్రశ్న సామాన్యజనమున కవ్యవధి ప్రశ్నమే కాని, సాహిత్యమీమాంసకులకు పండితులకుఁ గూడ నది యత్యవసరమైన ప్రశ్నయే. ఏలన, ఇద్దఱొక కావ్యమును వ్రాసినపుడు వానిని తులనాత్మక దృష్టితో పరిశీలించుట సారస్వత విమర్శప్రథమకర్తవ్యముకదా. ఇఁక మిగిలిన విషయములు విచారింపఁబడును.

వినుకొండ వల్లభరాయ కృతిగాఁ జెల్లుచున్న క్రీడాభిరామమున శ్రీనాథుని భాషాశైలు లుండుటచే నది శ్రీనాథుని తోఁబ్బాటున

రచింపఁబడిన దని భావించి యందుల్లేఖింపఁబడిన పల్నాటి వీరుల గాథను పురస్కరించుకొని, పల్నాటివీరచరిత్ర భాగములైన కల్లు ప్రతిష్ఠ-బాలచంద్రుని యుద్ధములు శ్రీనాథరచితములుగా పేర్కొనఁబడుటచే, శృంగారనైషధకర్తయగు శ్రీనాథుఁడే పల్నాటి వీరచరిత్రను తప్పక రచించెనని యూహింపఁబడుచున్నది. కాన క్రీడాభిరామము నకు పల్నాటివీరచరిత్రకుఁ గల సంబంధ మెట్టిదో విచారింపవలసి యున్నది. రావిపాటి త్రిపురాంతకుఁడు సంస్కృతమున రచించిన ప్రేమాభిరామమను వీథినాటకము చంపూశ్రవ్యకావ్య రూపమున నాంధ్రీకరింపఁబడినది క్రీడాభిరామము. ప్రస్తుతము ప్రేమాభిరామము కానరాదు. అందలియితివృత్త. మోరుగల్లునందలి విషయములు గోవిందమంచనశర్మయు నతని చెలికాఁడు టిట్టిభసెట్టియు ముచ్చటించుకొందురు. ఇతివృత్త విషయ ప్రాధాన్యమునుబట్టి పల్నాటి వీరుల ప్రశంసయుండుటకు వీలు లేదు. ఇందుచే వల్లభరాయఁడో, లేక శ్రీనాథుఁడో దానిని ప్రత్యేకాభిమానముచే రచించి చొప్పించిరని కొందఱును, ఆదిమూలమందే యప్రాసంగిక రూపముననో యుండి యుండును. కాన, పల్నాటివీరుల ద్విపదప్రబంధ ప్రశంస, త్రిపురాంతకుని కాలముననే యుండి యుండునని యితరులు నూహించుచున్నారు. ఇంతకు సంస్కృత ప్రేమాభిరామ మిపుడు కానరాదు కాన, నీ రెండు వాదములు కూడ నేలవిడిచి చేసిన సాములే యైనవి. కాన నెవరి వాదమును గూడ పురస్కరించుటకుగాని, తిరస్కరించుటకుఁగాని వీలు లేదు. కాన పల్నాటివీరచరిత్రకర్తృత్వమును క్రీడాభిరామముపై నాధారపఱచి నిర్ణయించుటమాత్రము ప్రమాదకరమే యగును. ఏలన, మొదట క్రీడాభిరామమునకే శ్రీనాథునకుఁగల సంబంధమే కొంత సందేహాస్పదము, తర్వాత క్రీడాభిరామములోని విషయములు మఱికొంత సంశయాస్పదములు కదా, ఇట్టి సందేహాస్పద విషయములపై నాధార

కలిమి పల్నాటివీరచరిత్ర కర్తృత్వము శ్రీనాథుని కారోపించుట సమంజసముగానుండదు.

(5) వాదమునకొక నూఱు శృంగారనైషధకర్తయగు శ్రీనాథుఁడే పల్నాటివీరుల ప్రశంసను ప్రత్యేకాభిమానముతో రచించి, క్రీడాభిరామమున చొప్పించెదనని యంగీకరించినను, అతనిమాటలను బట్టి యప్పటికే యొక "ద్విపద ప్రబంధము వీరానీకమును బాడిన"ది కలదని స్పష్టమగుచున్నది. కదా ఈ "ద్విపద ప్రబంధమే శ్రీనాథ రచిత పల్నాటివీరచరిత్రి ద్విపద ప్రబంధమని యెవ్వరైనను వాదింతురా ? లేక మఱియొకటి కూ, యతఁడు రచించినది. అగుచో, నిక శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్ర నెప్పుడు రచించియుండునో విచారింపవలసియున్నది. "రాజావలంబము విఱిగి పోయిన తర్వాతఁ కొండవీటి వీడికొని పల్నాడు ప్రాంతములఁ బర్యటించునపుడక్కడ ప్రజల ప్రార్థనముచేతఁగాని, దేశచరిత్రాభిమానము చేతఁగాని శ్రీనాథు డీగ్రంథమును (పల్నాటివీరచరిత్రము) రచించియుండును." అని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తమ శృంగార శ్రీనాథము 240వ పుటలో వ్రాసినారు. అక్కిరాజు ఉమాకాంతంగారు తమపల్నాటిచరిత్ర ప్రథమ భూమిక 53వ పుటలో "ప్రథమమున గౌరవమున పడయకపోయినను, రాను రాను శ్రీనాథుడు పల్నాటివారితో చిక్కలి మైత్రివాటించి తన వార్ధకమంతయు నచ్చటనే గడపెను. పల్నాటివీరచరిత్ర మచ్చట నుండియే వ్రాసినాఁడు. " 69వ పుటలో " పల్నాటివీరచరిత్రమే యితడు రచించిన గ్రంథములలో నెల్లఁ జివరిగ్రంథమని చెప్పవలయును. శైలినిఁబట్టికూడ నిట్లే తలఁపవలసియున్నది. వీరచరిత్రము తర్వాత నేమియురచించినట్టు కన్పట్టదు. "మఱియు 94వ పుటలో" శ్రీనాథునికిఁ బూర్వము మంజరీ కావ్యము రచించిన వా రెవరును లేరు. ఇతడు వ్రాసిన గ్రంథములలో నిది చివరిదియుఁ బరిణామావస్థలో

వ్రాయఁబడినదియుఁ గనుక వ్రాయునాఁటికి లోకానుభవ మధికముగా గలిగినట్లు గనఁబడుచున్నది. అని వ్రాసినారు. ఇక చిలుకూరి వీరభద్ర రావుగారు ఆంధ్రులచరిత్ర మూడఁవభాగములో "శ్రీయుతులైన ఉమాకాంతముగారు ప్రచురించిన పల్నాటివీరచరిత్రభాగము శ్రీనాథ కవి రచితము కాదని తోఁచుచున్నది. ఉమాకాంతముగారు పల్నాటి వీరచరిత్రమును శ్రీనాథుఁడు వార్ధకదశయందు వ్రాసెనని వ్రాయుచు న్నారు. కాని నిక్కముగా నాతఁ డాచరిత్రమును రచించి యుండె నేని బాల్యముననే వ్రాసియుండును. కాని, తప్పులతడిక వార్ధక్య మందు వ్రాసి యుండఁడు. "అని వ్రాసి, తమ శ్రీనాథకవి జీవితమున 138 పుట నధోపీఠికలో ఏపల్నాటి వీరచరిత్రమును శ్రీనాథకృత మని వ్యవహరించుచున్నారో అది శ్రీనాథకృతము కాదని నాయభిప్రా యము" అని తెల్పినారు.

కాశీఖండము రచించిన తర్వాత రాజావలంబము విరిగిపోఁగా శ్రీనాథుఁడు పల్నాటికి పోయెననుటకు తగిన కారణములు లేవు. అచట తన్ను పోషించు రాజులా, లేరు. వార్ధకమున శాంతముగా సుఖజీవ నము జరుపుకొనుటకు అది తగిన సౌకర్యములు గల ప్రదేశమా, కాదు. అభిమానముపడిపోవుటకు సరియగు కారణములు కనఁబడవు. వార్ధకము సంతయు నచటనే గడపెనని యుమాకాంతముగారు వ్రాసి నమాటలకు ప్రమాణమేమియుఁ గానరాదు. ఈకాలమున శ్రీనాథు నకుఁ గావలసినది ధనార్జనము. అది పల్నాటిలో దొరుకుట కవ కాశము లేదు. పల్నాటివీరచరిత్రను వ్రాయుటవలన నందలి జనులు గాని పిచ్చుకకుంటులుగాని యతనికి ధనమును కూర్చిపెట్టరు. చిట్టచివ రకు బొడ్డుపల్లెను గుత్తకుతీసికొని వ్యవసాయము చేయించె ననికదా తెలియుచున్నది. ఈమధ్యకాలములో నతఁడు శ్రీశైలమున కేఁగి కొంత భిక్షావృత్తి వలనఁగొంత ధనము గ్రహించి శివరాత్రిమాహాత్మ్య

మును రచించెను. తత్పూర్వమో తత్పరముననో ములికినాటిలోని మోపూరును పాలించు వల్లభరాయునికడ కేఁగి క్రీడాభిరామరచనమున నతనికి సాయమొనర్చి శ్రీనాథుఁడు కొంత ధనార్జనము చేసియుండును. కాని నాదరించి పిలుచుటకైనను పల్నాటిలో నెవరు రసికులుగాని, విద్యాభిమానులుగాని లేరని పూర్వానుభవమువలన శ్రీనాథుఁడు గ్రహించినాఁడు. ఇందుచే వార్ధక్యమున నచటికిఁ బోవుట కష్టపడుటకే కాన నచటికిఁ బోయెననుట యసంభావ్యము. అందుచే, నతఁడప్పుడు పల్నాటి వీరచరిత్ర రచించెననుటయు నసంభావ్యమే. పోనీ, యంతకుఁ బూర్వమే యెప్పుడో రచించియుండునందురా! అట్లే యగుచో క్రీడాభిరామమున సూచింపఁబడిన "వీరానీకమును బాడిన ద్విపదప్రబంధము" శ్రీనాథునిచే రచింపఁబడినదియై యుండుననుట సరసముగా నుండును. కాని యది శ్రీనాథుని దని క్రీడాభిరామమున తెల్పకుండుటచే నదికూడ శ్రీనాథకృతము కాదని, నిర్ణయింపవలసి వచ్చును. ఏలన, శ్రీనాథునిదేయైనచో నది తత్పూర్వ పల్నాటిచరిత్ర గ్రంథములకంటె నెక్కువ రసవంతముగా నుండి శీఘ్రముగ ప్రచారములోనికి వచ్చుటయే కాక, తద్గ్రంథాభిమానము చేతనైన వల్లభరాయఁడుగాని శ్రీనాథుఁడుగాని దానిని తప్పక తత్కర్తృనామనుముతో సహా పేర్కొనియుందురే కాని, కర్తృహీనముగా పేర్కొనియుండరు. అట్టిది లేకుండుటచే నది శ్రీనాథకృతము గాదనవలసియుండును.

భీమేశ్వరపురాణమున మూలమందులేని యాంధ్రదేశ వర్ణనలను శ్రీనాథుఁడు చేసినాఁడు. అట్లే జాతీయకవియైన శ్రీనాథుఁడు జాతీయవీరుల వీరగాథను రచించియుండు నందురు. భీమేశ్వరపురాణమున నొనర్చిన యాంధ్రదేశవర్ణనలకు పల్నాటిచరిత్రరచనకు చాల భేద మున్నది శ్రీనాథుఁడు భీమేశ్వరపురాణమును రచించుట తాను కొండవీటి రాజ్యమునుండి రాజమహేంద్రవరమునకు వచ్చినపుడు జరి

గివది కొండవీటి రెడ్డిరాజులకు రాజమహేంద్రవర రెడ్డిరాజులకు శత్రుత్వముండెను. శత్రురాజులనుండి వచ్చిన శ్రీనాథుఁడు రాజమహేంద్రవర రెడ్డిరాజులను, వచటి ప్రజలను మంచిచేసికొనవలసిన యవసరమెంతేనియు గలదు. అందుచే తాను పూర్వము కొండవీటిని పొగడిన దాని కంటె నధికముగ రాజమహేంద్రవరమును తత్ప్రాంతప్రదేశములను పొగడవలసిన యవసరము శ్రీనాథునకు పట్టినది. దీనికిఁ దోడు తాను శివభక్తిపరుఁడగుటచే, దాక్షారామ భీమేశ్వరుని నాచుట్టుపట్లనున్న శివక్షేత్రములను విపులముగా వర్ణించి తన యభిమానమును తీర్చికొనినాడు. అట్టియవసరములు పల్నాటివీర చరిత్ర రచనమునఁ గానరావు. పల్నాటివీరుల సాహసకార్యములను వర్ణించుట యందు శ్రీనాథున కుత్సాహ ముండినదుండవచ్చును. కాని దానికిఁ దగిన దోహదము లేకపోయినది. మఱియు వార్ధకము వీరరాదప్రధాన కావ్యములను రచించుటకుఁ దగిన కాలము కాదుకదా. కావున తనకు ధనమవసరముగా నున్నకాలమున, జాతీయాభిమానము చేత, పిచ్చుకుంటలు పాడుకొనుటకుఁగాను సౌకర్య మేమియు లేని పల్నాటికి, సుఖజీవనము చేయవలసిన వార్ధకములో, వతిసుకుమారాభిరుచులనలవఱచుకొనిన శ్రీనాథుఁడు పోయి, నివృత్తితో పల్నాటివీర చరిత్రమును గేయముగా రచించె ననుట యెన్నివిధముల నెంత సహృదయభావముతో విచారించినను సత్యదూరముగా నుండకమానదు. మొట్టమొదట పల్నాటివీరచరిత్రమును ప్రచురించిన శ్రీ అక్కిరాజు ఉమాకాంతము వంటివారు, తమస్వగ్రామము పల్నాడులోనిది గుటచే, పల్నాటిమీఁది యభిమానముచే శ్రీనాథునివార్ధకమున పల్నాటికాహ్వానించి యతనిచే పల్నాటివీరచరిత్రమును వ్రాయింపఁ దలఁచినను వారి కాయనమాత్ర మిచ్చు సమాధానమిది.

క॥ రసికుఁడు పోవఁడు పల్నా
డెసఁ గంగారంభ యైన నేకులె వడకున్‌
వసుధేశుఁడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్‌।

ఉ॥ అంగడి యూరలేదు, వరియన్నము లేదు, రుచిత్వ మేమి లే
దంగన లింపులేరు, ప్రియమైన వనంబులు లేవు, నీటికై
భంగపడంగఁ బాల్పడు కృపావరు లెవ్వరు లేరు, దాత లె
వ్వంగను సున్న గాన పలనాటికి నాటికిఁ బోవ నేఁటికిన్‌!

అని వ్రాసికొనిన శ్రీనాథుఁడు వార్ధకమున పల్నాటికిఁబోయి పల్నాటిచరిత్రను వ్రాసెననుట కల్ల. బాల్యమున(తత్పూర్వము) గూడ వ్రాసి యుండఁడనుట కా చాటుపద్యము లే ప్రమాణమగునుకదా శ్రీ అక్కిరాజు ఉమాకాంతంగారి మీఁద నాకభిమానము లేక వ్రాసినది కాదు నేను. ఆయన మా తాతగారు శిష్టా సీతారామశాస్త్రిగారి ప్రియశిష్యులు (చూడుఁడు వారి నేఁటికాలపు కవిత్వము గురుస్తుతి) కాని నాయభిమానము సత్యసన్నిహిత విషయములను గూడ కప్పి పుచ్చునంతగొప్పది మాత్రముగాదు.

(6) శ్రీనాథుఁడు తననైషధాంధ్రీకరణము నొకగొప్ప ప్రజ్ఞగా భావించి తరువాత రచించిన గ్రంథములం దెల్లెడలను దానిని గర్వముతో పేర్కొనుటయే కాక, కొండవీటిరాజులు తన్ను భూమి సిస్తుకై బాధించిన కాలములోఁ గూడ మక్కువతోఁ జెప్పికొనుట మఱువలేదు. చూడుఁడు.

"కల్పించినాఁడవుగాథ పాకంబైన, హర్ష నైషధ కావ్యమాంధ్రభాష'
"నవమరుత్తు చరిత్రంబు, నైషధంబు; సప్తశతి పండితారాధ్య
"చరితమనగ కావ్యములు పెక్కు చెప్పియుఁ గాంతు చనక"

భీమేశ్వరపురాణము I,24.

" సంతరించితి నిండు జవ్వనంబునయందు, హర్ష నైషధ కావ్య
మాంధ్రభాష" కాశీఖండము I, & 13.

"నైషధాది మహాప్రబంధములు పెక్కు చెప్పినాడవు"

"అథర్వణవేదశాఖాధీతి నిష్ణాతుః సంధ్రభాషో నైషధాబ్జ భవుని"
హరవి. (1-8)

శివరాత్రిమాహాత్మ్యమున పీఠికభాగము గ్రంథ పాతములలోఁ గూడియుండుటచే నాంధ్రనైషధమునుగూర్చి శ్రీనాథుఁడు చెప్పికొనిన పద్యము పోయియుండును. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమశృంగార శ్రీనాథము 27గ పుటలో నిట్లువ్రాసిరి. "శివరాత్రిమాహాత్మ్యగ్రంథా వతరణిక గ్రంథపాతములలో నున్నది. కావునఁ దెలియఁదగిన విశేష ములు కొన్ని మఱుగుపడియున్నవి." కాన నాకుఁగూడ నాంధ్రనైష ధమునుగూర్చి శ్రీనాథుఁడు తప్పక గర్వముతో చెప్పికొనినాఁడని విశ్వసింపవచ్చును. ఇఁక చివరకాలమున చెప్పికొనినపద్యములో "ఆంధ్ర నైషధకరయంఘ్రి యుగ్మంబునఁ దగిలియుండెను కదాసిగళయుగము" అని వ్రాసినాఁడుకదా కవిసార్వభౌమత్వమునకు గూడ నతఁడింత మక్కువ పడలేదు. కాన ఇంత గర్వకారణమైన తన యాంధ్ర నైష ధమును గూర్చి పల్నాటివీరచరిత్రలోని కల్లుపత్రిష్ట-బాలుని యుద్ధ ముల గ్రంథావ తరణికలో నెక్కడైనను చెప్పికొనినాఁడేమో విచా రింపుఁడు. ఆంధ్రనైషధకర్తయగు శ్రీనాథుఁడే కల్లుపత్రిష్ట-బాలచం ద్రుని యుద్ధముల" కర్తయేయైనచో నాంధ్రనైషధకావ్యకర్తృకమును గర్వముతో నందుచెప్పికొనఁడా ? అట్లుచేయలేదు. కాన నిద్దఱు శ్రీనాథు లొక్కరు గాఁజాలరు. మఱియు తన పూర్వరచిత గ్రంథ మొక్కటైనను చెప్పుకొనకపోవుటయే కాక, "శాశ్వతంబైనట్టి సద్గ్రంథ మొక్కటి, చెప్పఁబూని మనస్సుచెలరేగి యుండ" అని తాను పూర్వమెప్పుడును శాశ్వతముగా నుండఁదగిన గ్రంథము నొక్కటి

కూడ రచింపలేదేమో యను నభిప్రాయము గూడ కల్గించునట్లు వ్రాసికొనినారు. కల్లుప్రతిష్ఠ కర్త. "కావ్యములు పెక్కు చెప్పియు కాంక్షచనక" అని చెప్పికొనిన భీమఖండకర్తయగు శ్రీనాథుఁడు కల్లుప్రతిష్ఠకర్త వలె చెప్పికొను నాయిసుపురు నొక్కడైనచో లేక నైషధాది ప్రబంధములు పల్నాటివీరచరిత్రయంత శాశ్వతమైన సద్గ్రంథములు గావనియా? శ్రీనాథునియభిప్రాయ మతఁ డెంత దేశీయకవి యగుయుగ కర్తయైనను, కాన నాంధ్రనైషధకర్తయగు శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్రకర్త యెంతమాత్రము కాఁజాలఁడు.

(7) కల్లుప్రతిష్ఠా భాగావతరణికయందు తత్కర్త యిట్లు చెప్పికొనినాఁడు.

"సంగీతసాహిత్య చాతుర్య కవిత, చెప్ప నేర్చినవాఁడ చెలఁగి మాచెర్ల"

ఇందువలన తత్కర్త సాహిత్యముననే కాక, సంగీతమునం గూడ చక్కని ప్రవేశము గలవాఁడని తెలియుచున్నది. సాహిత్య పండితునకు ఛందోవ్యాకరణాలంకార శాస్త్రములలో విశేగా చక్కని నైపుణ్య ముండితీరవలయును కాని నృత్యసంగీతములలో పాండిత్య ముండ నవసరము లేదు. గేయకవులకు, యక్షగానకర్తలకు, నటులకు, సంగీత జ్ఞానముతో నవసరముండును. ఆంధ్రనైషధకర్తయైన శ్రీనాథుఁడు సాహిత్యవిషయములలోనే కాక తర్కవ్యాకరణ వేదవేదాంతాది శాస్త్రములలోఁగూడ నిష్ణాతుఁడైనట్లు తెల్పుకొనినాఁడే కాని సంగీతశాస్త్రమందు ప్రవేశ మున్నట్లతని గ్రంథములలో నెక్కడ తెల్పుకొనినట్లు గోచరింపదు. రామరాజభూషణుఁడు మాత్రము సంగీతమునందుఁగూడ తాను పండితుఁడనని తెల్పుకొనినాఁడు. పై ద్విపద పాదములను పురస్కరించుకొనియే యుమాకాంతము గారు తమపీఠికలో 75 వ పుట "నలగామరాజు సభలో వేశ్యానాట్యసందర్భ

మునుఁ జెప్పిన సంగీతరహస్యము లాతఁ డాదియందు" సంగీతసాహిత్య
చాతుర్యకవిత, చెప్పనేర్చినవాఁడ "అని చెప్పుకొన్న విషయమును
ధ్రువపఱచుచున్నది," అని వ్రాయఁగ, విశాలాంధ్ర వారి పల్నాటి
వీరచరిత్ర పీఠిక 37 పుటలో పింగళి లక్ష్మీకాంతంగారు" ఈ కథా
భాగమును (కల్లుప్రతిష్ఠ) రచించినకవి వ్యుత్పన్నుఁడా, లేక, అవ్యు
త్పన్నుఁడా అనిపరిశీలించుచో, అతఁడు పరిపూర్ణ విద్యాసంస్కార
మున్నవ్యుత్పన్నుఁడని, ఈగ్రంథమునఁ గల పంక్తు లడుగడుగునను ఘో
షించుచునే యుండును. ఉదాహరణమునకు నలగామరాజు కొలువులో
గాయకులను, నాట్యకత్తెలును నెరపిన కళాప్రదర్శనములు
వర్ణింపఁబడిన ఈదిగువపంక్తులను చదువరులు పరిశీలింపఁదగును" అని
వ్రాసియున్నారు. నలగామరాజు కొలువులో గాయకులు, నాట్య
కత్తెలును నెఱపిన సంగీతనాట్య ప్రదర్శన వర్ణనలో నాట్యసంగీత
శాస్త్రపారిభాషిక పదములు, సంప్రదాయములు చక్కఁగ వెలువ
రింపఁబడినవి దానిని బట్టి తత్కావ్యకర్తకు నాట్యసంగీతశాస్త్రరహ
స్యములు మాత్రము చక్కఁగా తెలియునని, యునూకాంతముగారు
నుడివినట్లు చెప్పవచ్చునుగాని "పరిపూర్ణవిద్యాసంస్కార మున్న
వ్యుత్పన్నుఁడ"ని మాత్రము నిర్ణయింపరాదు. నాట్యసంగీత శాస్త్ర
జ్ఞాన మున్నంతమాత్రముననే" పరిపూర్ణవిద్యాసంస్కార మున్నవ్యు
త్పన్నుఁడని దృఢపఱచుట కెట్లువీలగును. నాటకసంగీత శాస్త్ర
జ్ఞానము లేనంత మాత్రమున నాంధ్రనైషధకర్త పరిపూర్ణవిద్యా
సంస్కారమున్నవ్యుత్పన్నుఁడు గాడనియు నిశ్చయింపలేము. తంజా
వూరుపతన మను నవలలో తత్కర్త్రి శ్రీమతి మల్లాది వసుంధర
యనేకశాస్త్రవిషయ పారిభాషికపదములను వివరించెను. అంతమా
త్రమున నామె యాశాస్త్రములన్నింటిని నేర్చెనని నిర్ణయింపఁ
గలమా? ప్రస్తుతము మనకుఁ గావలసినది కల్లుప్రతిష్ఠ-బాలచంద్రు

యుద్ధములలోని కవిత నైషధాంధ్రీకరణకర్త కవితాశైలివంటిదా, కాదా, యనునదే విచారణీయము. విక్రమార్కచరిత్రమున జక్కన కవి యూర్వశీరంభలనాట్య సంగీత కళాప్రదర్శనము నెట్లు వర్ణించినాఁడో చూడుఁడు.

సీ॥ కలికి కన్నులపోయగము మించుఁదళుకులు
చెలఁగెడు మగతాల చెలువునొంద
నభినవస్ఫురణమై నభినయించు కరమ్ము
లలరుఁగెందమ్ముల ననుకరింప
నిటలంబున నటించు కుటిల కుంతలకాంతి
కోదమ తుమ్మెదల యొప్పిదముమాపు
వలిపకంచెలలోని వలిచనుంగవ మించి
జక్కనకవభంగి సంభ్రమింప.

గీ॥ మంజుమంజీర కంకణ శింజితములు
సమదకలహంస కలనినాదముల వెలయ
సరసగతిఁ జూఁచి సరసులు సరియనంగ
రంభ సురరాజుమోలిల నర్తనమొనర్చె.

సీ॥ శృంగారమే పార సంగవల్లికయందు
గీతసామగ్రి యంగీకరించి
కరతలామల కంబుగాఁ గరాంబుజముల
నర్థమూద్యంతంబు నభినయించి
భావింప నరుదైన భావమర్మంబులు
మెఱుగుఁజూపులలోన మేళవించి
తానమానములతోఁ దాళ నిర్ణయలీలఁ
జరణపల్లవముల సంగ్రహించి.

గీ॥ యఖిలమును మెచ్చఁ బ్రఖ్యాతమైనయట్టి
నాట్యవిద్యాధి దేవతనాఁ దనర్చి
భరత శాస్త్ర మర్మజ్ఞతా ప్రౌఢి మెఱసె
నూర్వశీకాంత వేల్పుఁ బేరోలగమున॥

పై జక్కనకవి నాట్యసంగీతకళా ప్రదర్శనవర్ణనమున కవితాకళ తొణికిసలాడుచున్నది. కల్లుప్రతిష్ఠ, బాలచంద్రుల యుద్ధముల కర్త యొనర్చిన నాట్యసంగీతకళా ప్రదర్శన వర్ణనమున శాస్త్రవిషయములు యథాతథముగ పారిభాషికపదములతో సహా సంప్రదాయ సిద్ధముగ వివరింపబడినవి. ఇందుకు సందేహము లేదు. ఇందు శాస్త్ర విషయకజ్ఞాన ప్రదర్శనములో నేవిధమైనలోపము లేదు, కాని కవితా శక్తి దోషముపడినది. అందుచేతనే సంగీతసాహిత్యచాతుర్య కవిత, చెప్ప నేర్చిన వాఁడ'నని' సంగీత శాస్త్రములలో తనకున్న నేర్పునుగూడ దెలుపుకొనినాఁడు శ్రీనాథు డెక్కడ నెప్పుడును దనకు సంగీత శాస్త్రముతో ప్రవేశమున్నట్లు చెప్పుకొనలేదు అందుచే సంగీత శాస్త్రములోఁగూడ ప్రవేశముగల కల్లుప్రతిష్ఠకర్త యగు శ్రీనాథుఁడ వేఱును, నాంధ్రనైషధకర్తయగు శ్రీనాథుఁడు వేఱును గావలయును, ఆంధ్రనైషధకర్త సంగీతములో ప్రవేశముగలవాఁడేయైనచో ఆ మాట చెప్పికొనఁడా? ఏగ్రంథమునను జెప్పికొనక, కల్లుప్రతిష్ఠలో మాత్రమే చెప్పికొనునా? అట్లు చేయుటకు కారణ ముండవలదా? వేశ్యానాట్యవర్ణనమును శ్రీనాథుఁడుగూడ చేయకపోలేదు. చూడుఁడు భీమఖండప్రథమాశ్వాసము నందలి యీక్రిందిపద్యమును.

సీ॥ విరులదండలతోడి వేణికాభారంబు
పొంకంబు పిఱుఁదలఁ జొరలియాడ
మణితులా కోటికోమల ఝణత్కారంబు
రవళి మట్టెలమ్రోఁత యవఘళింప

గుదురునిండిన చిన్నిగుబ్బచన్నులమీఁద
ముక్తాలతిసరంబు మురువుచూప
వలమానతాటంక వజ్రాంకురచ్ఛాయ
శీతవెన్నెలఁ బుక్కిలించి యుమియ.

గీ॥ సాని యీశానియై మహోత్సవమునందుఁ
గేలనవచంద్రికాంతపుగిన్నె పూని
వీథి భిక్షాటన మొనర్చువేళఁ జేయు
మరులనృత్యంబు జగముల మరులుగొలుపు.

పై పద్యమందలి నాట్యకళాప్రదర్శన వర్ణనమునకు, కల్లుప్రతిష్ఠలోని నాట్యకళాప్రదర్శవర్ణనమునకు నెట్టిభేదమున్నదో సరసులకుఁ దెలియకపోదు. శ్రీనాథునివర్ణనము జక్కన వర్ణనవిధానములోఁ జేరినది. వీరిద్దఱకు సంగీతశాస్త్రములో నెట్టి ప్రవేశమున్నదో యెవరును చెప్పలేరు కాని, నాట్యమును కవిత్వములో వర్ణింపనిరుపమానులని మాత్ర మంగీకరింపకతప్పదున్నక కల్లుప్రతిష్ఠకర్త నాట్యసంగీతశాస్త్రసంప్రదాయములను పచ్చిగా వివరింపఁగల్గెనేకాని, వానిని కవితాశిల్పముగా మార్చి వర్ణింప లేకపోయినాఁడు. కాన నతఁడు "కోళ్లపోట్లాట వర్ణించిన మల్లయ కొమ్మరాజుయుద్ధమును వర్ణించిన కొండయలతో సమానుఁడైన సామాన్యకవియేకాని పరిపూర్ణవిద్యాసంస్కారమున్న వ్యుత్పన్నుఁడని నిర్ణయింపరాదు, నాట్యసంగీత పారిభాషికపదములతో సంప్రదాయాను గుణముగ రచించినంతమాత్రముననే పరిపూర్ణ విద్యాసంస్కారముగల వ్యుత్పన్నుఁడైనచో, కూచిపూడి భాగవతులలోని శ్రీ వెంకటి వెంకటనారాయణ, వేదాంతం లక్ష్మీనారాయణగార్లు నాట్యసంగీతశాస్త్రములందు నిష్ణాతులైనాట్యసంగీతములను నిరుపమానమున ప్రదర్శింపఁగల్గి కవిత నల్లగలవారని ప్రసిద్ధి. 'వారుగూడ పరిపూర్ణవిద్యాసంస్కారముగల వ్యుత్పన్ను లన

దగునా? విద్యాసంస్కార వ్యుత్పన్నతకు నాట్యసంగీతశాస్త్రములు చాలవు. ఇటీవల 30,—40 సంపూర్ణమువఱకు తర్క-వ్యాకరణ వేద వేదాంతశాస్త్రములందుఁ జక్కని పాండిత్యమున్నవారిని మాత్రమే విద్యాసంస్కారమున్న వ్యుత్పన్నులుగా గణించి, వారికి, ప్రతిసంవత్సరమును వార్షికములనిచ్చి మహారాజులు సత్కరించెడువారు. ఆంధ్రనైషధకర్తయగు శ్రీనాథుఁడట్టివాఁడు కనుకనే డిండిమభట్టువాదములో గెల్చినాఁడు. అట్టిశ్రీనాథుని కల్లుప్రతిష్ఠకర్తతో సమానునిజేయుట యాంధ్రనైషధకర్తకపచారముచేయుటే యగును. ఆంధ్రనైషధకర్త తనవైదుష్యమునుగూర్చి యేమని చెప్పుకొనెనో గనుఁడు.

శా॥ బ్రాహ్మీదత్తవరప్రసాదుఁడఁడ వుదుప్రజ్ఞా విశేషోదయా
జిహ్మస్వాంతుఁడ, వీరభద్రార్చన కళాశీలుండ సభ్యార్జిత
బ్రహ్మాండాది మహాపురాణచయ తాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళానిధానమవు నీభాగ్యంబు సామాన్యమే॥ ఆంధ్రనైషధ 1-13

"అఖిల పురాణవిద్యా ప్రవీణుః సద్వార్యు వేదశాఖాధీతి నిష్ణాతు" హర.వి. 1-8.

"ఆగమజ్ఞాననిధివి తత్త్వార్థఖనివి, బహుపురాణజ్ఞుఁడవు శుభభవ్యమతిని హర. వి. 1-12.

పై రెండు గ్రంథములందుమాత్రమే తనవైదుష్యమునుగూర్చి యతఁడు చెప్పుకొనినాఁడు చెప్పికొనినంతవఱకు నతఁడు సంగీతశాస్త్రనైపుణ్యముగలవానిగ నెప్పుడు చెప్పుకొనలేదు కల్లుప్రతిష్ఠకర్త తాను సఖలపురాణవేది ననికాని,యద్వార్యుఁడనని కాని, లేక శాఖాధీతి నిష్ణాతుఁడనని కాని బ్రహ్మజ్ఞాన కళానిధానుఁడనని కాని నైషధగ్రంథములో చెప్పినట్లు చెప్పికొనలేదు. కాన నిరువురు శ్రీనాథు

లోకులు కాఁజాలరు. ఇఁక తన కవితా ప్రభావమునుగూర్చి హ
విలాసములో నిట్లు.

" కవితా మహారాజ్యభద్రాసనాసీనుండు" " ఉభయభా
కవిత్వ ప్రయోగకుశలుఁడు") అని హరవిలాసము 1-8. లోను.

"వచియింతు వేములవాడ భీమనభంగి" కాశీఖండం 1-

"ఈక్షోణిన్నినుబోలు సత్కవులు లే రీనాఁటికాలంబునన్

♦ ♦ ♦ ♦

కవిసార్వభౌమ! భవదీయ ప్రౌఢసాహిత్యముల్॥ కాశీఖం

1+1

అని కాశీఖండమందును బహుగర్వముతో బింకముగా చె
కొనిన శ్రీనాథుఁడు " సంగీతసాహిత్య చాతుర్యకవిత చెప్పనేర్చి
వాఁడ" నని రెండుమాటలతో స్వవిషయమును చెప్పుకొనుట అ
జిహ్వాగ్రమునుండి వెలువడునా? తన కవిత్వవిశేషమును గూరి
శ్రీనాథునకున్న యుత్కర్ష యహంకారము నాత్మవిశ్వాసము ని
రులకు లేదు. అందులకతఁడరుహుఁడు, అట్టిచో తన కవిత్వమునుగూరి
" కవితచెప్ప నేర్చినవాఁడు కవితనల్లనేర్చినవాడు నని నీరసము
వ్రాసికొనఁడు కథావిషయమున నెన్నఁడు నిట్లుజరుగదు. తాన క
ప్రతిష్ఠగ్రంథావతరణిక రచనావిధానమే యాంధ్రనైషధకర్త స్వభా
మునకు, విరుద్ధముగా నున్నది. మఱియు నీ "సంగీతసాహిత్య చాతు
కవిత, చెప్పచేర్చినవాఁడు" అను రెండు ద్విపదపంక్తులు కాండ
రచించిన కొమ్మరాజు యుద్ధము అవతారికలో యథాతథముగ వా
కొనఁబడినవి. దీనికారణ మేమైయుండును ? ఇద్దఱునుగూడ "సంగీ
సాహిత్యచాతుర్యకవితఁ జెప్పనేర్చినవా ర"నియేనా, అయినను నొ
విధముగా రచించియుందురా? యిద్దఱునుగూడ, లేక యొకరిని జూ
మఱియొకరు వ్రాసికొనియుందురా? లేక సంపాదకు లెవరో తా

మారు చేసియుందురా? ఇంతకు చాతుర్యకవితయని రెండు చోట్ల వాడఁబడుటలో సారస్యమేమి యని విచారింపవలసియున్నది.

(8) ఆంధ్రనైషధకర్తయైన శ్రీనాథుఁడు నైషధాదిగ్రంథములం దెల్లెడలను తన్ను స్పష్టముగా గుర్తించుకొనుటకుఁగాఁబోలు తనతలిదండ్రుల పేరును, తాతపేరును దెలిపికొని గోత్రముతోపాటు తన సూత్రమునుగూడ వివరించుకొనినాఁడు. కాని కేవలము తన పేరును గోత్రమునుమాత్రమే తెల్పుకొనినవాఁడుగాఁడు చూడుఁడు.

శా. భారద్వాజ పవిత్రగోత్రుని, శుభాప స్తంబసత్సూత్రు........

....మారయకుఁ బుణ్యాచార భీమాంబకున్

గారామైన తనూజు నన్నఘు శ్రీనాథాఖ్యునిం బిల్చి నైష1-12.

సీ. కమలనాభుని పౌత్రు..........

పౌత్రు; నాప స్తంబసూత్రు భారద్వాజ, గోత్రు........

భీమాంబికా మారనామాత్యనందను—హరవిలాస 2-8.

మ. కనకక్ష్మాధరధీరు.........

......................మా

యనుగుందాతఁ బ్రదాత శ్రీ కమలనాభామాత్య చూడామణిన్

భీమ 1-10.

వ. అనవుడు నమ్మహీసురాగ్రగణ్యుండు కమలనాభామాత్య పౌత్రుండును, మారయామాత్య పుత్రుండును నగు శ్రీనాథకవివరేణ్యుండును సంతుష్టమానసుండై"...........శివరాత్రిమా 1-58.

కాశీఖండమున నుపోద్ఘాతములోఁ దన తాతతలిదండ్రుల పేర్లు చెప్పకొనకపోయినను తను రచించినగ్రంథములనన్నింటిని వరుసతో పేర్కొని, తన్ను గుర్తింపఁజేసికొనినాఁడు. కాని, యాశ్వాసాంతగద్యలలోమాత్ర మితరగ్రంథము లందన్నింటివలెనే తనతాతతండ్రుల నామములను తన పేరును స్పష్టముగాఁ దెలిపికొనినాఁడు. కానికల్లు

ప్రతిష్ఠకర్త, తాను భారద్వాజవంశవర్ధనుఁడ, కవిసార్వభౌముఁడ ఘనత గన్నట్టి శ్రీనాథుఁ డనువాఁడ శివభక్తిపరుఁడ' 'నవిమాత్రము వ్రాసికొనినే కాని యెక్కడను తలిదండ్రుల పేరులుగాని, తాత పేరుగాని సూత్రము పేరునఁగాని చెప్పికొనలేదు. అంతియకాదు కొండయగాని, గ్రంథప్రారంభమున అనుగురాజు-పల్నాటిరాజ్యసంపాదనము' అను ప్రకరణమును రచించిన యనామకకవి కాని, యతనితాతతలిదండ్రుల పేరులను చెప్పలేదు. ఇక మల్లయ (కోళ్లపోరు కర్త) శ్రీనాథుని పేర్కొనె నని, విశాలాంధ్ర పీఠికకర్త 35 వ పుటలో "శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్ర రచించినట్లుగా మల్లయయును......తమ కథా భాగములందు చెప్పుకొనిరి" అని వ్రాసెను. కాని మల్లయగ్రంథావతారికలోఁగాని, గ్రంథాంతమందుఁగాని మఱియెక్కడైనను గాని శ్రీనాథుని పేరు నుచ్చరింపలేదని యాగ్రంథము చదివినవారందఱకు స్పష్టము మల్లన వ్రాసినకథాభాగమున నేపుటలో శ్రీనాథుని పేరు పేర్కొనఁబడినదో నెవ్వరైనఁ దెల్పఁగలరా ? ఆభాగగ్రంథావతరణిక గ్రంథపాతములోఁ గూడుకొని మధ్యలో విడువఁబడి గ్రంథపాతమని వ్రాయఁబడినది. తరువాత కథ ప్రారంభింపఁబడినది. దానిచివరకూడ శ్రీనాథుని పేరు లేదు. ఇట్టిచో తాను పరిష్కరించిన గ్రంథములను నాలుగు మూలలనైన జాగ్రత్తగా చూడకుండ నసత్యములతో బూకరింపఁ జూచుట శోచనీయమైన విషయము గాదా? అట్టి రచనలనే ప్రమాణముగా గ్రహించి యుదాహరించువారి సంగతి నిఁకఁ జెప్పనేల? వి.పి. కర్త యట్లు వ్రాయుటకుఁ గారణమేమనఁగా, అక్కిరాజు ఉమాకాంతముగారు దన పల్నాటివీరచరిత్రప్రథమముద్రణ పీఠిక 76 వ పుటలో శ్రీనాథునికిఁ బిమ్మట వీరచరిత్రమును వీరభద్రుఁడు పద్యమయముగను మల్లయ, బలరామసెట్టికొడుకు కొండయ యనునిరువురు ద్విపదగాను రచించిరి, కొండయయు, మల్లయ్యయుఁ దమగ్రంథములలో

శ్రీనాథు నుదాహరించియున్నారు. వీరు తమగ్రంథములఁ జాలవఱకు శ్రీనాథు ననుసరించియే చెప్పిరి." అని వ్రాయుటయే. కాని వి. పీ కర్త ఉమాకాంతముగారి పేరును మాత్రము పేర్కొనలేదు. ఉమాకాంతంగారే లిఖిత ప్రతిని జూచి యట్లు చెప్పిరో తెలియదు. వారాభాగముల నుదాహరించిన బాగుండెడిది కాని, వారు మల్లయ్య కొండయ్యలు రచించిన భాగములను బ్రచురించుట లేదు కాన, వారాభాగముల నుదాహరింపకున్నను నధిక బాధ్యత వారికి లేదు. కాని మల్లయ్య కొండయ్యలు రచించిన భాగములను గూడ బ్రచురించువారి కాయభిప్రాయ మున్నచో నాయాభాగముల నుదాహరింపవలసిన యావశ్యకత తప్పక యున్నది. లేనిచో వారిది వట్టిబూకరింపనియు నసత్యమనియు మోసమనియు లోకము భావించును గదా.

(b) ఇంతకు, "భారద్వాజగోత్రుఁడు శ్రీనాథుఁ"డని పేర్కొనినఁ జాలదా, యాంధ్రనైషధకర్త గోత్రము భారద్వాజగోత్రమే కదా, కాన నిద్దఱు నొక్కరే యగుదురని వాదింతురేమో అట్లు కాదు. అంతమాత్రము చాలదు. భారద్వాజ గోత్రులు బ్రాహ్మణులలో నేశాఖవారైనను గావచ్చును. నియోగులలోను, వెలనాడు, తెలగాణ్యము, వేగినాడు, మురికినాడు, కాసలనాడు మొదలైన వైదికుల భేదములలోను, వైష్ణవులలోను, మాధ్వులలోను గూడ నుండవచ్చును. అంతేకాదు, ఆంధ్రబ్రాహ్మణులలోనే కాక, తమిళ, కన్నడ, మలయాళ, మహారాష్ట్రాది బ్రాహ్మణులలోఁగూడ భారద్వాజగోత్రు లుండవచ్చుననుటలో నాక్షేపము లేదు. కాని వారిలో నాశ్వలాయన సూత్రము వారని బోధాయన సూత్రమువారని, యాపస్తంబసూత్రమువారని మొదలైన భేదము లుండవచ్చును. అందుచేతనే యాంధ్రనైషధకర్త తా నాపస్తంబసూత్రుఁడనని చెప్పికొనినాఁడు. ఒక్క వంశములోఁ బుట్టినవారి కేకగోత్రమే యుండునుగదా. ఒక్కే పేరుతో

నుండువా రేకవంశమునవకాక వివిధవంశములలోను కులములలోఁ గూడ నుండవచ్చునుగదా, సర్వసామాన్యముగా తాతపేరు మనుమనికి పెట్టుకొందురు. మనుమనికి తాతపేరు పెట్టుటలో, పినతండ్రుల బిడ్డలకు, పెదతండ్రులబిడ్డలకుఁ గూడ నభిమానముతో నొక్క తాతపేరే పెట్టుకొందురు. అట్టిస్థితిలో ఒక్కటే పేరుగల తాతమనుమలను, పెదతండ్రి పినతండ్రిబిడ్డలను గుర్తించుట యెట్లు? ఇది తలిదండ్రులయు తాతలయు పేరులవలనమాత్రమే సాధ్యమగును. అందుచేతనే సందేహనివారణార్థము తనపేరుతోపాటు తాతతండ్రులపేర్లను తల్లిపేరును గోత్రమును సూత్రమునుగూడ ప్రవరగా చెప్పుట యాచారమైపోయినది. కాన శ్రీనాథుఁడను పేరెంతయపురూపముగా లోకమున వినఁబడుచున్నను, మఱికొందఱకుఁగూడ నామనోహరమైన నామ ముండవచ్చుననుటలో నసంభావ్యత్వము లేదు. సంస్కృతనైషధ వ్యాఖ్యానకర్తలలో శ్రీనాథనామధేయుఁ డొకఁడు కలఁడని తెలియుచున్నది. అట్లే యాంధ్రకవులలో నందనందన చరిత్ర, వల్లభాభ్యుదయము, కామశాస్త్రముల కర్తలును, ధనంజయ విజయకర్తయు, కాటమరాజుకథకర్తయు శ్రీనాథనామధేయులని తెలియుచున్నది. కదా వీరును నాంధ్రనైషధకర్తయు నొక్కరా? లేక వేఱువేఱా? యని నిర్ణయించుట యెట్లు? వారిగోత్రము మాత్రమేకాక వారి తాత తల్లిదండ్రులపేర్లు గూడ సహాయకారులగునుగదా. కాన కవి నామగోత్రము లేక మైనంతమాత్రమున నాంధ్రనైషధకర్తయు, పల్నాటివీరచరిత్రకర్తయు నొకరు కాఁజాలరు. కుమార ధూర్జటి తన కృష్ణరాయవిజయ కావ్యమున దాను పాకనాటార్వేల వంశమును భరద్వాజగోత్రుండు నాపస్తంబసూత్రుడైనట్లుగ నీరీతి దెల్పుకొనినాఁడు—
"సీ॥ నను భరద్వాజగోత్రుని నదాపస్తంబసూత్రుని బాంధవ స్తోత్రపాత్రు; పాకనాటార్వేల వంశ ప్రసిద్ధుని ధూర్జటి పౌత్రు" అని చెప్పి

కొనినాఁడు. కాన పల్నాటివీరచరిత్రకర్త, ధూర్జటి కవివంశములో నొక్కఁడై శ్రీనాథనామముతో నుండఁగూడదా? నిశ్చయించు టెట్లు? ఇట్లే మామిడి సింగనమంత్రియు భారద్వాజగోత్రులు. వాఁడు పండితుఁడుగూడ వానివంశములో నొకఁడు శ్రీనాథనామధేయుఁడై దీనిని రచింపఁగూడదా? కోళ్ల పోరును రచించిన మల్లయ తనగోత్రముతో పాటు తాత తల్లిదండ్రుల పేర్ల నెట్లు తెలుపుకొనినాఁడో చూడుఁడు.

కౌండిన్య గోత్రుఁడా గాదయామాత్యుఁ డసమానుఁ డతనికి ననుగునందనుఁడ
రాజశేఖరపద రాజీవలోల, మధుకరుండైన రామనమంత్రిమణికి
అమలాంబకును పరమానంద సుతుఁడు, మల్లికార్జునస్వామి మన్ననవాఁడ
మల్లయ యను పేర మహిపరగువాఁడ,"

అనికదా స్పష్టముగాఁ తెలుపుకొనినాఁడు. ఇక, కొమ్మరాజ యుద్ధమును వ్రాసిన కొండయ తానెట్లు దెలుపుకొనెనో చూడుఁడు. ఫలశ్రుతిలో నిట్లు చెప్పుకొనెను.

"పాండిత్యమహిమల బలరామి శెట్టి. కొండనాహ్వయుండు సద్గుప
కృపాత్రయుండ"

గ్రంథావతరణికలో నిట్లున్నది.

"శ్రీవిలసిల వెలసిన రామిశెట్టి, సర్వనార్యసుతుఁడ సత్కవిప్రియుఁడ,
పరసమయ మదగజపంచాననుండ, వరగొండ నాహ్వయుండన
ధాత్రి వెలసి"

ఈభాగము విశాలాంధ్రవారి ముద్రణమునఁ గానరాదు. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమందలి D. 1141 గ్రంథములోనున్నది. ఇట్లు మల్లయ్య కొండయ్యలే తమతలిదండ్రుల పేరులను చెప్పుకొనఁగా శ్రీనాథుఁడు కల్లుప్రతిష్ఠలో తన తండ్రిపేరునైన చెప్ప

కొనలేదనుట విచిత్రముగా లేదా? కాన నాంధ్రనైషధకర్త" యు పల్నాటివీరచరిత్రకర్తయు నొక్కరే యని విశ్వసించుటకు వీలులేదు. మఱియు "పలను భారద్వాజ వంశవర్ధనుడ" అని యాంధ్రనైషధకర్త, పడికట్టురాళ్లతో, నిరర్థకపదములతో పద్యరచనముచేయుట కాఁగని జిహ్వాగ్రమునుండి యట్టిమాటలు వెలువడఁగలవా! విశేషించి "భారద్వాజవంశవర్ధనుఁడ"నని గోత్రనామమును వంశనామముగా వాడు కొనునా? ఏక గోత్రమువారు వివిధజాతి బ్రాహ్మణులలోఁ గలరని వెనుకఁజెప్పితినికదా. ప్రస్తుతకాలమందువలె శ్రీనాథునియింటిపేరు (వంశనామము) తెలియదు. తలిదండ్రులపేర్లచేతనే యతఁడు గుర్తింపఁ దగినవాఁడు. అది స్పష్టముగాఁ దెలియనప్పుడు కల్లుపత్రిష్ఠకర్తయు నాంధ్రనైషధకర్తయు నొక్కఁడే యని నిర్ణయింప వీలులేదు.

(9) కల్లుప్రతిష్ఠకర్తయగు శ్రీనాథుఁడును, నాంధ్రనైషధకర్త యగు శ్రీనాథుఁడును కవిసార్వభౌములని చెప్పఁబడిరి. కాన వారిద్దఱు నొకరేయని వాదింతురేమో, అట్లైనను గూడ నొకరుగానుండుటకు నవకాశము గలదు. ఏలన, నాంధ్రమున కవిసార్వభౌమబిరుదము పలువురకుఁ గలదు. ఒక్కయాంధ్రనైషధకర్తకుమాత్రమే యాబిరుద మున్నచో నాయిద్ద ఱొకరే యని యంగీకరింపవచ్చును. ఆశ్వాసాంతములలో కూచిమంచి తిమ్మకవికిని, బాలభాగవతములను చంపూద్విపదలలో రచించిన కోనేరునాధకవికినిగూడ కవిసార్వభౌమబిరుదు కలదు. నవీనులలో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికిఁ గూడఁ గలదు కదా ఇట్టిచో నేజమీందారునైన నాశ్రయించి కల్లుప్రతిష్ఠకర్తగూడ కవిసార్వభౌమ బిరుదమును సంపాదించుకొనవచ్చునని వాదముకొఱకైనను చెప్పవచ్చును. కాన కవిసార్వభౌమబిరుదముకూడ నాధారపఱచి కల్లుప్రతిష్ఠకర్తయు నాంధ్రనైషధకర్తయు నొక్కరే యని సమర్థించుటకూడఁ దగదు.

కల్లుప్రతిష్ఠగ్రంథావతరణిక ద్విపదపంక్తులను పరిశీలింపఁగా "శివభక్తిపరుఁడ అనుదానివలెనే" "కవిసార్వభౌముఁడు, ఘనత కన్నట్టి, శ్రీనాథుడనువాఁడు అనుపాఠముకూడ ప్రక్షిప్తమని తోఁచుచున్నది. ఏలన తద్భాగాంతమున "ఘనుఁడైన శ్రీనాథకవిరాజరాజు" అనియున్నది. రాజరాజు శబ్దముసార్వభౌమపదమునకు పర్యాయపదమైనను, నది బిరుదవాచకమగుటచే సంజ్ఞావాచకము. కాన దానికి పర్యాయపదము వాడరాదు. పద్యములో సార్వభౌమపదమును కూర్పలేక దానిపర్యాయపదమును వాడెననుట యాంధ్రనైషధకర్తవంటివానికిఁ దగునా. కాన వాపీఠికకర్తయగు కల్లుప్రతిష్ఠకర్తయు నాంధ్రనైషధకర్తయు నొకరుకాఁజాలరు, కాన నీపదము లెవరో లేఖకులు భ్రాంతిచే చేర్చియుందురిద్దఱు శ్రీనాథులు నొకరే యనుశలంపుతో శ్రీహర్షునకుఁ జెల్లువిశేషములను శ్రీనాథునకుఁ జెల్లించి, భ్రాంతిఁజెందిన ఏనుగు లక్ష్మణకవి రామేశ్వరమాహాత్మ్య, జాహ్నవీమాహాత్మ్యములలో నెట్లు స్తుతించెనో చూడుడు. గీ॥ మహిత చింతామణీ దివ్యమంత్రసిద్ధ, నైషధాది ప్రబంధసందర్భనిపుణు, సకలవిద్యావిశారదు సత్కవిత్వ, పట్టభద్రు శ్రీనాథునిఁ బ్రస్తుతింతు" అని. వేదము వేంకటరాయశాస్త్రిగారి వంటివారుగూడ సంస్కృతనైషధవ్యాఖ్యాతయగుశ్రీనాథుఁడుశృంగారనైషధకారడేమో యని భ్రాంతిపడి యిట్లు వ్రాసిరి, "కడమవ్యాఖ్యాతలలో శ్రీనాథుఁడొకఁడని పేర్కొనఁబడియున్నాఁడు. ఆశ్రీనాథుఁడు శృంగారనైషధకారుఁడేయేమో? ఈతఁడే యనుటకు ఈ యాంధ్రీకరణాభిమానము కొంతసాధకము. కాని యితనిగ్రంథములఁ జెప్పుచో నితఁడుగాని, యితరులుగాని యీవ్యాఖ్యానముం బేర్కొనమి కొంత బోధకము" అని. అట్లే పల్నాటివీరచరిత్ర విషముకూడ.

(10) కల్లుప్రతిష్ఠావతరణికలో.

" విలసిల్లు పలనాటివీరులచరిత, జనులెల్ల భక్తిచే చదువుటకొఱకు
మంజరీద్విపదగా మన్నించి నేను, చెప్పఁబూనితి వచఃశ్రీ మెఱయంగ',

అని వ్రాయఁబడినది. దీనినిబట్టి యక్కిరాజు ఉమాకాంతము గారు తమ ప్రథమముద్రణభూమిక 74 వ పుటలో శ్రీనాథుపయోగించినదిమంజరీద్విపద......... ...శ్రీనాథునికిఁ బూర్వము మంజరీ కావ్యము రచించినవా రెవరును లేరు. ఇతఁడు వ్రాసినగ్రంథములలో నిది చివరది.'' అనివ్రాసిరి. కాని వేటూరిప్రభాకరశాస్త్రిగారు తమ శృంగారశ్రీనాథము 241 వ పుటలో "శ్రీనాథుఁడు రచించినపల్నాటి వీరచరిత్రము ద్విపదరూపమయియుండవచ్చునని నాతలంపు. క్రీడాభిరామములో నీక్రిందిపద్య మున్నది.

మ॥ ద్రుతతాళంబున వీరగుంభితక ధుంధుంధుంకిటాత్కార సం
గతివాయించుచు నాంతరాళిక యతి గ్రామాభిరామంబుగా
యతిగూడన్ ద్విపదప్రబంధమున వీరానీకమం జాడె నొ
క్కతె ప్రత్యేకముగాఁ గుమారకులు ఫీట్కారంబునం దూలఁగన్॥

ఇందు ద్విపదగ్రంథమే పేర్కొనఁబడినది. మఱియు నాక్రీడాభిరామమునఁ బల్నాటివీరచరిత్రవిషయము హెచ్చుగాఁ గలదు. ఆగ్రంథము శ్రీనాథకృతియే యగునని నేను నిశ్చయించుచున్నాను.''అనియు 244 వ పుటలో, " ద్విపదరూపమున మిక్కిలి సంగ్రహముగా నొక రచనము ప్రాచ్యలిఖితపుస్తకశాలలోనే కలదు. అది మంచిరచనము కలదై చక్కగా నున్నది. శ్రీనాథునిది కావచ్చునని నేను దలంచుచున్నాను. కాని యది సంపూర్ణముగా లేదు" అనివ్రాసి, మఱియు'' వీరచరిత్రమందలి యేకదేశమగు "బాలునికథ"ను శ్రీ యక్కిరాజు నుమాకాంతముగారు బృహత్పత్రికతో నీనడుమ ప్రకటించిరి.......... మంజరీరూపమున నున్నగ్రంథమును వారు ప్రకటించిరి. కాని వారి

ముద్రణమున నాకృతియాకృతి చెడినది. గ్రంథావతరణికలో రెండు తెలుఁగుల్లరచనములు కలసిపోయినవి......... ఈగ్రంథసంపాదకులు యథేచ్ఛముగా గ్రంథమును మార్చిరి. కొంత చేర్చిరి. ఆమార్పులో చేర్పులు నన్నియుఁ బిన్నగాఁ దెలుపరయిరి.” 243 వ పుటలో “ శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్రమును రచించెను కొన్నిభాగములు నిర్దుష్టరచనములు గలవి కలవు. అట్టివి శ్రీనాథునివిగా నిలువఁ గలవి” అని వ్రాసిరి. పరస్పరవిరుద్ధముగానున్నపై యిద్దరి వాక్యములలో నేవి గ్రహింపఁదగినవో విచారణీయము. వడిప్రాసపద్యగద్యాదులు రాది విష యములలో ప్రాచీనులమార్గమునే శ్రీనాథుఁ డావరించు నని శివరాత్రి మాహాత్మ్యములో నీట్లు తెల్పినాఁడు.

ఉ॥ పద్యగద్యాతురర ప్రకర భావరసార్థగుణా.........

.........శబ్దపదహేతుకలారసనత్రిక యాథ్యమై

యార్యులు చన్నమార్గమున నావడిప్రాసవిడంబబంధమై

చోద్యముగాఁగఁ జెప్పు కృతి శ్రోతృసుఖావహ మెల్లచోటులన్॥

I—11.

ఇందుచేప్రాసను విడనాడి, మంజరీద్విపదగా కావ్యమును వ్రాయు పద్ధతి తత్పూర్వములేదు. కాన శ్రీనాథుఁడానూతన మతము నంగీక రింపఁడని యూహింపనగును. కాన మంజరీద్విపదలో శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్రమును వ్రాసె ననుట విశ్వసింపఁదగినది కాదు. ప్రాస విహీనముగా మంజరీద్విపదలో వ్రాయుటలో ప్రయోజన మేమి? తేలి కగా రచనము సాగుననియా? విషయమిట్లుండఁగా, వి.పీ.కర్త. “శ్రీప్రభా కర శాస్త్రిగారు మద్రాసుప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునఁ గల వ్రాఁతప్రతులలో సాధ్యమైనంతవఱకు మేల్తరములని తోఁచినవానిని నాకు సూచింపగా ఆభాగములకు ప్రతులు వ్రాయించుకొంటిని” పుట XIII—XIV అనివ్రాయుట బహువిచిత్రముగానున్నది. శాస్త్రి

గారు శ్రీనాథకృతమని భావించినది ద్విపదరూపమునకదా యన్న దనిరి, వి.పి.కర్తపరిష్కరించినది మంజరిద్విపదరూపమున నేలయున్నది? అట్లే యగుచో శ్రీనాథునంతటివాని కీప్రాసపడినియమములు రచన కడ్డు పెట్టగలవా? మఱియు పాడుకొనుటకు ప్రాసగలద్విపదయే యెక్కువ శోభించును. ప్రాసగలచోట చక్కని లయ కుదురునుగదా. పాల్కురికి సోమనాథాదులు జనసామాన్యముపాడుకొనుటకేకదా ప్రాసద్విపదలో దనకావ్యములను రచించిరి ఈవిధముగా విచారించినను శ్రీనాథుఁడు మంజరీద్విపదలో పల్నాటివీరచరిత్రను వ్రాసియుండఁ డని భావింప వలసివచ్చుచున్నది. ఈద్విపద లక్షణములో, ప్రాసను తొలగించి, పదకర్తలు, రచన మఱికొంత సులువగునట్లుగా మంజరీద్విపదను సృష్టించిరి." వి. పీ. VI పుట. ఇఁక ప్రాసద్విపదలోనైన పల్నాటి వీరచరిత్రము నాంధ్రనైషధకర్త వ్రాసియుండగా,యని ప్రశ్న అతఁడే వ్రాసియున్నచో నభినామముతోనని పేర్కొనియుండడా ? అది వల్లభరాయని పేరునాటి నున్నప్పుడు సంకోచించుట కాక్షేపమే ముండును. అట్లు పేర్కొనఁబడకపోవుటచే ద్విపద పల్నాటివీరచరిత్రను గూడ నతఁడు వ్రాసియుండఁడనియు క్రీడాభిరామమునుబట్టియేమియు నిదమిత్థమని నిర్ణయింపరాదనియు వెనుకనే నిర్ణయింపఁబడినది. పోతే రొకవిషయముమాత్రము నిశ్చయముగాఁ జెప్పవచ్చును. వినుకొండ వల్లభరాయనికాలములో కొక పల్నాటివీరచరిత్ర ద్విపదప్రబంధముగా రచించినదిమాత్రముండెనని పై యుదాహృతపద్యమునుండి యూహింపవచ్చును. అది ప్రస్తుతముగానవచ్చు గ్రంథములలో నేదైన కావచ్చును, కాని యది యాంధ్రనైషధకర్త వ్రాసినది యైయుండదు. అది యాంధ్రనైషధకర్తకు పూర్వుడైన యొకకవిచే రచింపబడియుండవచ్చును. అతఁడు భారద్వాజగోత్రుఁడును శ్రీనాథనామధేయుఁడును గూడ కావచ్చును. ఇంతవఱకు నాక్షేప మేమియు నుండఁగూడదు.

అందుచే నా శ్రీనాథుఁడును వాంధ్రనైషధకర్తయగు శ్రీనాథుడు నొక్కరుమాత్రము గాఁజాలరు. తర్వాత లేఖకులో పాటగాండో భ్రాంతిచే నిద్దరు నొకరేయని భావించి ప్రసిద్ధ శ్రీనాథునకున్న కవి సార్వభౌమబిరుదమును విచక్షణ లేకుండ పల్నాటివీరచరిత్రలోని బాలోగికథా భాగమునకుఁ జేర్చియుందురు. దానివలన నీయవకతవకలు కలిగియుండును. కాన పైనుదాహరించిన క్రీడాభిరామ పద్యమునుబట్టి పల్నాటివీరచరిత్రమును వాంధ్రనైషధకర్త రచించెననికాని,యదిప్రస్తుతము ప్రచురింపఁబడినదే యనికాని విశ్వసించుటకు తగిన ప్రమాణము కనఁబడదు.

(11)ఇఁక ఆంధ్రనైషధకర్తయే కల్లుప్రతిష్ఠకర్త యని వాదించు వారి యుపపత్తిలోనియాచిత్యమును విచారింతము.

(i)" అతఁడు (కల్లుప్రతిష్ఠకర్త)భగవద్గీతోపనిషత్తులను నిత్య పారాయనచేసి, ముఖ్యము చేసికొనిన నిష్ఠాపరుఁడు. తలంచుకొన్నచో అగీతలను చక్కని సరసమైనశైలిలో తెనిగింపఁగల సమర్థుడుకూడ" (అని ప్రత్యక్షముగా తానుచూచినట్లుగా, వి. పి. కర్త (వ్రాత)

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య, మామేకంశరణంవ్రజ
అహంత్వాం సర్వపాపేభ్యో, మోక్షయిష్యామి మాశుచః,

అని శ్రీకృష్ణుఁ డర్జునునకు చేసిన చరమోపదేశశ్లోకమును ఈ కవి ఎంతసరసముగా తెనిగించెనో చూడుఁడు.

ద్వి॥ సకలధర్మంబులు నమ్మతి విడిచి, నాశరణందితే నను జేర్చుకొందు
నగవకు మదిలోన వద్దు భయంబు, సత్యమిామాట"॥

అని యుదాహరింపఁబడినది. ఈవాదము కేవల మతిశయోక్తితోఁ గూడినది. భగవద్గీతనంతయు నాంధ్రీకరించిన యొక శ్రేష్ఠిగారు పై శ్లోకము నెంత శ్రేష్ఠముగా తెనిగించిరో చూడుఁడు.

సీ॥ సర్వధర్మములను సంపూర్ణముగ వీడి
నన్నుమాత్రె మీవు నమ్మికొనుము;
నిన్ను నేను పాపనిచయంబులోనుండి,
ముక్తుఁజేతు; దుఃఖమును త్యజింపు,"

ఈ రెంటి యాంధ్రీకరణములవ్యత్యాసమును కొంచెము విచారింతము. "అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి" అను భాగ మీశ్లోకమున కాయువుపట్టు. దానిని కల్లుప్రతిష్ఠకర్త" నను జేర్చికొందు అని స్వేచ్ఛగా భావము ననువదింపగ శ్రేష్ఠిగారు" నిన్ను నేను పాప నిచయంబులోనుండి ముక్తుఁజేతు "అని యథామూలముగ నాంధ్రీకరించినారు. అదియుఁగాక పాపములనుండి మోక్షమును పొందుటయుఁ దన్నుఁ జేర్చుకొనుటయు నొకటి కాదుకద. 'పరిత్యజ్య' అను మూలమునకుఁ 'విడిచి' అని యాంధ్రీకరించినఁజాలు. ఇక 'సమ్మతి' అనునది పడికట్టురాయియే. మా శ్రేష్ఠిగారు "సంపూర్ణముగ వీడి" అని యనువదించి 'త్యజ్య'-'పరిత్యజ్య' లకుఁగల తారతమ్యమును పోషించినారు. "మామేకం శరణం వ్రజ" అనుమూలమును కల్లుప్రతిష్ఠకర్త "నా శరణందితే" యని యనువదింపఁ శ్రేష్ఠిగారు "నన్నుమాత్రిమీవు నమ్మికొనుము" అని యాంధ్రీకరించినారు. 'మామేకం' అను భాగమునకు "నన్ను మాత్రిము' అని నిర్దేశించినారు. "శరణం వ్రజ" యనునది మూలములో నాజ్ఞావాచకము (imperative) కాఁగా; 'నా శరణందితే' అను రచన చేదర్థకము (Conditional) లో నున్నది శ్రేష్ఠిగారి యాంధ్రీకరణము కూడ మూలానుగుణముగ ఆదేశార్థమందే కలదు. ఇక 'శరణందితే' అనురూప మాంధ్రభాషలో నెట్టివ్యావహారిక భాషారూపమో పరిశీలింపఁదగినది. "మాశుచః" అను మూలమును "వగవకు మదిలో అని కల్లుప్రతిష్ఠకర్త యనువాదము కాఁగా, శ్రేష్ఠిగారు "దుఃఖమును త్యజింపు" మని తెనిగించిరి. ఇందుచే కల్లుప్రతిష్ఠకర్తలరచనలోని

"మదిలోన" అను భాగమే కాక మిగిలినభాగమైన "వర్ధభయము, సత్య మీమాట" అనువాక్యములు వ్యర్థములున వచనములు పాదపూరణార్థములు కూడ. దీనిని అట్టి కల్లుప్రతిష్ఠకర్త రచనమెంత మూలానుసరణముగను, సరసముగను, మూలార్థవాహకముగనున్నదో సరసులే గ్రహింపగలరు.

భగవద్గీతను వేముగంటిదత్తోజీపండితుడు, గోపీనాథకవి, మాధవకవి, నాదిండ్లగోపన మొదలైనవారు 16వ శతాబ్దమునుండి నాంధ్రీకరించిరి. నవీనులనేకులు శ్రీశాస్త్రిగారు మొదలైనవారుచేసిరి. కల్లుప్రతిష్ఠ రచయితకంటె శ్రీశాస్త్రిగారి యాంధ్రీకరణము మేలుగానుండెనని వెనుక గ్రహించితిమి. వారిరచనకుకంటె గోపీనాథకవ్యాదుల యనువాదము శ్రేష్ఠముగావచ్చును. అంతకంటెనుత్తమముగా శృంగారనైషధకర్త వ్రాయఁగలఁడనిమనమూహింపఁగలము కదా. అట్టిచో కల్లుప్రతిష్ఠకర్త చేసినపై భగవద్గీతాశ్లోకాంధ్రీకరణము 'ఎంతసరసముగా తెలిగించెనో చూడుడ'ని అనివ్రాసిన వి.పీ.కర్త వ్రాతలోని యౌచిత్యమెంతకలదు? దానినాధారముగాచేసికొని "అతఁడు (కల్లుప్రతిష్ఠకర్త) భగవద్గీతోపనిషత్తులను నిత్యపారాయణచేసి ముఖస్థముచేసికొన్న నిష్ఠాపరుండని తాను ప్రత్యక్షముగా చూచినట్లు, ప్రచారముచేయుటకు ప్రమాణమేమి. వానివిలువయెంత సత్యమెంత ప్రయోజనమెంత? ఇట్టిప్రచారములు విశ్వసింపనగునా? పై శ్లోకమునునింక" యదాయదాహిధర్మస్యగ్లానిర్భవతిభారత మొదలైనకొన్ని ముఖ్య భగవద్గీతా శ్లోకములు భారతీయుల రసనాగ్రములందు ఇటీవలవఱకునుండెడివి. అంతమాత్రముచే వారందఱను భగవద్గీతను నిత్యపారాయణచేసి ముఖస్థముచేసికొన్న నిష్ఠాపరులభావింపనక్కఱలేదు. పోనీ యిందువలన కల్లుప్రతిష్ఠకర్త నిష్ఠాపరుడై నంతమాత్రమున నతడును శృంగారనైషధకర్తయు నొక్కరేయని ఋజువు చేయదుకదా.

(ii) "తెలుగుకవులలో యుద్ధవర్ణనలు చేయుపట్టున, తిక్కన నన్నెచోడులు ఒకరికి ఒకరు అనుకర్తలుగా పొడగట్టుదురు. వారిద్దఱ కును శబ్దార్థభావసన్నిహిత సంబంధమెక్కువ. అనగా యుద్ధములను వర్ణించునెడ ఇరువురికవిత్వమున పోలికలు సాధారణము. శత్రువులను సంహరించుట 'వండతరిగినట్లున్నద'ని వర్ణించుట, యిద్దఱకును చాల ప్రీతి. ఈకవియును దానిని అట్లే ఉపమించెను. ఈతని యుద్ధవర్ణనలను, అందలిపలుకుబడులను పరిశీలించుచో ఇతడు భారతమును కూలంకష ముగా పఠించి, యందలిసొగసులను పుణికిపుచ్చుకొన్న గదుసరివలె తోఁచును. తిక్కన తనభారతమున పెక్కుచోట్ల యుద్ధరంగమున ప్రవహించురక్తమును నదీ ప్రవాహముగా రూపించి వర్ణించెను. ఈరూ పకాలంకారము సర్వప్రాచీన సాధారణము...ఉదా॥ కరికళేబర

(ద్రోణ II.128.

ఈ కవియును బాలచంద్రునియుద్ధమున కార్యమపూడి యుద్ధ క్షేత్రమును ఇట్లే ఉపమించుట అతని ప్రాచీన కావ్యపరిజ్ఞానమును ప్రస్ఫుటీకరించును." అని వి. పీ. 40-41పుటలలో వ్రాయఁబడెను.

(ఉదా పుట 470-71. . . 40:3

ప్రాచీనకాలమందలి శబ్దములను, పలుకుబడులను, వర్ణనలను రూపకాద్యలంకారాదుల నన్నింటిని నర్వాచీనులనుకరించుటయు వారినిబట్టి తిరిగి నవీనులావిషయముల పారంపర్యముఁగా ననుకరించుట సర్వసామాన్యవిషయము. అట్లు పారంపర్యముగా ననుసరింపకపోయి నచో, ప్రాచీనుల కవితాసంప్రదాయములు వీనులకు క్రొత్తగానుం యర్థమే కాకయుండును. యుద్ధమందలి రక్తప్రవాహముల నదీప్రవా హముగా రూపించుట నవీనార్వాచీనుల కవితలలోఁగూడఁ గానవగును అంతమాత్రమున బాలచంద్రయుద్ధకర్తశృంగారనైషధకర్తయే యని యూహింపఁదగదు.

అతనికి ప్రాచీన కావ్యజ్ఞానము పరిస్ఫుటముగానుండినను నతఁడును శృంగారనైషధకర్తయు నొక్కరే యని యెట్లునిర్ణయింపనగును? ప్రాచీనకావ్యజ్ఞానముకల కవులెందఱుండరు ? సాధారణముగకవులు ప్రాచీనకావ్యజ్ఞానమైనను లేక కావ్యములురచించుటయెట్లు పొసఁగును. శృంగార నైషధకర్త వ్యుత్పత్తిసాధారణ ప్రాచీన కావ్యజ్ఞానముతోఁ గూడినదిమాత్రమే కాదు. తర్కవ్యాకరణ వేదవేదాంతాది శాస్త్రము లందలి పరిపూర్ణపరిజ్ఞానముగలవాఁడుకదా?యతఁడు. అతని ప్రతిభయు నిరుపమానమైనది. కాన సామాన్యమైన ప్రాచీనకావ్యజ్ఞానమునుబట్టి యిర్వురు నొక్కరేయని నిర్ణయింపరాదు. మఱియు బాలచంద్రుని యుద్ధములో నన్నెచోడ తిక్కనలయుద్ధవర్ణనావిధానమును, శబ్దములు, పలుకుబడియుండవచ్చును, కాని శ్రీనాథుని యుద్ధవర్ణనా విధము, శబ్దములు, పలుకుబడులతోనవి యెక్కువ భేదించును. శృంగారనైషధకర్త నాట్యకళనుకవిత్వకళగామార్చి నాట్యకళాప్రదర్శనమును వర్ణించు స్వభావముగలవాఁడని వెనుకగమనించితిరి. అట్లే యతఁడు కవిగా యుద్ధవర్ణనలనుచేయుపట్ల, యుద్ధకళను కవిత్వకళగామార్చి వర్ణించు స్వభావముగలవాఁడే కాని, నన్నెచోడ తిక్కనలవలె యుద్ధమును యోధులవలె, యథాతథముగ కనులకుగట్టినట్లుగా వర్ణించుస్వభావము గలవాఁడుకాఁడు. ఉదాహరణమునకు, హరవిలాసమందలి కిరాతార్జునీయకథలో మాయాకిరాతార్జునుల యుద్ధమును గాని కాశీఖండ మష్టాశ్వాసమందలి దుర్గామాహాత్మ్యమున దుర్గాసురునితో దాక్షాయణియుద్ధవర్ణనముగాని, భీమఖండమందు త్రిపురాసురులతో నీశ్వరుఁడుచేయు యుద్ధవర్ణనముగాని బాలచంద్రుని యుద్ధరచయిత యుద్ధవర్ణనలతోఁబోల్చిచూడఁదగును. అట్లేరాయబారవిషయములు గూడ పోల్చి చూడఁదగినవి.

(iii) (కల్లుపత్రికర్త) "పూర్వకావ్యపరిజ్ఞానమున్న కవిమా
త్రిమే కాక, సంస్కృతవ్యాకరణ మర్యాద నాకళించుకొనిన పండితుడని
యతనిసమాసరచనాపద్ధతి నిరూపించుచున్నది.

"పూర్వపర్వతశిరః పూజాగ్రిమండు, ఘనతరమాణిక్యఖచితసౌవర్ణ
కుంభంబువలెనిల్చి గురుతేజమునను, భానుండు దిక్కుల ప్రబల
నావేళ."

సూర్యోదయవర్ణన సర్వకవిసామాన్యమయ్యును, ఇవి కవిసమ
యములు దెలిసిన కవిమాత్రిమే వ్రాయదగినపంక్తులనుటకు సందే
హములేదు. ఇందలి దీర్ఘసమాసరచన అపండితుఁడు చేయవలసినది
కాదు. అట్టే పగలును రేలును బహుజాగ్రిదాత్మ కాపాడుడీ మీరెకల
వారుమాకు" అనెడి పంక్తులందలి 'జాగ్రిదాత్మ' అనుసమాసమును
సంస్కృతవ్యాకరణ సంప్రదాయమెఱిగిన పండితుడు మాత్రిమే
ఘటింపగలడు. "అని వి పీ. వ్రాసె" (పుట 42.)

ఆంధ్రకవులలో సంస్కృతవ్యాకరణ మర్యాదలను, కవిసమయ
ములను నెఱిఁగిన పండితులనేకులర్వాచీనులలోఁగూడఁగలరు. వారు
దీర్ఘసమాసరచనచేయఁగల ప్రౌఢులు. అట్టివారందఱు శృంగారనైషధ
కర్తవంటివారలేయనుటయతివ్యాప్తిదోషమగును. ఈక్రింది దీర్ఘ
సమాసరచన చూడుఁడు.

"ప్రళయ కాలమహోగ్రభయదజీమూతోరుగళ ఘోరగంభీర
పెళపెళాభటులలో—ప్రబల నీరంధ్రాభజనితగాఢధ్వాంత నిబిడహే
మంతరాత్రికుంతలములలో— విశ్రుతకూరుఋక్షుధాతుభితమృత్యుకరాళ
వికట పాండురశుష్క-వదన దంష్ట్రాగ్నిలో—ప్రావృడంభోరస్వామి—
నైదాఘతీక్ష్ణభాను భీకరకరానలచ్ఛట—శీతలనిశాప్రశాంత శయ్యా
తలాన" ఈరచనమొకనవ్యభావ కవిది. దీనినిబట్టి యితఁడు సంస్కృత

వ్యాకరణ మర్యాద నెఱిఁగిన మహాపండితుఁడనవచ్చునా? "పాణివృడం భోధరస్వామి" అను సమాసము సంస్కృతవ్యాకరణసంప్రదాయ మెఱిగిన పండితుఁడుమాత్రి మేఘటింపగలఁడా? పై దీర్ఘసమాస రచనవలన నతఁడు మహాపండితుఁడని నిర్ణయింపఁగలమా? ఇది శ్రుతపాండిత్యము ననుకరణమనిమాత్రిమే చెప్పవలయును చాలఅరుదుగా సమాసముల వాడిన యంతమాత్రిమున కల్లుప్రతిష్ఠకర్తయు శృంగారనైషధకర్తయు నొక్కరుకాఁజాలరు. కల్లుప్రతిష్ఠకర్త, శృగారనైషధకర్తకంటెగూడ నెక్కువ గొప్పపండితుఁడని ఋజువైననుగూడ, నిద్దఱు నొక్కరేయని యెట్లు నిర్ణయింపవీలగును. ఇక్కడ కావలసినది పాండిత్యసామ్యము గాదు. వ్యక్తిసామ్యమును, కవిత్వసామ్యమును మాత్రమే. వీరిద్దఱకు రచనాసామ్యమును వారి పలుకుబడి, శబ్దము, సమాసములు మొదలైన వానితోఁ క్రీడాభిరామమందు ప్రభాకరశాస్త్రిగారు విశేషములను చూపినట్లు చూపవలెకాని, సామాన్యవిషయముతోఁబోల్చి ప్రయోజనము లేదు.

(iv) 'స్నానము'నకు 'త'కారముతోఁ యతిచెల్లించినంత మాత్రమున "వైదికమైన యీశబ్దస్వరూపము నెఱిఁగియున్నకవి, గొప్పపండితుఁడై యుండవలెననుట నిస్సందేహము" అనినిర్ణయించు టెట్లు? ఎన్ని వైదిక శబ్దములు లౌకికము గవాడఁబడినపుడు, వాని మూలవర్ణక్రమము శ్రుతపాండిత్యమువలనగ్రహించి ప్రయోగించుట లేదు? ఉభయభాషలలోఁ నెన్నివిశిష్టసంస్కృత శబ్దములను, నిత్యసమాసములను నన్నె కవిప్రయోగములను జూపలేదు? వానిని మరల ప్రయోగించిన నవ్యకవులందఱు గొప్పవేదపండితులని నిర్ణయింపవచ్చునా? అట్లే ప్రస్తుత విషయముకూడ.

(v) "శ్రీనాథుడు సంస్కృతకవులవలె, తఱచుగావిశేష్యవిశేషణము లనేకవిభక్తులలోనే నిల్పుచుండును. క్రీడాభిరామము శ్రీనాథ

కృతమేయని ఋజువుచేయుటకు ప్రభాకర శాస్త్రిగారు చెప్పిన తిరుగు లేని యుక్తులలో నీవిషయమును జేర్కొనియున్నారు.'' అని. వి.పీ. కర్మ వ్రాత, విశేష్యవిశేషణముల నేకవిభక్తిలో నిల్పుట యొక శ్రీనాథుడే కాదు. నన్నయపోతనాదుల నేకులు చేసిరి. చూ. ఆది VI, 62,63, 31,23,17,18,10, భాగవతము VII. 27,22,85 పద్యములు. మఱియు తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగము పుటలు 4, 5, 3, 13, 14 మొ. ఇందుచేతనే బాల్యకవారణములో చిన్నయ్యసూరి'' విశేష్యం బునకుంబోలె విశేషణంబునకు లింగవిభక్తి వచనంబులగు'' (కారక పరిచ్ఛేదము—19 వ సూ.) అని సాధారణ సూత్రము వ్రాయవలసి వచ్చినది. కాన "నిది శ్రీనాథకృతమేయని ఋజువుచేయుటకు తిరుగు లేనియుక్తి'' యేలనైనదో తెలియరాదు. ప్రభాకర శాస్త్రిగారి యుద్దేశము 'తరుచుగా' నని చెప్పుటలోనున్నది. కాని యదితిరుగులేని దనికాదు. ప్రభాకరశాస్త్రిగారి వాక్యములివి "శ్రీనాథుకు తరుచుగా విశేషణవిశేషములనే కవి భక్తిలో నిలుపుచుండును'' (చూ. క్రీడాభి రామ పీఠిక, పుటలో 13_14.) ఇందుచే వి.పీ. కర్తకు బాలవ్యాకరణ మెంత త్పుణ్ణముగా తెలియనో స్పష్టమగుచున్నది.

(vi) తెలుగుకవులొక వాక్యమును విశేష్యమునకు విశేషణము చేయవలసినపుడు, విశేషణవాక్యమును సమాపకక్రియతో పూర్తి చేసి, విశేష్యముతో పొందింతురు. కాని శ్రీనాథుకు అసమాపక క్రియ లతో, అనేక వాక్యములను మాలగాగ్రుచ్చి, అవిశేష్యమునకు అలం కరించుటకు ముచ్చట పడును'' (వి.పీ.పుట 50). ఇదికూడ పైదాని వలెనే సామాన్యవిషయమే కాని, శ్రీనాథుని ప్రత్యేకతగా పేర్కొన దగిన ప్రయోగవిశేషముకాదు. కాన పై కారణములబట్టి కల్లుప్రతిష్ఠ- బాలచంద్రయుద్ధ "కర్తయు శృంగారనైషధకర్తయు నొక్కరేయని ఋజువుచేయరాదు.''

(12) ఇవికాక వి.పీ లోని కొన్ని విపరీతములను పరామర్శించుట యీసందర్భమున తగును vi వ పుటలో "ఈద్విపద ఇంగ్లీషులో Couplet వంటిది. దీని పాదమునకు మూడు ఇంద్రగణములు నొక సూర్యగణముండును. నాల్గవగణముయొక్క ప్రథమాక్షరము యతిస్థానము" యథార్థమునకు మూడవగణముయొక్క ప్రథమాక్షరము యతిస్థానము. ఇదిపొరపాటని భావించినను vii వ పుటలో మరల, "ఈగ్రంథమున పాటింపబడిన ఛందస్సుమంజరీ ద్విపద. ఇందుపెక్కుచోట్ల మూడు ఇంద్రగణములు, ఒకసూర్యగణము, నాల్గవగణము యతిస్థానము అనెడి లక్షణముగూడ, ఉల్లంఘింపబడినది. యతిభ్రంశమునకు కారణము రచయితయో. లేక ప్రతివ్రాయసకాండ్రో చెప్పలేము." అని దీనికి తప్పొప్పులపట్టికకూడ లేదు. ఈలక్షణభ్రంశమునకు కారణమెవరుచెప్పుదురు? దీనితో వి.పీ కర్త ఛందశ్శాస్త్రప్రావీణ్యము గూడ పూర్తియైనది.

(ii) నిజమునకు, పల్నాటి కథాప్రాధాన్యము కోళ్లపోరుతోనే ప్రారంభమగును అంతకుముందు కథలో, సారస్యము తక్కువ. అందుచేతనే కాబోలు మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలో ఆకథాభాగమునకు చెందిన ప్రతులు లేవు. అసలు ఈగ్రంథమునకు, ప్రతులు వ్రాయించి, సేకరించిన, ఆంధ్రభాషోద్ధారకుడు, కీ. శే. బ్రౌనుదొరగారు కూడ కోళ్లపోట్లాటనుండియు గ్రంథమును సంగ్రహింపగల్గిరి.'' అని, వి. పీ. లోని వ్రాత (మాపుట xi) ఇది చాల సాహసమైన వాక్యము. అన్యత్రప్రచారము కూడ మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండారమున D 1640 నెంబరు గలది. పల్నాటివీరచరిత్ర ప్రతులలో ఆనుపూర్వితోనున్న గ్రంథమిదియొకటి. ఇందు పల్నాటి యుద్ధమున ప్రసక్తులగు నిరువాగుల వీరుల పూర్వజన్మవృత్తాంతములతో కథారంభముగలదు. ఇందుపల్నాటివీరచరిత్రము కథారంభమునుండి బాలుని

కథలో బాలుడు బొంగరాలాటాడి యింటికి వచ్చునందాకకలదు. ఇది ప్రాసద్విపదలోనున్నది. కథాంశములెల్ల నిందు సంగ్రహముగాగలవు. ఇదియితరమంజరి ద్విపదరచనములకంటెవేఱైనదియు,మేలైనది కూడ. దీనికి D 1153 నెం. రు కల ప్రతినకలు, అని అందు తెలుపఁబడినది. ఈప్రతి ఆంధ్రసాహిత్యపరిషత్ వారి ప్రతికిఁగాని, యున్నవ లక్ష్మీనారాయణగారి ప్రతికిఁగాని సన్నిహితముగానుండవచ్చును. ఏదియెట్లున్నను" "అనుగురాజు పల్నాటిసంపాదనము—పల్నాటిరాజ్య విభాగము" అనురెండుప్రకరణములలో ప్రాసద్విపద, మంజరీద్విపదలు రెండును కలిసిపోయి సంకరమైనవి. ఇందుచే నివియేక కవికృతములు కావని నిర్ణయింపవచ్చును. చూపుడు. ఇందలి కృత్యాదియంతియు ప్రాసద్విపదలోనున్నది. కథాప్రారంభమున మొదటి రెండు పంక్తులను ప్రాసద్విపద, మూడవపంక్తి మంజరి, 4-5 పంక్తులు మరల ప్రాసద్విపద, 6,7 పంక్తులు మంజరి, 8,9; 10-11;12-13;14-15; 16-17; మరల ప్రాసద్విపద. తర్వాత 8 పంక్తులు మంజరి, తర్వాత రెండేసిపంక్తులకు ప్రాసద్విపద, మరల కొన్నిపంక్తులు మంజరి. ఇట్లు మొదటి రెండు ప్రకరణములందంతటనున్నవి. ఇందుచే రెండువిధములైన రచనలు కలగలుపుగానున్నవని యంగీకరింపక తప్పదు. ఇందుచేతనే దీనికర్త నిర్ణయింపఁబడలేదు.

(iii) " తెలుగుకవులలో యుద్ధవర్ణనములు చేయుకట్టున, తిక్కన్న, నన్నెచోడులు ఒకరికి ఒకరు అను కర్తలుగాపాడగట్టుదురు" అని వి,పీ. 40 వ పుటలో వ్రాయబడినది. తిక్కన నన్నెచోడులలో నన్నెచోడుడు పూర్వుఁడు, తిక్కనతర్వాతవాడుకదా! కాన తర్వాత కవి పూర్వకవి కనుకర్త కానగునుగాని, యొకరికొకరను కర్తలు కాఁజాలరు దీనియర్థమేమని యూహింపవలెను?

(iv) శ్రీనాభిరామమును వ్రాసి, దానికి వినుకొండ వల్లభా
మాత్యుని పేరుపెట్టి యతనికితనకీర్తి నిధారవోసిన శ్రీనాథుఁడు ప్రత్యక్ష
ముగా మనకుఁగనబడుచుండగా, పల్నాటివీరచరిత్రమువంటి రసవద్గ్రం
థము నెవరోరచించి, దానికి శ్రీనాథుని పేరుపెట్టి తనకీర్తిని ధారవో
యుటలో నతనికిఁగల ప్రయోజనమేమని యాకాంక్షించిన వి.పీ. కర్త
వాక్యములలో నౌచిత్యమెట్టిది. శ్రీనాథునకుఁ సిద్ధించిన ప్రయోజ
నమే యతనికిఁగూడ గలుగదా?

XIII (13) కల్లుప్రతిష్ఠ-బాలచంద్రునియుద్ధములలో నుద్దండ
పాండిత్యప్రకర్షకు ప్రలోభపడి, ప్రక్రియాస్వరూపమును విస్మరించు
చేయు రచనలకంటెను ప్రక్రియాస్వరూపమును గుర్తించి, పాండిత్య
ప్రకర్షను ప్రక్కకునెట్టియౌచిత్య దృష్టిగల కవిత్వముగలదు కాన
నది శృంగారనైషధకర్తకర్తృకమేయని సమర్థింపఁబడినది. దీనిని కొం
చెము విచారింతము. ఇందలి యౌచిత్యానౌచిత్యములను బట్టియే
యది శృంగారనైషధకర్తచే రచింపబడినదో కాదో కూడ నిర్ణయించు
టకు ముఖ్యసాధనముకాఁగలదు.

(i) బాలచంద్రుని పాత్రపోషణమున 'బాలచంద్రునియుద్ధ'
కర్త కొంత యనౌచిత్యమునుచేసెనని గోచరించును. బాలుడయ్యును
బాలచంద్రుడు గొన్ని విషయములను బట్టి ధీరోదాత్తుడుగ
గోచరించును. కాని యతనియందు గొన్నినీచగుణములుగూడ పొడ
గట్టుచున్నవి. సుగుణోపేతుడైన యతడు చిరుతవయస్సులో, బొం
గరములాడుకొనువయస్సులో గొప్పధైర్యసాహస పౌరుషాదులుగల్గి
యుండుట ప్రశంసనీయము. బొంగరముతో దెబ్బతిని నీవైశ్యవనిత
తన్నుదూషింపఁగ, నామెను క్షమార్పణవేడుకొనుట యతని పశ్చాత్తా
పహృదయము, నౌదార్యమునుదెల్పును. కాని యంత చిరుతవయ
స్సులో తనభార్యయెడ విముఖుడై దుష్టవేశ్యాసంపర్కమును పొంది.

నట్లుగా కవిచిత్రించుటమాత్రి ముచితముగ లేదు. అదియతని యుదా
లక్షణమునకు గొప్పలోపము. చరిత్రలో నెట్లున్నను, అనౌచిత్యమున
పరిహరింతునని కంకణముగట్టుకొనిన శృంగారనైషధకర్త, తన యా
ధ్రీకరణమున మూలమందలి యనౌచిత్యములను గొంతవఱకు పరిహ
రింపఁదలచినాఁడుకదా! అట్లే బాలచంద్రుని యుద్ధకథలో వేశ్యావృ
త్తాంతమును పరిహరించియుండఁడా? అది యనౌచిత్యముకాదందురే,
చూకుఁడు అక్కిరాజు ఉమాకాంతముగారు తనద్వితీయముద్రి
భూమికలో నేమనివ్రాసిరో. వేశ్యామైత్రి ఆకాలములో న్యూనతక
హేతువుకాలేదు. అయినప్పటికి బాలచంద్రియుద్ధములోని వేశ్యాఘ
ట్టమంతా అప్రియుక్తముగా కనబడుతుంది. సత్యభామ శ్రీకృష్ణుని అన
సరించినట్లు, బాలచంద్రునితో నామె యుద్ధభూమికిపోయియుంటే యీ
ఘట్టముసంగతముగానుండేది. కానిఆమెఅట్లాపోక, వారిసంగతిశృంగారం
తోటే సమాప్తము కావడంవల్ల కృతికర్త దీనిని వదలివేయడమే ఉచి
తంగానుండేది". (పుట 61-62) దీనినిబట్టి వేశ్యావృత్తాంతము దీనిలో
నెంతయనౌచిత్యముగానున్నదో స్పష్టముకదా. శృంగారనైషధకర్తయే
దీనికర్తకూడనైనచో తప్పక వేశ్యావృత్తాంతము దీనినుండి తొలగిం
చెడివాఁడేయని నిర్ణయింపవచ్చును. కాన నీవిషయమునుబట్టికూడ దీని
కర్తయు నాంధ్రనైషధకర్తయు నొక్కరుగారని నిశ్చయముగాచెప్ప
నచ్చును.

(ii) సౌందర్యవతియు, సుగుణవతియు, యువతియునగు భార్యన
బాలచంద్రు డుపేక్షించుటకుఁదగిన కారణముకనఁబడదు. కలహాము
లున్నట్లు కనఁబడ వత్తవారితో అకారణముగ భార్యనుపేక్షించి
వేశ్యాలోలుఁడయ్యెననుట యతని శీలము కళంకము పాలుకాలేదా
ఉచితానుచితములు పాటింపక భార్యనుల్లఘించునట్లుచేయుట కవి
యనౌచిత్యమొనర్పుటయేకద. ఇదియనుచితపాత్రి చిత్రణము.

(iii) పోనీ, చారిత్రవిషయములను యథార్థముగ వర్ణింపఁ గోరి వేశ్యావృత్తాంతమును కృతికర్త దానినుండి తొలగింపలేదని వాదించినను, శృంగారనైషధకర్తయే 'బాలచంద్రుని యుద్ధము'నందలి వేశ్యావృత్తాంతమును వర్ణించియున్నచో ప్రస్తుతమున్న దానికంటె ననేకవిధముల మిన్నగ, శృంగారరసమున పాఠకుల నోలలాడించెడి వాఁడు. శృంగారనైషధకర్త శృంగార రసపోషణమున నెంత యుత్సాహపడి, యతివర్ణనలను జేయు స్వభావముగలవాఁడో ప్రత్యేకముగ చెప్పనక్కఱలేదు. కాశీఖండభీమఖండములందే జగన్మాతలైన పార్వతీ అన్నపూర్ణాదేవులను వర్ణించుపట్లగూడ నతిశృంగార భావములను వ్యక్తీకరించిన శృంగారనైషధకర్త, వేశ్యావృత్తాంతమును వర్ణించునపుడు మాంచాల బాలచంద్రులశృంగారమును పల్నాటివీరచరిత్రమందువలె తేలికగా పోనిచ్చువాఁడా? పోతనగారికి భక్తిపారవశ్యమెంత కలదో శృంగారనైషధకర్తకు శృంగారరసపారవశ్యమంత యధికము దీనినిబట్టికూడ పల్నాటివీరచరిత్రభాగమగు 'బాలచంద్రుని యుద్ధమును శృంగారనైషధకర్తరచించలేదని ఘంటాపథముగనొక్కి చెప్పవచ్చును. అట్టిరచనచేయుట శృంగారనైషధకర్త స్వభావమునకు విరుద్ధమున నౌచిత్యముగూడనగును. శృంగారనైషధకర్త యెట్టి శృంగార రసప్రియుఁడో యతని వాగ్రసికత్వమున నే తెలియును చూడుఁడీక్రింది భీమఖండోదాహరణపద్యములను (1) వ్యాసుడుకాశిని శపింపఁబోవు సమయమున నతనికిఁ బ్రత్యక్షమైనవృద్ధాన్నపూర్ణాదేవిని వర్ణించుచు "ఒక్కయింటి మచ్చుకంటి పంచాశద్వర్ష దేశీయపలిత సారంబైన వేణికాభారంబుగ్రైవశ, ముడుసలి చక్రవాకంబులతో నెక్కసక్కెంబాడు పీఁగుచన్నుల వ్రేఁగుదనంబునఁదనతనూవల్లిక జలదరింపు కంకణ ఝుంఝుణత్కారంబు డోరంబుగాఁగ్రక్కున గోపురద్వారంబు బోరు తలుపు వాయందట్టి, యందెల రవళితో డంగూడి మట్టియలమ్రోఁతత్రి

భువనంబులనురుజగొనందేరు గడుప మోలం జరణపల్లవంబుఁజూచి, యనంగధ్వజపటకళోరపాళీవచ్ఛాయా దాయాదంబులైన వెడద కన్నులు తలచుట్టును బలసిపారయ, కలమధుర వీణాక్వాణపాణింధమం బైన మెలుంగునెత్తి." భీమ ఖ. II-110. (2) త్రిపురసంహార సందర్భమున శివుఁడు త్రిపురాసురులపై బాణప్రయోగము చేయనెంచి, జ్యానినాదము చేయువట్టుననిట్లు వర్ణింపఁబడినది. చూడుఁడు.

కం॥ ముక్కంటిమేరు చాపం,
బెక్కిడి సారించెఁ బన్నగేంద్రగుణంబున్
మక్కువ హిమగిరికన్యక
క్రిక్కిఱిసిన కుచముల లముఁ గేలుందమ్మిన్॥ భీమఖ. IV-131.

(3) శివుఁడు దక్షారామమును ప్రవేశించు సందర్భమున నెట్లు వర్ణింపఁబడినదో చూడుఁడు.

తె॥ దాటెఁ బ్రాసాద దేహళి దర్పకారి
ధరణిధర రాజ పుత్రికై దండమొసఁగ
నమ్మహాదేవి కుచమండలమ్ము సోకి
యంగకంబులఁ బులకంబులంకురింప॥ భీమ III-43.

(4) సప్తమునులు శివుని స్తోత్రము చేయు సందర్భమునఁ గూడ శ్రీనాథుడు తన రసికత్వమును జూపక పోలేదు. చూడుఁడు.

సీ.గీ॥ అంబికాకుచ కుంభద్వయాంగ రాగఁ
పరిమళాసార వాసిత బాహుమధ్య!
దక్షిణాపథ కాశి కాంతేర్విహార !
గిరిశ! శ్రీభీమనాథ! రక్షింపుమమ్ము॥ భీమ. V - 159.

(5) ఇఁక వసంతర్తువర్ణనము చేయుపట్ల దాక్షారామవర్ణనవైఖరిని శ్రీనాథుడెట్లు తనశృంగార రసాభిమానమును జూపెనో తిలకింపుడు.
శా॥ వేమాఱుంగల శీతనూభవవధూవేణీ భరాతః పస్రూ

నా మోదగ్రహ యోధువుల్ పొలసె దత్తా రామ మధ్యంబునన్॥
భీమ V. 95

సంవర్ణ్యసందర్భములనుగూడ లెక్క-చేయక తనశృంగార రసాభిమానమును జూపగ శృంగారనైషధకర్త, మాంచాలా బాలచంద్రులంతఃపురంబున క్రీడించిన విధానము నెంత నిగ్రహముతో వర్ణించెనో తక్క-ర్త తిలకింపుఁడు.

"తరువాత మాంచాల తన భర్తయైన, బాలచంద్రునితోఁడ భాదముప్పొంగ మేడమీఁదికిఁబోయి మేలైనయట్టి,చిత్తరువులఁజూపుచు చిలుకలచదువు వినిపించి, శృంగారవిపినంబుజూపి, పెద్దలు తనమీద ప్రియమువీఁరంగ ప్రొద్దుపోవుటకు నైపొందించినట్టి, భర్మపాంచాలికా వ్రాతముజూపి యందులో నొకబొమ్మవాడంగఁజేసె; అంతకాతఁడు కరమానందమొందె, అటుమీద నిద్దరు నధిక మోహమున, చిత్తరువ్వ మేడకుఁజేర బాలుండు హంసతూలికపాన్పునందుకుండె, ప్రియురాలు ముత్యాలపీటపైనుండి తాంబూలమిచ్చుచు తనమదిలోన, బాలునిభావంబు బాగుగనెరిగి ఆయత్తపడీవత్తునని మొక్కి- లేచి, జననియొద్దకుఁబోయి జలకంబులాడి" పంక్తులు-3370-3390.

పై వర్ణనమును శృంగారనైషధమందలి నలదమయంతుల యంతఃపుర విహారముతోఁబోల్చిచూచినచో పై మాంచాలా బాలచంద్రుల విహారవర్ణనము శృంగారనైషదకర్త రచనాతత్వమునకు విరోధమైనదని యెవరికేని తేలికగా గోచరింపకలదు.. ఇందుచే పల్నాటివీర చరితమును, శృంగారనైషధకర్త యెంతమాత్రము రచించి యుండడని నిశ్చయింపవచ్చును.

(iii) అలరాజును ద్రోహముచేసి చంపిన నరసింగరాజును యుద్ధములో తలనఱికి పగతీర్చుకొందునని ప్రతినపట్టిన బాలచంద్రు నాశీర్వదించి, రని ధర్మములుపదేశించి బ్రహ్మనాయుడు పంపగా

నతఁడు, యుద్ధభూమి కేగి భ్రాంతిచే వేరొక శిరస్సునునరికి తండ్రికర్పించెను. అంతబాలచంద్రుడు తనపొరపాటును తెలిసికొని మరల యుద్ధమున కేగి నరసింగుని తలదునిమి,

" అలరాజుఁజంపిన ఆపగదీర్చి..............కత్తితో తలగోసి కరములపట్టి. ఒకచేతఁబ్రేవులనొయ్యనెత్తి......తన తండ్రి తావులకు తలగొనిపోయె''...అంతబ్రహ్మనాయుడు, విచారముతో నాతనికృత్యమును మందలించుచు, "నాయుడాతని కూర్మికనందను జూచి, రమ్మని నినుపిల్వ రాజంపలేదు, వచ్చియూరకయున్న వాడవు కావు, చూరకొంటివో సేన తారుడువగుచు, చెల్లెపోసివిట్లు చేసిన క్రమము, విభువకుసేవకు విధివైతికద.'' అని తిరస్కరింపగా, బాలచంద్రుడు తండ్రినిట్లుదూషించును.

" అనిపల్కవిని బాలుడతుల రౌద్రమున
పలికెనందరు వినబ్రహ్మన్నతోడ,
వెడవెడ యేడ్పులువేగ చాలింపు
కొలువులో మామామకొమ్మ భూపతికి
అలరాజు పగకయి నప్పగించితివి,
నీస్వభావంబింక నేవివరింతు.
పోగొట్టితివి కోడిపోరువ భూమి;
నిను నమ్మివచ్చిన నేమేనమరిది,
ప్రాణంబు కొన్నట్టి పాపాత్ముడవు;
చెలువు చూడగ కంచి చెవులరాయనను
చండకమ్ముడవయి చంపించితివు;
ఘనులెంకజోదును కలనికిబంపి
మందలోఁ జంపితి మాయయొనర్చి;
యిటువంటి నీచేష్టలెన్నివర్ణింతు''
"అనిన మాటలు బ్రహ్మ కలుగులై తోఁచి''

ఇట్లు బాలచంద్రుడు తండ్రినిదూషించుటయెంత సరసముగ నున్నది? ఇది యతని శీలమున లోపముగ లేదా! ఇట్లు పాత్రపోషణము చేయుట యౌచిత్యముతో గూడియున్నదా? శృంగార నైషధకర్తయే పల్నాటివీరచరిత్రకర్తయైనచో నిట్టి యనౌచిత్యములనుచేయడు. కావున తత్కర్తలొక్కరు కాజాలరు. శృంగార నైషధకర్తయగు శ్రీనాథుని కవిత్వభాషాశైలు అను నతని స్వభావ తత్త్వమునుపూర్తిగ గ్రహించిన వారెవరును పల్నాటివీరచరిత్ర మతనికృతియని యంగీకరింపలేరు.

XII (14) పైయుపపత్తులనుబట్టి శృంగారనైషధకర్తయగు శ్రీనాథుడు పల్నాటివీరచరిత్రకర్త గాడని స్పష్టపడినదికదా. ఈదృష్టితో నితర స్వల్పకారణములను గూడ పరిశీలించి సంతృప్తి పడుప వలసియున్నది.

(i) శ్రీనాథుడు పదకవిత్వమును నిరసించుచు చెప్పిన చాటు పద్యమగు

కం॥ ముదివిటులు విధవలంజలు, పదకవితలు మారుబాస బాపనివారల్
చదువని పండితవర్యులు, కదనార్భటి వీరవరులు కడిదిపురమునన్.॥

అను పద్యము శ్రీనాథునిదేయని జనశ్రుతి. చాటు పద్యములకు సామాన్యముగ నింతకంటె ప్రమాణముండదు. కాని పల్నాటివీరచరిత్ర ద్విపద కావ్యమే కాని పదకవిత్వముకాదనియు, నది మాత్రాగణచ్ఛందస్సంబంధియనియు, పాల్కురికి సోమనాథాదులు పేర్కొనిన తుమ్మెదపదములు వెన్నెలపదములు మొదలైనవి మాత్రమే పదకవిత్వమునకు జేరుననియు, ద్విపద కావ్యమసలు మాత్రాచ్ఛంద స్సంబంధియైనను, శ్రీనాథునికాలమునకు ముందే గణచ్ఛందస్సంబంధియైనదనియు, ద్విపదలోనిపద శబ్దమునకు అర్థము పాదముకాని, పదము కాదు అనియు రెండుపాదముల నాలుగుగణముల ద్విపదలు విడిగా పద కవిత్వముకావచ్చును కాని, ద్విపదకావ్యము పద కవిత్వము కాం

దలు వ్రాసిరి. కాని వి.పీ. కర్త పల్నాటివీరచరిత్రపద కవిత్వమనియే సోపపత్తికముగ నిర్ణయించెను. కదా. అద్విపద కావ్యమునే పాటగా పాడిరని క్రీడాభిరామమునఁ దెలుపఁబడెనుకదా. కాన పల్నాటివీర చరిత్ర ద్విపదకావ్యము పద కవిత్వమనుటలో విప్రతిపత్తి యేమున్నది. అట్టి పదకవిత్వమును "గర్హించిన శ్రీనాథుడే పల్నాటివీరచరిత్ర ద్విపద కావ్యపదమును వ్రాసెననుట పరస్పరవిరుద్ధము, నాత్మవాక్య వ్యాఘాతముకాదా? కాన పదకవిత్వమును గర్హించిన శ్రీనాథుడు వేరు, పల్నాటివీరచరిత్ర ద్విపద కావ్యపదమును వ్రాసిన శ్రీనాథుడు వేరును నై యుండవలెను. పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్ర మను ద్విపదకావ్యమునకు, ద్విపదపంక్తులను పద్యములలో గూర్చిన శ్రీనాథుడు ప్రత్యేకద్విపదకావ్యమును వ్రాయుటయు సాధ్యము కాదు. శ్రీనాథుడు పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్ర ద్విపద పంక్తులల్లేదిద్ది తీర్చుటచేనతనికి ద్విపద రచనపైఁగల యభిమానమని కొందఱు వాదించిరి. కాని ద్విపదరూపముననున్న పండితారాధ్య చరిత్రను పద్యగద్యరూపముగా వ్రాయుటకు శ్రీనాథునకు ద్విపదరచనపైఁగల యసహ్యాభావమే యని యేల భావింపరాదు? ద్విపదరచనపై శ్రీనాథున కభిమానమే యుండినచో దానిరూపమును మార్చనేల? పాల్కురికి సోమనాథునిపై నసహ్యభావముచేతనా? కాదుగదా! పాల్కురికి సోమనాథుని భాషపైనను, ద్విపదరచనపైనను గౌరవభావము లేకయే దానిని గద్యపద్యములలో వ్రాసియుండునని స్పష్టముగా చెప్పవచ్చును. పాల్కురికి సోమనాథుని బసవపురాణమును గద్యపద్యములుగా వ్రాసిన పిడపర్తి సోమనాథాదుల విషయము వేరు. వారు వీరశైవమతాభిమానులై పాల్కురికి సోమన మీఁది గౌరవ ప్రపత్తులచే వ్రాసిరి. శ్రీనాథుఁడు వీరశైవుఁడుగాడు. పాల్కురికిసోమన భాషా వ్యాకరణపద్ధతులుగూడ నాతనికి నచ్చలేదు. అందుచేతనే యతని

నెక్కడును పూర్వకవులస్తుతులలో స్తుతించ లేదు. హరవిలాసమున సిరియాళ చరిత్రను ప్రథమున నేవ్రాయుట, పాల్కురికి సోమన యందు కాని, వీరశైవమ తమందు కాని, ద్విపదరచనయందుగాని కలయభిమానము చేత కాదు. కృతికర్త యగు తిప్పయ శెట్టిని సంతోష పెట్టుటకు. కాన శ్రీనాథునకు ద్విపదపై నభిమానమనియు, నందుచేత నే పల్నాటి వీరచరిత్రమును ద్విపదలో రచించెనని వాదించుట మాత్రము సమంజసము కాదు.

(ii) ఆంధ్రసాహిత్యపరిషత్తునవున్న పల్నాటివీరచరిత్ర ప్రాంభ పీఠికలోనే తత్కర్తయగు శ్రీనాథుకు భారద్వాజగోత్రుడనియి యోగివంశోద్భవుడైనట్లు నుత్తమపురుషలో తానే యిట్లు వ్రాసికొనినాడు.

(a) "సిరిగల్గు మాచర్ల చెన్నుని కృపను,
వరమున నియోగ్యాగివంశోద్భవుండ
భరద్వాజగోత్రమునఁ బరగినయట్టి,
భువియందు శ్రీనాథ పుణ్యుఁడన్వాడ
ప్రవిమలంబగ నొక్క పరిదినమందు."........
కలలోన చెన్నుడు గ్రక్కునవచ్చి,
వినుము శ్రీనాథుడ విశ్వంబునందు"

అని. ఇఁక అక్కిరాజు వారి ముద్రణమున బాలచంద్రుని యుద్ధభాగపీఠికలోగూడ నిట్లుత్తమపురుషలో నేయున్నది.

(b) "వలను భారద్వాజ వంశ వర్ధనుడ,
కవిసార్వభౌముడ ఘనత గన్నట్టి,
శ్రీనాథుడను వాడ శివభక్తిపరుడ"............
చేకొన్న మాచర్ల చెన్నకేశవుడు,
నాకలలోన వచ్చినయు మెప్పఁబలికె.
వినవోయి సత్కవివేడ్క నామాట" అనికలదు.

(c) ఇఁక విశాలాంధ్ర ప్రతియందు,

"వర భరద్వాజుని వంశానఁబుట్టి,
ధరణి శ్రీనాథుడన్ ధన్యుండు మహిమ
విలసిల్లు పలనాటి వీరచరితము,

సలలితమ్ముగ జనుల్ చదువుటకొఱకు,
సంజాతనవరస సంభృతి యొప్ప,
మంజరి ద్విపదగా మన్నించిచేసె."

అని ప్రాసద్విపదలోఁ జెప్పఁబడెను.

(d) మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండార మండలి D.1139 నెంబరుగల పల్నాటివీరచరిత్ర—బాలుని కథలో పీఠిక యందిట్లున్నది.

" భూమి శ్రీనాథుఁడు పుణ్యుడోయనఁగ.

వలను భరద్వాజ వంశవర్ధనుడు, పలుమారు చెన్నునిభక్తి ప్రార్థించి, పలనాటి వీరుల భాగవతంబు, లలిమీరగాఁ గుశలత్వంబు తోడ ననయంబుగాదననొగాకయనుచు, దెనుగునద్విపద గాఁ దెలిగొప్పఁజేసె.

అనిప్రాస ద్విపదలోను, చిట్ట చివర గ్రంథాంతమున,

"ఘనుడైన శ్రీనాథ కవిరాజరాజు,
చెన్నుని కృపచేతఁ జిత్తముప్పొంగి,
బాలుని వీక్రిను పొడిసంతయును
విరచించె జనులకు విదితంబుగాను."

అనియుఁ గలదు. ఈ చివరిభాగము అక్కిరాజువారి ప్రతిలో గూడ చివరనున్నది.

(౬) మఱియు, ప్రాచ్యలిఖిత పుస్తక భాండారమునసే యొక కానొకప్రతిలో కన్నమనేని యుద్ధాంత భాగమున నిట్లుత్తమ పురుషలో నున్నది.

“వలను భరద్వాజవంశవర్ధనుఁడ, మారయపుణ్యాభిమాంబకడుపునను,
స్థిరముగాఁగలిగిన తేజంబుఘనుడ, గారవంబైనట్టి ఘనుడశ్రీనాథు
చేపట్టివీనులచరితమంతయును,తగఁజెప్పె నాచంద్రతారార్కముగను.”

అనియున్నది. మల్లయరచించిన ‘కోళ్లపోరు, గాపుమరణము, కన్నమనేనియుద్ధమును కలిసియున్నవి. వీనిలో కన్నమనేని యుద్ధాంతమున పైరీతిగ నుత్తమపురుషలో, శ్రీనాథుకు రచించినట్లుగా నుండుట విచిత్రముగానున్నది. ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగార ప్రతిలో శ్రీనాథకృతమనియుండుట పొరపాటనియు, నదికూడ మల్లయ్యకృతంబై యుండునని సవరణసూచింపఁబడినది. అట్లేయగుచో నందలి యుత్తమ పురుషాంత పదములను ప్రథమపురుషాంతములుగా

“ వలను భరద్వాజ వంశవర్ధనుడు,
మారయపుణ్యాభిమాంబ కడుపునను
స్థిరముగాఁగలిగిన తేజంబుఘనుడు,
గారవంబైనట్టి ఘనుడు శ్రీనాథు
చేపట్టి వీనుల చరితమంతయును,
తగఁజెప్పె నాచంద్రతారార్కముగను”

అని మార్పవలసియుండును. దీనిని బట్టి శ్రీనాథుని సాయముతో తానురచించెనని యర్థమగుచున్నది. కనుక పీఠికలోని రచన

ప్రథమపురుషనుండి యుత్తమపురుషలోనికి, నుత్తమపురుషలోనుండి ప్రథమపురుషలోనికి తేలికగామార్చుటకు వీలుగానున్నది. కాన, లేఖకులుగాని సంపాదకులుగాని, పాటగాండ్రుగాని యెట్టిమార్పులనైన చేసియుందురేమోయను సంకోచమున కవకాశమిచ్చుచున్నవి. ఇందుచే, నేపాఠము యదార్థమైనదో నిర్ణయించుట కష్టమైనది. కనుకనే విశాలాంధ్రప్రతి పీఠికకర్త.

"శ్రీనాథుడన్ ధన్యుడ" అనుదానికి "శ్రీనాథుడను ధన్యుండు" అని తేలికగా వ్యాఖ్యానింపగలిగెను. కాన నీపాఠములలో నేది యదార్థమైనదో చెప్పుటయేకష్టము. మఱియు నాంధ్ర సాహిత్యపరిషత్తు ప్రతియు, అక్కిరాజు ఉమాకాంతముగారిపాఠము నుత్తమ పురుషలో మాత్రమే యుండినను, రెంకురచనలలో భిన్నముగా నుండుటచేత నీరెండింటిలో నేది శ్రీనాథకృతమో నిర్ణయించుటెట్లు? వీనిలో ప్రక్షిప్తములేవియో చేరియుండక తప్పదని మాత్రము చెప్పకతప్పదు. పైవానిలోఁ గొన్నింటిలోఁ గొన్ని పాదములు యథాతథముగా సమానముగానున్నవి. కొన్ని కొలఁదిమార్పులతో సమానమగుచున్నవి. సాహిత్యపరిషత్తు ప్రతిలో "మంజరీ ద్విపదలో" వ్రాయుదునని చెప్పఁబడినను, రచన మాత్రము ప్రాసద్విపదలోనే సాగినది. ఒక్క అక్కిరాజు వారి పాఠమునందు తప్ప "కవిసార్వభౌమ" బిరుదపద మితర పీఠికలలోఁగానరాదు. విశాలాంధ్రప్రతిలో ప్రారంభ పీఠికయందు శ్రీనాథుని పేరొకనిన కర్తనామము తెలియకపోవుట మఱియు విచిత్రముగానున్నవి. ఈయవకతవకలవలన శృంగార నైషధకర్తయే పల్నాటివీరచరిత్ర కర్తయని యెంతమాత్రము నిశ్చయముగా చెప్పలేము.

అయితే యీపల్నాటివీరచరిత్రకర్తయగు శ్రీనాథుఁడెక్కడి వాఁడని విచారణ. కాటమరాజుకథను ద్విపదగా రచించిన పినయల్లన యనుకవి తనకుఁబూర్వమే శ్రీనాథుఁడను కవివ్రాసిన కాటమరాజు చరిత్ర ననుసరించి, తాను ద్విపదగా వ్రాయుచున్నానని యాగ్రంథమున నిట్లు చెప్పుకొనినాఁడు.

ద్వి॥ గురుతైన కొమనాల గోత్రాబ్ధి చంద్రుఁ
డరయంగ గంగులమల్లయకూర్మి
తనయుండు సర్వన తగుసహోదరుఁడు.
పినయల్లయనువాఁడు ప్రియముతో జనుల
వలనొప్ప శ్రీనాథువచనపద్ధతిని
సలిపెను యదుశాస్త్ర చరితమంతయును
వినిపింతు యాదవవీరులచరిత?

ఈగ్రంథమును వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరింపఁగా వారు గతించిన తర్వాత, మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయము వారు మల్లంపల్లి సోమశేఖరశర్మగారి తోడ్పాటుతో ప్రచురించిరి. ఈకాటమరాజు కథనే చంపూరూపముగా రచించిన మఱియొక కవి కూడ, తనకుఁ బూర్వమే శ్రీనాథుఁడను కవి ద్విపదరూపమున దీనిని రచించెనని తన గ్రంథమున నీక్రిందిరీతిగ తెలుపుకొనినాఁడు.

సీ॥ ఒక శుభదినమున నొగి శుభమతి శౌరి
పూజావిధానంబు పొందుపఱచి
హరికథ వినివిని యారాత్రి నిద్రింప
శ్రీనివాసుండిట్లు చెప్పెఁగలను

శ్రీనాథుఁడను కవి శ్రేష్ఠుండు ద్విపదగా
రచియించెఁ గాటమరాజు చరిత
మదినీవు నా పేర సంకితముగఁ బద్య
గద్యాత్మకంబుగా ఘనతను నీవు

గీ॥ మని వచించి తిరోహితుఁడయ్యె నంత
నేను మేల్కాంచి యాస్వామి నెంచిమదిని
కాలకృత్యములను దీర్చి కఁదకులిర్చి
పండితాళిఁ గనుగొని భక్తి నెఱయ॥

దీనిని బట్టి "సంగీతసాహిత్య చాతుర్యకవిత, చెప్పి నేర్చిన వాఁడు శ్రీనాథనాముఁడు మఱియొకఁడు. గేయకవిత్వమును వ్రాయ నేర్చినవాఁడాంధ్ర కవిలోకమున నుండెననియు, వాఁడే ద్విపదలో కాటమరాజుకథను, పల్నాటివీరచరిత్రను వ్రాసెననియు విశ్వసింపవలయును ఈతఁడు యుద్ధాత్మక కథలను ద్విపదలుగా పాడుకొనుటకు వీలుగా వ్రాయు స్వభావముగలవాఁడనియు మనము గ్రహింపవలసియున్నది. పల్నాటి వీరయుద్ధము క్రీ.శ. 1178–82 సం॥ ల మధ్యకాలమున జరుగగా, సుమారొక వంద సం ల తర్వాత, కాటమరాజునకు మనుమ సిద్ధితో యుద్ధము జరిగియుండును. కావ ద్విపద కవియగు శ్రీనాథుఁడు క్రీ.శ. 1275. తర్వాత కాలము వాఁడైయుండును. ఈతఁడు రచించిన పల్నాటివీర ద్విపదగ్రంథమునే వల్లభరాయఁడు శ్రీడాభిరామమున పేర్కొనియుండును, వల్లభరాయఁడు క్రీ. శ 1450 ప్రాంతము వాఁడగుచో, ద్విపద కవియగు శ్రీనాథుడు క్రీ శ 1275–1450 మధ్యకాలములో జీవించియుండును. తరువాత కొంతకాలమున కిప్పుడు మనము కూడ భ్రాంతిపడినట్లే శ్రీనాథుడనఁగ సుప్రసిద్ధుఁడైన శృంగార నైషధ

కర్తయే యనుకొని కొందఱు లేఖకులో, పాటగాండ్రో శ్రీనాథునకుం గల కవిసార్వభౌమ బిరుదమును కవిరాజరాజనియు, నాతనిగోత్రమగు భారద్వాజగోత్రమును కలిపియుందురు. ఒకవేళ నీ శ్రీనాథుడుగూడ భారద్వాజ గోత్రజుఁడైనను కావచ్చును. అందుచే పాఠకుల భ్రాంతి యినుమడింపవచ్చును. ఇది నాదృఢవిశ్వాసము. అంతేకాని, శృంగార నైషధకర్తయు, పల్నాటివీరచరిత్ర కర్తయు నెప్పటికి నొక్కరు కాఁజాలరు.

శ్రీనాథుఁడు — పూర్వకవితా చర్వణము

శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి, ఎమ్. ఎ.

శ్రీనాథుఁడు సకలవిద్యాసనాథుఁడు. ఆతని కృతులలో ఆసకల విద్యల సౌరభమును అలవోకగా గుబాళించును. ఆ గుబాళింపు మొగము మొత్తునది కాదు, మనసు హత్తునది. అందు "పూర్వకవి ముఖ్యవిరచితా పూర్వకావ్య భావరస సుధాచర్వణ ప్రౌఢత" ఒకటి. అది సంస్కృతాంధ్రకవులకు సమామ్నాత పూర్వమే. ఆంధ్ర సాహిత్యమున "ఆదిని, శబ్దశాసన మహాకవి"యే అందుకు మార్గదర్శి.

"అశోకనిర్భర్త్సిత పద్మరాగ మాకృష్టహేమద్యుతి కర్ణికారమ్
ముక్తాకలాపీకృత సిన్దువారం వసన్త పుష్పాభరణం వహన్తీ,"

ఇది పరమేశ్వరుని తపోభంగమునకు ప్రాతిపదికగా పార్వతికి. కాళిదాసు సంతరించిన శృంగార నైపథ్యము. మఱి, పాండురాజు వ్రత భంగమునకు ప్రాతిపదికగా మాద్రికి, నన్నయ సంతరించిన శృంగార నైపథ్యమును ఇదే.

"చారు సువర్ణహాసి నవ చంపక భూషయు సిందువారము
క్తా రమణీయయున్ వకుళదామవతంసయునై యపూర్వ శృం
గార విలాసలీల మెసఁగం దన ముందటనున్న మాద్రి నం
భోరుహనేత్రఁ జూచి కురుపుంగవుఁడం గజరాగమత్తుఁడై."

నన్నయ అలంకరించిన చారుసువర్ణమును హసించు నవ చంపకములు, కాళిదాసు సృజించిన పద్మరాగములను ప్రతిఘటించు అశోక సుమములకు; సువర్ణకాంతిని చూఱగొన్న కర్ణికారములకు సయిదోడులు ముక్తాకలాపీకృత సిందువారమే సిందువారముక్తారమణీయము. ఇఁక వకుళదామవతంసము ఒకవసంతపుష్పాభరణమే కదా! కనుక నిది కాళిదాస కవితాచర్వణమున నన్నయ రసోద్గారము. ఒక్క నన్నయమాత్రమే కాదు, తిక్కనాది పూర్వాంధ్ర కవులందఱును పూర్వకవితా చర్వణ ప్రవీణులే అందు శ్రీనాథునికి అగ్రతాంబూలము.

విద్వదౌషధమును సేవించునెడ. శ్రీనాథుఁడు చర్వణ మొనర్చిన రసగుళికలు వేఱు. శ్రీహర్షుని నైషధీయచరితమున నలునికి పట్టువడిన హంస ఒనరించిన పరిదేవనము ఒకకరుణరస నిర్భరమైన కవితాఘట్టము ఆశ్లోకములను శ్రీనాథుఁడు అట్లే తెనిఁగింపలేదు. ఎంతో స్వతంత్రత ప్రకటించెను. స్వీయకవితను చిలికెను. కరుణారసపోషణమున పరాకాష్ఠ నందెను. అంతేకాదు - కరుణరసమనఁగానే "ఏకోరసః కరుణ ఏవ" అని కంఠమెత్తి ఉద్ఘాటించు భవభూతి ఉత్తరరామచరిత్రకు కవితా వందనము కావించెను.

అనిర్భిన్నో గభీరత్వాదన్తర్గూఢ గురువ్యథః
పుటపాక ప్రతీకాశో రామస్య కరుణోరసః"

ఇది సీతావియోగమువలని శ్రీరాముని శోకము మురళిచే భవభూతి పలికించిన శ్లోకము దీనిని శ్రీనాథుఁడు సఖులవియోగమువలని హంసశోకమునకు అందిపుచ్చుకొన్నాఁడు.

"సఖులార! యేప్రకారంబునంబుటపాక ప్రతీకాశంబైన కరుణ రసంబునఁ బురపురం బొక్కెదరు?"

ఇది వచనము కాదు. శ్రీనాథునిరచనము ఇందు శ్లోకపూర్వభాగమునకు అర్థానుసరణము, ఉత్తరభాగమునకు శబ్దానుసరణము కలదు. పూర్వభాగమునందలి శబ్దమునందలి అట్లే అనుసరించిన శక్తిమంతముగ ఉండదు. ఉత్తరభాగమునందలి శబ్దములను అట్లే అనుసరింపకున్న శక్తిమంతముగ ఉండదు. "గభీరత్వమున అంతర్గూఢమైన గురువ్యథ" అనుటవలనకంటె "పురపురపొక్కుట" అనుటవలన ఆభావము ప్రస్ఫుటమగుచున్నది. "పుటపాక ప్రతీకాశంబైన కరుణరసంబు" అటులే అనవలసినది. శబ్దశక్తి అట్టిది. ఇది శ్రీనాథుని తెనుఁగుసేఁతలోని తేజోరేఖ ఈ శ్రీనాథునివాక్యము చెంత, ఇటీవలి నాటకానువాదములందలి పద్యములు దివిటీ ముందటి దివ్వెలు.

ఇంతకు శ్రీనాథుఁడు బ్రాహ్మీదత్తవర ప్రసాదుఁడుకదా! ఆ వాగీశ్వరి నైషధమున ఒకపాత్రి దమయంతి స్వయంవరమునకు దశదిశలనుండి రాజకుమారులువచ్చిరి. వారందఱివైభవములు స్వయంవరవధూటికి వర్ణింపఁగలవారెవ్వరు?-భీమరాజు విష్ణువునుస్తుతింపు. ఆవిష్ణువుపంపగాఁ అందుకు సరస్వతివచ్చినట్లు శ్రీహర్షుని నైషధీయ చరితమునకలదు. ఆసందర్భమున శ్రీహర్షుఁడుచేసిన సరస్వతీవర్ణన అద్భుతము. కాని అనర్ఘము కాలేదు అద్భుతమైన వాగ్దేవతావర్ణనము అనర్ఘమైన సరస్వతీస్తోత్రమగుటయే బ్రాహ్మీదత్త వరప్రసాదునికి అభిమతము. అస్తోత్రమునకును దేవభాషలో ఉన్నమహిమ దేశభాషలో వచ్చునది. కాదు. అందుకే శ్రీహర్షుని వర్ణనశ్లోకములను శ్రీనాథుఁడు స్తోత్రదండకముగ మలఁచెను. అంతేకాదు. సంస్కృత శ్లోకములను తెనిఁగించుటకు బదులు సంస్కృతభాషలోనేఆదండకము సంతరించెను. ఇదిగమనార్హమైనది. ఇందుకు మూలమునందలి ముందున్న విష్ణుస్తోత్రమును శ్రీనాథుఁడు విడిచిపెట్టెను. స్తోత్రముపై స్తోత్రమువ్రాసిన గంటము పందెములో గెలుచునేకాని, కావ్యబంధములో నిలువదుకదా! ఇఁకసరస్వతిని సంస్తుతించినచో, సరస్వతి స్వయముగనే సాక్షాత్కారము కానలెను. అదేస్తోత్రమహిమ. అంతేగాని విష్ణువుపంపుటకాదు. అందుకు మూలమునందలి విష్ణుస్తుతిని శ్రీనాథుఁడు విడిచిపెట్టెను. ఇందుకు హేతువు, ముదిరిన వీరశైవము కాదు. కుదిరిన బ్రాహ్మీదత్త వరప్రసాదమే అంతేకాదు అది శ్రీనాథుని ఔచిత్యదృష్టి. అందువలన శ్రీహర్షుని అద్భుతవర్ణన శ్రీనాథుని లేఖినిలో అనర్ఘస్తోత్రమే అయినది. నైషధాంధ్రీకరణమున సంస్కృత దండకము సంతరించుటలోని రహస్యమిది. వాగ్దేవి వాత్సల్యమునకు శ్రీనాథునికృతజ్ఞత ఇట్టిది. ఇట్టి శ్రీనాథుఁడు ప్రసిద్ధమైన శారదాస్తవము కన్నులకద్దుకొనకతప్పునా.

"యా కున్దేన్దు తుషారహార ధవళా యా శుభ్రవస్త్రాన్వితా
యా వీణా వరదణ్డ మణ్డితకరా యా శ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైస్సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా"

ఇది సుప్రసిద్ధమైన శ్లోకము స్వయంవరసభలో సాక్షాత్కార
మైన సరస్వతి, అవ్యవహారము చక్కబెట్టి నలదమయంతులను వర
ప్రదానము సేయునెడ, మానుషాకారము మాని దివ్యరూపము ధరిం
చినదని అమూలకమైన ఒక అపూర్వకల్పనచేసి అందు శ్రీనాథుడు
ఈశ్లోకమును స్మరించెను.

" భారతీదేవి.........వీణా పుస్తకపాణియు రోహిణీరమణ
చూడామణియును కుందేందు తుషార హార ధవళంబును నగు దివ్య
రూపంబు ధరియించె."

ఇందు భారతీదేవి పాణిని వీణతోపాటు పుస్తకమును అలంక
రించుట విశేషము. మఱి "కుందేందు తుషారహారధవళము" కేవలము
శ్లోకపునశ్చరణమే. ఇదొక చిహ్నపతాక.

ఇఁక సరస్వతీదేవి నలునికి చింతామణీమంత్రమును ఉపదేశించు
సందర్భమున వ్యాసభారతమునందలి నలోపాఖ్యానములోని ముఖ్యమైన
శ్లోకమొకటి గ్రహించి, సరస్వతి అన్నట్లు శ్రీనాథుఁడు స్వతంత్రముగ
కల్పించెను. ఆ శ్లోకమిది.

"కర్కోటకస్య నాగస్య దమయన్త్యా నలస్య చ
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనమ్"

ఇది నన్నయభట్టోపాధ్యాయుఁడు తెనిఁగింపలేదు. ఇది కని
పెట్టియే కాఁబోలు శ్రీనాథభట్ట శిష్యుఁడు సందర్భౌచిత్యమెఱిఁగి సంత
రించెను. ఆ పద్యమిది.

"నిను దమయంతిని ఋతుప
ర్ణుని కర్కోటకుని నెవ్వరు దలంతురు మే
ల్కను నప్పు డుషః కాలం
బున నృప! కవికల్మషములు వొందవు వారిన్"

కీర్తనమాత్రముననే కలినాశనమని వ్యాసప్రోక్తము "మేల్కను నప్పుడుషః కాలంబున" అని శ్రీనాథుని ప్రత్యేకనిబంధన సూత్ర ప్రాయమున శ్లోకమునెడ కూడ శ్రీనాథునికి స్వతంత్రతయే ఇంతకు నిది, "తతః పుణ్యశ్లోకః శ్రీత్రిభువనలోకస్య భవితా భవానాఖ్యాతః సన్కలికలుషహారీ హరిరివ" అనుమూలమునకు అనువాదమైన "హరియుంబోలెఁ గలికలుషహారిగుణ సంకీర్తనుండవు పుణ్యశ్లోకుండవు నగుము" అను సరస్వతి ఆశిషమునకు చక్కని అవతారిక.

నలదమయంతుల వివాహము జరిగినది. నాలుగుదినములు గడచినవి దమయంతిని అత్తవారింటికి పంపవలసివచ్చినది భీమరాజు అదొక హృదయాంతస్స్నాయువులను కదలించు అనూచానమైన కరుణరసఘట్టము. అత్తవారింటికి పయనమై, అశ్రుధారలు వర్షింప, తలవంచియున్న తనయను జూచినతండ్రి హృదయము శతధాభిన్నము కాక తప్పదు. కణ్వుడంతటి మహర్షికి — కన్నకూఁతురు, కాదు పెంచినకూఁతురు—శకుంతలను పంపునపుడు అటులైనది. అంత దుఃఖమునకు అత్తింటికేఁగు అనుఁగు తనయకు ఆమెసుఖము కోరి ముఖ్యమైన హితోక్తులు చెప్పకతప్పదు. అదొక క్లేశము. అట్లుభీమరాజు దమయంతికి చెప్పినట్లు అంతో ఇంతో శ్రీహర్షుని నైషధీయచరితమున లేకపోలేదు. కాని, అది "రసమును పోషించు" శ్రీనాథునికి సంతృప్తి నిచ్చునది కాదు. కణ్వమహర్షి శకుంతలకు చెప్పినట్లు కాళిదాసు రచించిన శ్లోకమే శ్రీనాథుని పరీక్షానికషమున ప్రకాశించినది.

"శుశ్రూషస్వ గురూన్ కురుప్రియ సఖీవృత్తిం సపత్నీజనే
భర్తుర్విప్రకృతాపి రోషణతయా మాస్మప్రతీపంగమః
భూయిష్ఠం భవ దక్షిణాపరిజనే భాగ్యేష్వనుత్సేకినీ
యాన్త్యేవం గృహిణీపదం యువతయో వామాః
కులస్యాధయః"

కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలమునందలి ఈ శ్లోకమునకు శ్రీనాథుని ఆంధ్రీకరణమిది.

"పాటించి కొలువుము భవనదైవతముల
సవతులఁగూనియాడు సఖులఁబోలి
యారాధనము సేయు మత్తమామల నెప్డుఁ
బరిజనంబులమీఁదఁ గరుణగలుగు
మలుగకు కోపించినపుడు నాథునితోడ
మదిలోన నుబ్బకు మన్ననలకుఁ
దోడి కోడండ్రతోఁగూడి మాడి చరింపు
దాసీజనముఁ బ్రోవు తల్లి కరణి
బ్రాహ్మణులయందు గురులందు బంధులందు
భక్తివిశ్వాస సౌహార్ద పరత నెఱపు
భవ్యపతి దేవతాచార పరమపుణ్య
ధర్మమేమఱకుండు మీతల్లి కాన !"

ఇది "కన్నుల బాష్పాంబు కణంబులురలఁ బ్రణామంబు సేసి తలవాంచియున్న" దమయంతిని "కౌఁగిలించుకొని గద్గదస్వరంబున" భీమరాజు అన్నది కాళిదాసు శ్లోకమునకు శ్రీనాథుని ఆంధ్రీకరణము ఆంధ్రీకరణమనగా ఇది ఒక్కపదమును కృతకము కాదు. ఒక్కపాదము కూడ కుంటువడలేదు. ఎక్కడను గీర్వాణము బలియలేదు అంతటను తెనుఁగుఁదనము తేజరిల్లినది. స్వీయకవితవలె పరిఢవిల్లినది. అంతే

కాదు, "శుశ్రూషస్వ గురూన్" అను మూలమునకు "పాటించి కొలు వుము భవనదైవతముల" అను ఉపకర్ణమణిక సువర్ణ పీఠిక. "యాన్త్యేవం గృహిణీపదం... ... ..." అను కాళిదాసు సూత్రమునకు "భవ్య పతిదేవతాచార పరమపుణ్యధర్మమే నుఱకుండుమీ" అను శ్రీనాథుని భాష్యము రత్నకిరీటము. అందు "తల్లి కాన!" అను సంబుద్ధి వజ్రపద కము ఇది కాళిదాసునకు శ్రీనాథుని కవితా పట్టాభిషేకము.

అభిజ్ఞాన శాకుంతలమును రూపకముగ శ్రీనాథుఁడు ఆంధ్రీక రింపని ఆంధ్రసరస్వతి ఎంత దురదృష్టవతి !—ఈ పద్యమొకటి తన్ని దర్శనము. ఆధునికములైన శాకుంతల నాటకానువాదముల వఱకును అక్కఱ లేదు పైకి శ్రీనాథుని అధిక్షేపించిన ప్రతిభసంది, లోన శ్రీనా థుని అనుపదము అనుకరించిన ఆనాటి పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడే పిల్లి మొగ్గలు వేసెను. కాని మల్లి మొగ్గలు తొడగలేదు.

"అత్తమామలకు నీయవసేవి (?) వెట్టుచు
గనుసన్నఁ జేయుమీ పనులెఱింగి
ప్రాణమిత్రములుగా భావించి యేప్రొద్దు
నవరింపుమీ ప్రేమ సవతులందు
భర్త యొక్కొక వేళ బహుమాన మొనరింపఁ
గదియరా నీకు మీఁగర్వరేఖ
పతిచిత్తమెఱిఁగి తత్పరి జనంబులమీఁదఁ
జేయుమా మిగుల దాక్షిణ్యగరిమ
కలక నొందకు మీఁధవుఁడలిగి నపుడు
పలుకులను జేరనీకు మా పరుసదనము
వీని వెలిగాఁగఁ దిరుగు నే వెలఁదియైనఁ
గులమునకు నాధియగుఁజువిూ కూఁతుఁగుల్లి."

ఇది పిన వీరభద్రుని తెనిఁగింపు. ఇందు కాళిదాసు శ్లోకమునకు విధేయత్వమె గాక, శ్రీనాథుని సీసమునకు శిష్యత్వమును గలదు. కాని ఆ రెండును కలిసిరాలేదు. "భర్తుర్విప్రకృతాపి రోషణ తయా మాస్మ ప్రతీపం గమః" అను వానికి, "అలుగకు కోపించినపుడు నాథునితోడ" అని సారము పిండి, అంతతో ఆగక శ్రీనాథుఁడు, ఆ వెంటనే "మదిలోన నుబ్బకు మన్ననలకు" అని మఱొక అవసరమైన హెచ్చరిక స్వీయముగ పలికించెను. ఈయుగపద్భావమే భావబంధురమైనది. అది వీరభద్రుని అనుసరణమున విక్షోభపడినది. ముందు వెనుకలు మాఱినవి. హెచ్చుతగ్గులు వచ్చినవి. అంతేకాదు. తీర్థమునకు తీర్థము, ప్రసాదమునకు ప్రసాదము అయినది. పరిజనముల మీఁద దాక్షిణ్యము ప్రకటించుటకు పిల్లలమఱ్ఱి కల్పించిన "పతి చిత్తమెఱుఁగుట" అను ప్రత్యేకనిబంధన ఆ ప్రయోజనమును సంకుచితపఱచునది. శ్రీనాథుని, హితమైన "కరుణ కలుగుట" సువిశాల హృదయ సూచకము. ఇఁక పిన వీరభద్రుని "కూఁతుఁగుఱ్ఱ" అను సంబుద్ధి, శ్రీనాథుని "తల్లి కాన !" అను సంబుద్ధికి కూఁతుఁగుఱ్ఱయే అయినను "తల్లి కాన" అను నుడికారములోని వాత్సల్య రేఖా శబలితమైన కారుణ్య స్ఫూర్తి "కూఁతుఁగుఱ్ఱ" అను కూర్పులో మూర్తి కట్టినది కాదు. మఱి శ్రీనాథుని సీసపద్యమునందలి ఆద్యంతములు పిన వీరభద్రునికి అందని ఫలములే అయినవి. అసలు శ్రీనాథుని ఆంధ్రీకరణములోని ప్రత్యేకతయెల్ల అక్కడే ఉన్నది. అది శ్రీనాథుని ఆంధ్రీకరణములోని అనితర సాధ్యమైన అధ్యాపకవాణి.

ఒకరి భావలతకు దోహదప్రక్రియ సేయుటే కాదు. క్రొత్త అంటులు త్రొక్కుట కూడ శ్రీనాథుని కవితా లీల

"వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి
లోకోత్తరాణాం చేతాంసి కో వా విజ్ఞాతుమర్హతి ?"

ఇది భవభూతి శ్లోకము. సీతాదేవిని పరిత్యజించిన శ్రీరాముని గురించి వనదేవత వాసంతి అడిగినది. "అశ్వమేధయాగము చేయు నారంభించెను". అని చెప్పినది తాపసవనిత ఆత్రేయి. వెంటనే "హా! మరల పెండ్లి కూడ చేసికొనెనా ?" అని దిగ్భ్రమచెందినది వాసంతి. "పాపము శమించుగాక" అని పలికినది ఆత్రేయి "అయిన యజ్ఞము నందాతనికి సహధర్మచారిణి యెవరు ?" అని ప్రశ్నించినది వన దేవత "స్వర్ణ సీత" అని సమాధాన మిచ్చినది తాపసవనిత. అప్పుడన్నది. వాసంతి ఆశ్చర్యచకితమై ! "వజ్రముల కంటె కఠినములు, కుసుమ ముల కంటె మృదులములు అయిన లోకోత్తరుల అంతరంగములు తెలిసికొనుటకు అర్హులెవరు ?" అని. అది శ్రీనాథుని ఆంధ్రీకరణమున రూపాంతరము నందినది. ఎంత అన్యథాపరికల్పనమో !

"ఉపలముల కంటెఁ గఠినంబు లొక్కవేళఁ
గుసుమముల కంటె నొకవేళఁ గోమలములు
గాన లజ్జాభయంబులు గలవొ లేవొ !
పువ్వుబోఁడుల హృదయంబు లెవ్వఁ డెఱుఁగు"

ఇది నలదమయంతుల నవసమాగమువేళ, అనురాగము నిండిన దమయంతి అంతరంగమునందలి లజ్జాభయముల గురించి శ్రీనాథుని అస్తినాస్తి విచికిత్స. భవభూతి భావనలోని లోకోత్తరులు శ్రీనా థుని చిత్రణలో పువ్వుబోడులు ! లోకోత్తరుల చిత్తములు వజ్ర ముల కంటె కఠినములైన, పువ్వుబోడుల హృదయములు ఉపలముల కంటె కఠినములు. వజ్రము లెంత కఠినములో అంత స్వచ్ఛములు. మహాత్ముల హృదయము లెంత కఠినములో అంత స్వచ్ఛములే. పువ్వు బోడుల హృదయములెంత కఠినములో అంత స్వచ్ఛములనుట అసా ధారణము. కనుక ఉపలములనుట. ఇది శ్రీనాథుని రూపాంతరీకరణ ములోని మెలఁకువ. ఇఁక ఆంధ్రీకరణము సరే. అగోచరభాస నూనము

"చేతాంసి కో హి విజ్ఞాతు మర్హతి" అను సంస్కృత వాక్యమెంత స్ఫూర్తిమంతమో, "హృదయంబు లెవ్వఁ డెఱుఁగు ?" అను తెలుఁగు పలుకు అంత శక్తిమంతము. ఆంధ్రీకరణమునకిది జీవలక్షణము. ఆధునికములైన ఉత్తర రామచరిత్ర నాటకానువాదములందలి పద్యములలో ఈ జీవనాడి మందకొడిగా వినిపించునది మాత్రమే. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలము, భవభూతి ఉత్తర రామచరితము నాటకములుగ శ్రీనాథుఁడు కైసేయని ఆంధ్రసరస్వతి నిజముగ దురదృష్టవతియే అనుటకిది మఱొక నిదర్శనము.

శ్రీహర్షుని కృతి నైషధీయ చరితము. శ్రీనాథుని ఆంధ్రీకృతి శృంగార నైషధము. ఇందలి శృంగార విశేషణమునకు ఇంకొక విధముగ శృంగగ్రహణము సేయుట ఒక పరిపాటి అయినది. కాని శ్రీహర్షుని నైషధీయచరితమే శృంగార కావ్యము.' కవి కులాదృష్టాధ్వపాంథుండొనర్చిన నైషధ శృంగార కావ్యంబు" అని శ్రీనాథుఁడు అనుటయే కాదు, "శృఙ్గారభఙ్గ్యా మహాకావ్యే చారుణి నైషధీయ చరితే" అని శ్రీహర్షుని కంఠోక్తియే అంతేకాదు. శ్రీహర్షుని నైషధీయ చరితమునందలి శృంగారము ముందు, శ్రీనాథుని శృంగార నైషధమునందలి శృంగారము నామమాత్రము. మూలమునందలి శ్రుతిమించిన శృంగారమునకు మూఁగవోయిన శ్రీనాథుఁడు ముక్తకము నందలి మితిమీఱని శృంగారమును మూదలించెను.

"క్వచిత్తామ్బూలాక్తః క్వచిదగురు పఙ్కాఙ్కమలినః
క్వచిచ్చూర్ణోద్గారీ క్వచిదపి చ సాలక్తకపదః
వలీభఙ్గాభోగై రలకపతితైః శీర్ణకుసుమైః
స్త్రియో నానావస్థం ప్రథయతి రతం ప్రచ్ఛదపటః"

ఇది శృంగారమునకు ఇంద్రభవనమైన అమరు కావ్యమునందలి శ్లోకము. ఇందు కామశాస్త్రము దిఙ్మాత్రముగ సూచింపఁబడినది.

నలదమయంతుల శృంగారమునెడ శ్రీహర్షుని వర్ణన కామశాస్త్రము నకు మహాభాష్యముగ సాగినది. అతివేలమైన ఆ ఘట్టమెల్ల వదలి అధ్యాహారముగ శ్రీనాథుఁడు అందిచ్చినది ఈ అమరు శ్లోకము.

"కేళీ విశేషంబులఁ గుచకుంకుమ పంకంబు చేతను నున్మంగురుల చిన్ని పువ్వుల చేతను నఖగు నెత్తమ్ముల శోత్తలత్తుక చేతను బింబాధరంపుఁ దాంబూలరస రాగంబులచే తనుం బర్యంక భాగంబు దేటపఱుప—"

నలదమయంతుల శృంగారము నైషధీయచరితమున శృంగాటక విరాఘాటము; శృంగార నైషధమున నికుంజనిబిడము.

ఇఁక హరవిలాసము. ఇది శ్రీనాథుని కవితావిలాసము ఇందు గౌరీ కల్యాణము కాళిదాసు కుమారసంభవమునకు ఆంధ్రీకరణము. అందు మాఘునికి శ్రీనాథుని మర్యాద. కాళిదాసు కుమారసంభవమున తారకాసురుని వృత్తాంతములో వాయువు స్థితి ఇట్లు వర్ణింపఁబడినది.

"వ్యావృత్తగతి రుద్యానే కుసుమ స్తేయ సాధ్వసాత్
నవాతి వాయు స్తత్పార్శ్వే తాళవృన్తా విలాధికమ్"

వాయుదేవుఁడు పుష్పాపహరణ ప్రమాదము రాకుండ ఉద్యానవనమున ప్రవేశింపక, తారకాసురుని పార్శ్వమునందుండి తాళవృంతానిలము కంటె అధికము కాకుండ వీచునఁట. ఇది శ్రీనాథునికి సంతృప్తి గొలుపలేదు. మాఘుని శిశుపాలవధమున రావణాసురుని వృత్తాంతములో వాయువుస్థితి ఇట్లు వర్ణింపఁబడినది.

"నిశాన్త నారీ పరిధాన ధూనన
స్ఫుటాగసా ప్యూరుషు లోల చక్షుష॥
ప్రియేణ తస్యాన పరాధ బాధితాః
ప్రకమ్పనే నామచకమ్పిరే సురాః"

ఇది శ్రీనాథుని మనోవీధిలో తళుక్కుమన్నది. ఇట్లు తెనిఁగించెను.

"నిరపరాధ బాధితులగు నిర్జరులకు
బంధమోక్షంబుఁ గావించు గంధవహుఁడు
సతులపయ్యెద లెడలించి చన్నులలమి
తప్పుసేసియు దైన్య చిత్తంబు నడసి."

శ్లోకమునందలి పరిధానమే పద్యమునందలి పయ్యెద. ఊరు విలోల చక్షు విశేషమును వదలుట గమనింపఁదగినది. పవన సుకుమారుని పరిధానాపహరణ ప్రక్రియ శ్రీహర్షుని నైషధీయ చరితమునందును గలదు

"పత్యౌ సతస్మిన్ మరుతాపితాస్య స్తనౌ పరిష్వష్టుమివా స్తవస్త్రౌ
అస్తాం స్తవకాన్త మృగాజ్ఞ మాస్యం దధారతిర్యగ్వలితం విలక్షః"

ఈ శ్లోకమునకు శ్రీనాథుని అంగీకరణమిది.

"సారణగండ్ల మార్గమునఁ జొచ్చిన సన్నని గాలి యొక్క యం
భోరుహ పత్ర నేత్ర నునుఁ బొంకపుఁ జన్నుల మీఁది సన్నపుం
జీర చెఱంగు వాయఁగిలఁ జేసిన పశ్చిధరాత శేశ్వరం
డోరయొనర్చెఁ బాపభయమొంది నిజావన చంద్రబింబమున్."

ఇంతకు శ్రీనాథుని గౌరీ కల్యాణము కాళిదాసు కుమార సంభవమునకు అస్వతంత్రాంగీకరణము కాదు. అసలు కుమార సంభవ కృత్యాదిని గల హిమాలయ వర్ణన గౌరీ కల్యాణమున తెనిఁగింపలేదు. అని చెప్పి హరవిలాసమున అసలు విడిచిపెట్టలేదు. కుమారసంభవాంగీకరణమున గాక, దేవదారువనవిహారపురాణకథావిలాసమున పుణికిపుచ్చుకొనెను.

"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయోనామనగాధిరాజః పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థితః పృథివ్యా ఇవమానదణ్డః"

అను కాళిదాసు ఆరంభశ్లోకమే ఒక అందిన ఫలము.

"మహిమండలమునకు మానదండము మేను
పూర్వాపరాబ్ధులు పొరుగుటిండ్లు"

ఇందు హిమాలయము విగాహించు పూర్వాపరాబ్ధులు పొరుగు టిండ్లయినవి. అందుకు హేతువు, "వృద్ధకచ్ఛపరాజు వీపుఁద్రిపీఠంబు సురతరంగిణి వెల్ల శిరసుపాగ" ఇత్యాదిగ హిమవంతునికి, శ్రీనాథుఁడు పర్వతసార్వభౌమత్వము పట్టము గట్టుటయే. యద్దియు చితము నౌచిత్యము.

"యత్రాంశుకాక్షేప విలజ్జితానాం యదృచ్ఛయా కింపురుషాఙ్గనానామ్ దరీ గృహద్వార విలమ్బి బిమ్బాస్తిరస్కరిణ్యో జలదా భవన్తి" ఇది కాళిదాసు సుశ్లోక శ్లోకము. ఇందు హిమవత్పర్వత గుహాలను గృహములకు మేఘపంక్తులు గుమ్మము తెరలగుట కలదు. ఆ తెరలకు ప్రయోజనము కాళిదాసు చెప్పినది స్పష్టము. అది గూఢముగ, అంతకంటె గాఢముగ, యవని కాభ్యంతరమున ఓలమూస గొన్నది శ్రీనాథుని భావసుందరి.

"ఎంచి నుతింప శక్యమె యహీశ్వరుకంతటి వానికైన ర
త్నాంచిత రోచిరుద్గమ నిరస్త రవీందు మరీచి జాలమున్
గాంచన కందరా యవనికాయిత వారిధరాంతరాళ ని
ర్వంచిత దేవతా మిథున వాంఛిత మూలము శీతశైలమున్."

ఈ పద్యమును ఇట్లే—ఒక్క అక్షరమైన వ్యత్యాసము లేకుండ—పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుఁడు శృంగార శాకుంతలమున శృంగారించుకొన్నాఁడు. ఇట్టి వీరభద్రుఁడు అట్టి శ్రీనాథుని ఆక్షేపించెననుట ఎట్టి కింవదంతి! వీరభద్రుని పద్యము ప్రక్షిప్తమనుటకు వీలులేదు. అసలీ పద్యమే కాదు, ఆ ప్రకరణమంతయు పినవీరభద్రుని కావ్యమున శ్రీనాథ కవితా శిష్యత్వ ఫలశ్రుతియే. హిమాలయవర్ణనము శ్రీనాథుఁడు సీసపద్యముతో మొదలిడెను. పిన వీరభద్రుఁడును సీసపద్యముతోనే

మొదలిడెను. శ్రీనాథుఁడు వచనములో ముగించెను. పిన వీరభద్రుఁడును వచనములోనే ముగించెను. అంతేకాదు. కాళిదాసు కుమారసంభవమునుండి శ్రీనాథుఁడు గ్రహించిన మూఁడు శ్లోకములకును పిన వీరభద్రుఁడు ముచ్చటపడెను. మొదటి శ్లోకమును శ్రీనాథుఁడు స్వతంత్రముగ సంతరించిన, పిన వీరభద్రుఁడు మూలవిధేయముగ, తెనిఁగించెను. రెండవ శ్లోకము ప్రకృత వృత్తమే. కాళిదాసు శ్లోకమును కాదని శ్రీనాథుని పద్యమునే పిన వీరభద్రుఁడు కన్నుల కద్దుకొనుట గమనార్హము. ఇఁక మూఁడవ శ్లోకము.

"యం సర్వశైలాః పరికల్ప్య వత్సం మేరౌ స్థితే దోగ్ధరి దోహదక్షే
భాస్వన్తి రత్నాని మహౌషధీశ్చ పృథూపదిష్టాం దుదుహుర్ధరిత్రీమ్"

ఇది కాళిదాసు కుమారసంభవమున రెండవశ్లోకము. పూర్వోదాహృత శ్లోకము పదునాల్గవది. పదునాల్గవ శ్లోకము ముందు, రెండవ శ్లోకము వెనుక శ్రీనాథుని ఆంధ్రీకరణము. ఈ పూర్వోత్తర క్రమనిరపేక్ష శ్లోక స్వీకారము శ్రీనాథునికి సార్వత్రికము. అది సైతము పిన వీరభద్రుని అనుసరణమైనది. ఆంధ్రీకరణము శిష్యప్రాయమే.

"హేమ శైలంబు దోగ్ధగా భూమిసురభి
నఖిల రత్నౌషధులును గల్పిదియుండఁ
బృథు మహారాజు పంపునఁ బితికె వేఁగ
పెయ్యఁగాఁ దన్నుఁ దివ్వటఁ గల్పించిరట"

ఇది శ్రీనాథుని ఒకపడి.

"భూధరములెల్ల దనువత్సముగ నొనర్పఁ
బృథున్నృపాలో పదిష్టమై ప్రియము మీఱ
నఖిల రత్నౌషధులను జన్నవిసిపిదికె
నమరశైలంబు దోగ్ధగా నవని సురభి"

ఇది పిఁవీరభద్రుని దిద్దుబడి.

ఇందు శ్రీనాథుని ప్రథమచరణమే అలఁతి భేదమున పినవీరభద్రుని అంతిమచరణమైనది. కాళిదాసు శ్లోకముతోపాటు శ్రీనాథుని పద్యమును పినవీరభద్రునికి ఆదర్శమే.

అసలు మురారి పదచింతనము శ్రీనాథునికి ఆత్మీయము. అపూర్వముగ శ్రీనాథుఁడు బహుధా ప్రయోగించు "పాణింధమ" పదబంధము, భట్టమురారి అనర్ఘరాఘవమునందలి అనర్ఘమణియే. "నవ భవద్గీర్వాణ పాణింధమాః పన్థానో దివి సంకుచన్తి" అభిధార్థమునకు మురారి ముచ్చట గౌణార్థమునకు శ్రీనాథుని శ్రీకారము. ఇక శ్రీనాథుని హిమాలయ వర్ణనమునందలి శబరకాంతల విశేషణమునకు మూాదల మురారియే.

"తీర్త్వాభూతేశమౌళి స్రజమమరధునీ మాత్మనా సౌత్రితీయః
తస్మై సౌమిత్రి మైత్రీమయముపహృతవా నాతరమ్ నావికాయ
వ్యామ గ్రాహ్యస్తనీభిశ్శబరయువతిభిః కౌతుకోదంచదక్షై
కృచ్ఛ్రాద్దన్వీయ మానఃక్షణమచలమసౌ చిత్రకూటమ్ప్రతస్థే"

ఈశ్వరుని మౌళిస్రజమైన గంగానదిని తాను, సీత, లక్ష్మణుఁడు దాటి, నావికునకు సోదరప్రేమ కేవుగా ఇచ్చి, శబరకాంతలు అనుసరింప, వారితో శ్రీరాముఁడు చిత్రకూటమున కేఁగెనని తాత్పర్యము ఇందలి శబరకాంతల విశేషణము శ్రీనాథుఁడు గ్రహించినది.

"ఆమోదంబున వేఁటలాడుదురు నీహారాద్రి కాంతారరే
ఖామధ్యంబునఁ జాపటంకృతులతో గంధద్విపశ్రేణులన్
క్షామక్షామ మనోజ్ఞమధ్యలురుగుంజా భూషణాలంకృతల్
వ్యామగ్రాహ్యపయోధరల్ శబర సేనానీశ సీమంతినుల్."

అది రామాయణము కనుక అచటి శబరికాంతలు అరణ్యవాసులైన సీతారామలక్ష్మణులకు అశ్వాసమావలు. ఇది హిమాలయము

కనుక ఇచటి శబరికాంతలు అరణ్యమధ్యమునందలి గంధగజములను వేటలాడుదురు. ఎచటి శబరికాంతలును ఒకటేతీరు కనుక ఈవిశేషణము. కాశీఖండమునందును శబరికాంతలకు శ్రీనాథుని విశేషణము ఇదే.

"ఆమిత్రావరుణాంశ సంభవుని వింధ్యాటోప విధ్వంసిలో
పాముద్రా సహితుం గనుంగొనిరి యుత్పన్న ప్రమోదంబునన్
వ్యామ గ్రాహ్యపయోధరల్ కుటిలనీలాగ్రాలకల్ తథ్యమి
థ్యామధ్యస్థితమధ్య లాటవిక సేనాధీశ సీమంతినుల్"

సీతారామలక్ష్మణులను చిత్రకూటమువఱకు అనుసరించినశబరి యువతులకు, లోపాముద్రాగస్త్యులను శ్రీశైలమున కనుగొన్న ఆటవిక సేనాధీశ సీమంతినులు తోఁబుట్టువులే.

హరవిలాసమున మఱొక విలాసము కిరాతార్జునీయము. అది భారతకథను అనుసరించిన శ్రీనాథుని స్వతంత్రరచన అందును భట్టమురారి శ్లోకములకు అనుకృతులు కలవు.

లక్ష్మీ వాలినిబర్హణ ప్రశమిత ద్వైరాజ్యవైరాగ్యయా
కిష్కింధాయతనైక దైవతమయం తారాపతిర్దీప్యతే
నప్తారం యువరాజ మఙ్గదమపి శ్రుత్వాతి హర్షాదభూత్
అస్రామ్భః పృషతౌఘ మౌక్తికమయో గుచ్ఛస్సహస్రేక్షణః"

ఇది సుగ్రీవ పట్టాభిషేకము తదుపరి అంగదుని యువరాజ్యాభిషేకము జరుగునెడ నైపథ్యభాషితము వాలివధవలన ద్వైరాజ్య వైరాగ్యము తొలఁగిన రాజ్యలక్ష్మిచే కిష్కింధాయతనైక దైవతమైన తారాపతి ప్రకాశించుచున్నాఁడు. మనుమఁడైన అంగదుఁడు యువరాజగుట విన్న ఇంద్రునికి వేకనుల హర్షమువలన అశ్రువులు ఆణిముత్యములయినవి. అని తాత్పర్యము ఇందు వాలి సుగ్రీవుల

ద్వైరాజ్యమునెడ రాజ్యలక్ష్మికి వైరాగ్యము కలుగుట అనుభావము విలక్షణమైనది. అది శ్రీనాథుని అనుపల్లవి.

"భాగ్యముగాదె యుష్మదను పన్నగ కంకణుచేఁ దపఃక్రియా
యోగ్యతఁజేసి విశ్వభువనోపకృతి ప్రతిపాదనైక సౌ
భాగ్య ధురంధరంబయిన పాశుపతాస్త్రముగాంచితింక వై
రాగ్యము పుట్టుఁగాక కురురాజు పయిన్నిజరాజ్యలక్ష్మికిన్"

ఇందు కురురాజుపై నిజరాజ్యలక్ష్మికి వైరాగ్యముపుట్టుట మురారి ప్రభావము అంతేకాదు. మురారిశ్లోకమునందలి ద్వైరాజ్య శబ్దమును శ్రీనాథునికి ముదావహము అసలీశబ్దము శ్రీహర్షుని నైషధీయ చరితమునందే ప్రయుక్తమైనది. ఆస్థలమున శ్రీనాథుఁడు అనుసరింపలేదు. శృంగారనైషధమున శ్రీనాథుఁడు ప్రయోగించిన స్థలమున మూలశ్లోకమున ఆశబ్దము లేదు. అందువలన శ్రీహర్షుని ప్రయోగమునకు అజ్ఞాతవాసముకలిగినది.

"చరచ్చిరం శైశవయౌవనీయ ద్వైరాజ్యభాజిత్వయిఖేదమేతి
తేషాంరుచశ్చారుతరేణచిత్తంవశ్యాఘుణాలుణ్ఠితధైర్యవిత్తమ్."

అని నలదౌత్యఘట్టమునందే శ్రీహర్షుని ప్రయోగము ఇట "పంచేషులుంఠిత ధైర్యవిత్తంబులగు తమచిత్తంబులంగల వృత్తాంతంబు లంతయుందెలియఁజెప్పి" అనిమాత్రమే శ్రీనాథుని అనుసరణము. ఇంతకు, ద్వైరాజ్యశబ్దమునకు "ద్వైరాజ్య ఇతి టచి భావేష్యఞ్" అని నారాయణపండితుని, "ద్వయో రాజ్ఞోః (కర్మ) బ్రాహ్మణాదిత్వాత్ ష్యఞ్ ప్రత్యయః" అని మల్లినాథసూరి వివరణములు నైషధ వ్యాఖ్యానములందుగలవు. ఇకఅనర్ఘరాఘవనాటక వ్యాఖ్యానములందు. "ద్వౌరాజానౌ...యస్యాస్సాద్విరాజా తస్యాః భావో ద్వైరాజ్యం" అని ఏకగ్రీవమైన అర్థవివరణములుకలవు అయినా ఆకరములు తెలియవు ద్వైరాజ్యశబ్దమునకు అర్థగ్రహణము సేయుటలో

ఇతఃపూర్వము బహుభంగులు వెలసినవి. అవియెల్లమఱియు అవిచారిత రమణీయములే. పయి ప్రయోగవివరణములనుబట్టి ద్విరాజభావము ద్వైరాజ్యమని నిర్ధారకము.

ఇంక శ్రీనాథుని మఱొక శబ్దబ్రహ్మోపాసనము.

"ఉద్దామద్యుమణిద్యుతివ్యతికర ప్రక్రీడ దర్కోపల
జ్వాలాజాల జటాల జాఙ్గలతటీ నిష్కూజ కోయష్టయః
భామోవన్నప్లవమాన సూరకిరణ క్రూర ప్రకారాదృశో
రాయస్కర్మసమాపయన్తి ధిగమూరార్యధ్యాహ్నశూన్యాదిశః"

ఇది అనర్ఘరాఘవమున లక్ష్మణుని ముఖతః అందిచ్చిన భట్ట మురారి మధ్యాహ్నవర్ణన. సుప్రసిద్ధము. ఇందువిషయము గ్రీష్మాత పధాటీసూచన విన్యాసము. గిరినిర్ఝరగ్రీవాభంగధారాసేచన. ఆద్వైరాజ్యభారమును అధ్యక్షించినది. శ్రీనాథుని సాహితీ ప్రౌఢిమ.

"మాలింగోహాళి సంఘటించిన క్రియన్ మధ్యాహ్నవేళన్ మహా
కాలంబైన నభోవిభాగమున తీక్ష్ణంగాసె బీటెండ యా
పాళిలేయాహిత సంప్రదీప్త కిరణ ప్రక్రీడ దర్కోపల
జ్వాలాజాల జటాల జాంగల తటీ వాచాల కోయష్టియై"

ఇందు పూర్వార్ధము శ్రీనాథుని పురస్కారము. ఉత్తరార్ధము భట్టమురారికి ఉట్టంకనము. ప్రక్రీడతో ప్రత్యక్షరము ప్రత్యక్షమైనది. ఒక్క "వాచాల" శబ్దము వినా. అది "నిష్కూజ" శబ్దముకంటె భిన్నము. అర్థవిరుద్ధము. నిష్కూజ శబ్దమునకు నిశ్శబ్దమనియే అనర్ఘ వ్యాఖ్యాతల అర్థనిర్ణయము.

"తత్ర నిష్కూజాః ప్రకృష్ట వాతాతపాతిరేక జనిత
తృష్ణా భరేణ శుష్యత్కణ్ఠత్వేన కలకలాది శబ్దరహితాః"

—ఇష్టార్థకల్పవల్లి. రామానంద యోగి.

"నిష్కూజాః నిశ్శబ్దా స్త్రపాతిరేకాకాత్"

—సంచిక. విష్ణుభట్ట.

"నిష్కూజాః నిశ్శబ్దా ఇత్యర్థః"

—హరిహర దీక్షితీయము. హరిహరదీక్షితులు.

పయి వ్యాఖ్యల ప్రకారము, నిష్కూజ శబ్దమునకు నిశ్చితార్థము నిశ్శబ్దమే. కాని అధికశబ్దమును అవకాశమే ఉభయకుశలమైనది. "నిః" ఉపవర్గము. అందువలన శ్రీనాథుడు అట్లు గ్రహింపవచ్చును. అంతేకాదు. అత్యధికమైన ఆతపాతిరేకమున నిశ్శబ్దత, తత్కించి దూనమైన ఆతపాతిరేకమున వాచాలత కూడ వాస్తవికమే. అంతర మఱియు శ్రీనాథుని ఆంతర్యము కావచ్చును. అందుకు సంస్కృతాంధ్ర కవుల స్వస్థలములు సహకరించునవి. కనుక నిది యతిమైత్రి ప్రలోభమే కానక్కఱలేదు. ఇంతకు మురారి సమాసప్రక్రియ ముగ్ధమోహనము శ్రీనాథుని సమాసప్రక్రియ స్నిగ్ధమందరము. ఏవం విధమైన శబ్దానుసృష్టికి శ్రీనాథుని "మాళింగోహాళి సంఘటింప"వలసినదే.

శృంగారనైషధము శ్రీహర్షుని నైషధీయ చరితమునకు ఆంధ్రీకరణము. అందు కాళిదాసు భవభూతి ప్రభృతుల శ్లోకములకు ఆరాధన! హరవిలాసమునందలి గౌరీకల్యాణము కాళిదాసు కుమారసంభవమునకు తెనుఁగుసేఁత. అందు మాఘశ్లోకమునకు ఆదరము! దారువన విహారము పురాణమూలకము. అందుమఱల కుమారసంభవమునకు కుతూహలము! కిరాతార్జునీయము భారత కథానుసారము అందు మురారి శ్లోకములకు ముచ్చట!—ఇవి శ్రీనాథుని రసోద్గారములైన గీర్వాణవాణీ నఖముఖముఖరిత వీణానిక్వాణములు. ఇతర కృతులందలి ఉద్ధృతవిశేషములు మఱొకసారి.

శ్రీ చిలకమర్తివారి

సంగ్రహరామాయణము

శ్రీ "సాయినాథశాస్త్రి"

ఆదికవి వాల్మీకి యే సుప్రభాతమున రామాయణ మహా కావ్య రచన కుపక్రమించినాఁడో తెలియదు గాని, యానాఁటి నుండియు దాని ననుసరించి యనేకములగు సాహిత్య ప్రక్రియల కితివృత్త భిక్ష లభించినది. ప్రాచీన, అర్వాచీన ఋషితుల్యులనేకుల కిహ పర సాధకమైనది. ఎందఱెన్ని విధముల వ్రాసినను, ఆంధ్రభారత, భాగవత గ్రంథములవలె ఆ చంద్ర తారార్కము నిలువదగిన దొక్కటియు గానరాదు. కొద్దియో గొప్పయో పేరును సంపాదించుకొనిన వానిలో భాస్కర రామాయణ, రంగనాథ రామాయణము లేమన్నయన వచ్చును.

ఆధునికు లనేకులు రామాయణ రచన కొడిగట్టిరి. అట్టి వారిలో నొకరు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు. కాలము క్రీ. శ. 1867-1945. వీరు వేంకనార్య తనూభవులు; అశ్వలాయన సూత్రులు, కాశ్యపగోత్రులు.

వీర నేకములగు నవలలు, నాటకములు మొదలగునవి రచించిరి. వీరి నవలలో ముఖ్యములు : రామచంద్ర విజయము, హేమలత, అహల్యాబాయి, కర్పూరమంజరి, సౌందర్య తిలక మున్నగునవి. నాటకములలో ముఖ్యములు. గయోపాఖ్యానము, ద్రౌపదీ పరిణయము, కీచక వధ, పారిజాతాపహరణము, నలచరిత్ర, సీతాకల్యాణములు. వీరి కావ్యములలో ముఖ్యములు రామాయణము, ధర్మ విజయములు. వీరు స్వతంత్రముగా నాటక రచన మొనర్చుటే కాక, సంస్కృతమునందలి వాని ననువదించిరి కూడ.

ప్రస్తుతము వీరు రచించిన సంగ్రహ రామాయణమను కావ్యమును పరిశీలింతము. శ్రీ చిలకమర్తి వారు తమ గ్రంథమునకు

మూలము "చెన్నపురమందలి న్యాయవాదులలో నగ్రగణ్యుఁడై, కొంత కాలము "హైకోర్టు" లో న్యాయమూర్తియై, పిమ్మట చెన్న పురి గవర్నరుగారి నిర్వాహక సభలో సభ్యుఁడై కుశాగ్రబుద్ధియని మహావ్యక్తి యని పేరు గాంచిన గౌరవనీయులై కీర్తిశేషులైన వి. కృష్ణస్వామి అయ్యరుగారు, పురాణేతిహాసములలోని కొన్ని కథలను సంగ్రహముగా నెత్తి సంస్కృతమున వ్రాయించి "ఆర్య చరితము" అను పేర నొక గ్రంథమును నాగరాక్షరములతో బ్రకటించిరి. ఈ యార్యచరితములో రామాయణము సంగ్రహముగా రమారమి యేను వందల శ్లోకములలోఁ దెల్పఁబడినది."

ఈ సంగ్రహ రామాయణము నాంధ్రీకరించుటకు శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారి ప్రోత్సాహమే కారణమట. పేరునకు దగి నట్టులిది సంగ్రహముగానే గ్రహింపఁబడినది.

ఇందలి యితి వృత్తము ప్రసిద్ధము. ఏతత్కృతి ప్రత్యేకతలలో నెన్నఁదగినవి కొన్ని గలవు. సామాన్యముగా ప్రతికృతికిని కృతి భర్తయు, కృతికర్తృ, కృతిభర్తృ వంశవర్ణములును, షష్ఠ్యంతములు నుండక తప్పవు. కాని యీ కృతి కట్టి దేమియు లేవు. అంతియేగాదు- పూర్వకవి స్తుతియేగాదు, కనీస మిష్టదేవ తాస్తుతియేనియు గాన రాదు. స్వల్పముగా బ్రతి కాండము చివరియందా శ్వాసాంత గద్య వంటి గద్య కలదు. కావ్యము శ్రీకారముతో మొదలై శ్రీకారముతో ముగియవలయు నను ప్రాచీన సంప్రదాయ పరాయణత్వమును గాన రాదు.

ఈ కావ్యమే 'సంగ్రహ రామాయణము' గనుకయితే వృత్తము సూటిగా నెత్తుకొనబడినది. అదియు సంక్షిప్తముగ నేయున్నది.

"తనరున్ గోసలయను పేరు
జనపదము విశాలమైన సరయూ తీర

మ్మున శోభానిలయంబై
ధనధాన్య సమృద్ధి గలిగి ధరణికిఁ దొడవై"

ఆ రాజ్యమునకు రాజధాని యయోధ్యయనియు, దశరథుఁడు ప్రభువనియు, పుత్రులు లేమి కతఁడు మిగుల విచారించుచుండె ననియు, దానిని పోఁగొట్ట సమకట్టి వసిష్ఠాదులు ఋష్యశృంగునిఁ గొని వచ్చి దశరథునిచేత పుత్రకామేష్టి చేయించిరనియు నిట్లు త్వర త్వరగా సాగిపోయినదే గాని కథా గతి కుంటుపడలేదు. ఇదియే మఱియొకరైన విపుల వర్ణనలతో విసుపు పుట్టింతురు.

కుమారోదయావసరము నందయోధ్య యందలి వేడుకలు నిజమునకు వర్ణింపనలవి కాని విధమున నుండియుండును. ఆ యా వేడుకలను వర్ణింపవలయునన్న కవికి కావలసినంత యవకాశముండును. అట్టి యెడల నీకవి.

"అపుడయోధ్యా పురంబున సకల జనులు
సంతసింపఁగ గొప్ప యుత్సవములయ్యె"

ననిమాత్రమే చెప్పినాఁడు. 'గొప్ప యుత్సవము' లని చెప్పుట చేత నెవరియూహ కందినంతవఱకు వారా యుత్సవముల గొప్పదనము నూహించుకొనవచ్చును. నిజమున కీపద్ధతియే మంచిదిగా గన్పట్టును. ఉత్సవ విశేషము లెన్ని వర్ణించినను కొన్ని మిగిలినట్లే కనుపట్టును. ఇప్పుడా బాధయేమియు లేదు గదా! ఉత్సవముల పరమ ప్రయోజనము జనులు సంతసించుట అఖిల జనులు సంతసించిరట.

కుమారులు క్రమ క్రమముగా పెరిగి పెద్దవారైరి. సకల విద్యా సంపన్నులైరి. ఒకనాఁడు దశరథ ధరణీపతి కొలువుకూటమునకు కౌశిక మునీంద్రుఁ డరుదెంచి, తా నారంభించిన యజ్ఞ రక్షణమునకై రామచంద్రుని పంపుమని కోరినాఁడు. దశరథుఁడందులకు ముదమంది వెంటనే యాతని వెంట రామలక్ష్మణుల నిరువురను బంపినాఁడు

మిగిలిన వానియందువలె నిందు దశరథుఁడు రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంట నంపుటకు విచారించినట్లు లేదు. అటు తరువాత వారు కౌశికుని యాగసంరక్షణ మొనర్చుట, రాక్షస సంహారము అహల్యాశాప విమోచనము, శివధనుర్భంగము, పరశురామగర్వ భంగము, అయోధ్యానగర ప్రవేశములు వరుసగా నడచినవి. అహల్యా సంక్రందన ఘట్టము సంక్షేపింపఁబడినది. మేనకావిశ్వామిత్ర ఘట్టము పేక్షింపబడినది. రామాయణమునందలి యితరములగు చిన్ని చిన్ని యితి వృత్తములు విడువబడినవి (ఉదా॥ :—శబరి, కబంధ వధ మొ॥)

ఈ సంగ్రహరామాయణ మంతయు నించుమించుగా గీతపద్యములందును, కందపద్యములందును వ్రాయఁబడినది. అల్లనిపృత్తములు లేనని కాదు, వాని సంఖ్య మిక్కిలి యల్పమని మిక్కిలి సరళముగానుండి యెల్లరకు తెల్లమగు ధోరణిలోనే వ్రాయఁబడుట యొక విశేషము కేవల కఠినపద భూయిష్ఠమైన శబ్దాడంబరమే కనుపట్టదు. అల్పాక్షరముల ననల్పార్థరచన, మాఱుమూలపదములు మచ్చునకేనియుఁ గానరావు.

పాత్ర మనోభావములను, చేష్టలను కన్నులకుఁగట్టింపగలదిట్ట. దశరథుఁడు విశ్వామిత్రుని యిచ్చవచ్చినకోరిక కోరుకొమ్మని తన సమ్మతిని తెలుపును ఆమాటలను వినినంతనే విశ్వామిత్రుని మనోభావములెట్లున్నవో పరికింతము—

"అద్భుతావహమైనట్టి యానృపాలు
పలుకులాలించి నెమ్మేను పులకరింప
మనమలరఁగ విశ్వామిత్ర మానివరుఁడు
నృకవరేణ్యునితో మెల్ల నిట్టులనియె"

అగునో కాదోయను సందియంబునొందక కోరుకొమ్మని దశరథుఁడనుట నిజముగా నద్భుతావహము. తనశక్తికిమించిన కోరికయైనను నెఱవేర్చుటకు సంసిద్ధుఁడన్నమాట! అతని పలుకులు వినినంతనే విశ్వామిత్రునిమేను పులకరించినదఁట. అందులకు కారణము సంతోష పారవశ్యము. ఆసంతోషమునకు మూలము—విశ్వామిత్రుఁడు తన వెంట రామలక్ష్మణులనుబంపి తనయాగము నిర్విఘ్నముగా బరిసమాప్తియగుటకుఁ దోడ్పడవలసినదిగా దశరథుని నడుగుట కేతెంచినాఁడు. తనకోరిక బయల్పరచినను,అందులకుదశరథుఁడంగీకరింపకపోవచ్చును. లేక లేక కల్గిన కుమారులుగదా! వారిని విడిచియుండుట కాతఁడిచ్ఛగించకపోవచ్చును. కావ తనకోరిక నెఱవేఱునో లేదో యనెడు సందేహము సహజము: అట్టియెడ దశరథుడే తనను గోరికోవలసినదిగా ప్రార్థించుటచే కలిగిన యమితసంతోషము కారణముగా శరీరముపులకరించినది. మనస్సునందు సంతోషముండుటచే మనోవికసనము సంభవించినది. విశ్వామిత్రుఁడు మానివరుఁడగుట మెల్లగా మాటాడుటసహజమే. దానికిఁదోడు సంతోషము తలమునకలుగా నుండుటచే గాద్గద్యముకలిగి కూడ మెల్లగా మాటలాడియుండును. ఇంతచక్కఁగాఁ బద్యమున్నపుడీలివృత్తములోని పాత్రలు పఠితహృదయమున బ్రత్యక్షము కాక మానవు.

పాత్రలస్వరూపస్వభావములు గూడ మూలమునకు వ్యతిరేకముగా లేవనియేచెప్పవచ్చును. ఆయా పాత్రలప్రవృత్తులు, కార్యములు కూడ స్వభావోచితముగ నేయున్నవి. ఇందలి కైకపాత్రయందుదాత్తతయేమియుఁగన్పట్టదు. లోకములో కైకియేకైకి దానవిహోలె ప్రసిద్ధి నొందినది. ఇందునైతమట్లే కన్పట్టు.

కావ్యమునందష్టాదశ వర్ణనలుండవలెనను నియమముల ననుసరింపక, వర్ణనలను వీలైనంతవఱకు వదలివైచెను. 'అసలు' వర్ణనలు

కథా గమనము నడ్డినైచును. కథాసూత్రము తెగిపోవుటచే పఠితల యాత్సుక్యమునకు భంగముకలుగును. తన్మూలమున కావ్యము నంద నాదరముకలుగుటసంభవింపవచ్చును. అందును బాలురకునైత మందు బాటులోదుండు విధమున రచించుచు. వర్ణనలఁజొప్పించిన విసువు గొలుపుననెడ యూహతోఁగాబోలు వీనిని పరిహరించెను. కాని సుం దరకాండము నందొకటి–చో చంద్రునివర్ణనయున్నది. అదియైనను సంగ్రహముగానే. అందులకు కారణమరయుదము.

" కపికులేశ్వరుఁడట్టిలు గడలి దాఁటి
రజని చరసార్వభౌముని రాజధాని
జొచ్చునప్పటి కపరాబ్ధిఁ జొచ్చెనినుఁడు
రాత్రియయ్యె వానరు మనోరథముదీఅ!"

హనుమంతుఁడు లంకాపురిని ప్రవేశించునప్పటికి రాత్రియైన దఁట. రాత్రియగుటచే హనుమంతుని పురప్రవేశముగాని, యాతని ప్రతిగృహపరిశోధనముగాని యడ్డుకొనువారుండరు. అందువలన వాని మనోరథముతీఱును. రాత్రిసమయము నందాతఁడా పట్టణమును బరి శీలించుటకు చీకటిరాత్రులైనకుదురదు. నిజమునకా రాత్రి వెన్నెల రాత్రియే. ఆవెన్నెలవెలుఁగు మసకమసకగా లేదనియు షోడశకళా విలసితతిమనియు సూచించుటకై యీవర్ణన యొనర్పఁబడినది.

సుందరకాండమునందే సీతాదేవి యాకారవర్ణన యొకచోట కలదు. ఆమె యెట్లున్నదో పరికింతము

" మలిన వస్త్రముఁదాలిచి మఱుఁగుదాని
దానవీపరివృతయయితలఁకుదాని
నెన్నొయుపవాసములఁ జిక్కియున్నదానిఁ
గరముదీన భావమ్మును గలుగుదాని."

" వెచ్చవెచ్చని నిట్టూర్పు విడుచుదాని
శుక్లపక్షపుఁ బాడ్యమి సొబగుమీఱు
చంద్రరేఖయుఁబోలె స్వచ్ఛమగుదాని
కాంత నొక్కర్తుఁ గన్గొని కన్నులలర."

సీత మలినవస్త్రధారిణి. దానవీపరివృత, కృతోపవాస శుష్కశరీర. ప్రకటిత దీనభావభాసుర, భర్తృవిరహావేదనాదోదూయమానమానస, స్వచ్ఛశరీరయై యున్నదఁట. సీతయిట్లున్నదని వర్ణింపకున్న, నంతకుమున్నెన్నఁడును జూచియెఱుఁగని హనుమంతుఁడామెను నెట్లుగుర్తింపఁగలిగె?నను ప్రశ్నయుదయింపక మానదు. కాన నిది యవసరమైనది.

ఇందు నీత్యుపదేశములునైతమున్నవి. నీత్యుపదేశములను ప్రభు, సుహృత్సమ్మితములుగా, కన్న కాంతాసమ్మితముగ నొనర్చిన మనోహరముగానుండును. కావ్యము కాంతా సమ్మితము. ఇందలినీతులన్నియు సన్మార్గప్రవర్తనకు దోహదకారులనుట నిశ్చయము.

రామాయణకథనంతయు స్పష్టముగా సులభమగు శైలిలో సంగ్రహముగా రచించి (శ్రీ) లక్ష్మీనరసింహముగారు లోకమునందనేకుల కుపకారమొనర్చి సూక్ష్మములో మోక్షమును సంపాదించు మార్గమును జూపిరి. నేఁటికిని రామాయణగాథ నెఱుఁగని వారనేకులుగలరు. అట్టివారికిది మిక్కిలి యుపయోగదాయకము కాఁగలదు. విద్యార్థులకు మహాకావ్యములను పఠించుటకు ముందుగాఁ బ్రాథమికావస్థయం దిట్టి గావ్యపఠనమొనర్చిన కావ్యపఠనము నందాసక్తి హెచ్చి' మేలుచేకూరుననుట నిస్సంశయము.

శ్రీ అష్టోత్తర శతనామగద్యము

(పాలకురికి సోమనాథ మహాకవి కృతము)

ఉత్పలము.

చిత్కళాబళీకృతాంగ[1] భవ! చిన్మయ, చిత్సుఖ, చిన్నితుభావ! సం|
చిత్కమలారక, చిద్ఘన, చిదాత్మ, చిదద్వయ, చిద్విశేష, సం|
చిత్కృత, చిద్విశిష్ట, చిదఖండ, చిదాఘ. చిదంత, చిత్సుకృ
చ్చిరతనవకాంగ, చిద్రస, లసద్బసవేశ, మహేశ[2] పాహిమాం||

శ్రీమద్గురు బసవేశ	నమస్తే	కోహంభ్రమ[5] నిర్ముక్త	నమస్తే
సానుయ[2A] భవ నిర్నాశ	,,	జహానపదధ్వ విశుద్ధ	,,
పరిపూర్ణ ప్రీతి భాతి	,,	సహజ భరిత సంసిద్ధ	,,
సురుచిర ప్రణవజ్యోతి	,,	ఘటపటగత చిద్గగన	,,
విద్యుత్కోటివిభాంగ	,,	పటురవ దృశ్య విహీన	,,
చిద్విశ్రాంతి శుభాంగ	,,	జ్యోతిర్లింగాకార	,,
చిత్ప్రకర ప్రకటాఖ్య	,,	పీతసకల సంసార	,,
ప్రపరికార శుభసౌఖ్య	,,	ఆణవాది మలదూర	,,
స్వానుభావ సంజీవ	,,	త్రాణప్రాణాధార	,,
మానసాధి వనదావ	,,	విశ్వవిలేపితగాత్ర	,,
సత్యజ్ఞానానంద	,,	శాశ్వత భాస్వన్నేత్ర	,,
ప్రత్యగ్బోధామంద	,,	సదసత్సాక్షి విలక్ష	,,
త్రిపదార్థ ప్రతిపాద్య	,,	చిదచిద్ద్వంద్వ విపక్ష	,,
కుపథ మతా ప్రతిభేద్య	,,	వ్యపగత కర్మద్వంద్వ	,,
చిద్రసభరితోల్లాస	,,	స్వపదత్రయ సంపాద్య	,,
క్షుద్రోపద్రవనాశ	,,	హానోపాదానాయ	,,
ఘటదీప[4] ఇవానన్య	,,	హీనప్రకృతి నిరాస	,,
పటుతర పరమానన్య	,,	సోయం శబ్దవిలక్ష	,,
దేహాదివ్యతిరిక్త	,,	కోయం బ్రహ్మాసు సూక్ష్మ	,,

1. జయ 2. సంతతమ్ 2A. భయనిర్నామ 3 సంధ 4. మివ
5. నిర్ణిక్త,

బింబ నేమస్తాపూర్ణ	నమస్తే	చిత్కృత చిత్కమలార్క	నమస్తే
కుంభస్తంభ విశీర్ణ	,,	సత్కృత శాస్త్ర వితర్క	,,
తత్త్వమసీతి పదాంత	,,	స్థావర జంగమరూప	,,
వ్యస్తసమస్త[6] నిశాంత	,,	జీవభావవిశ్లేష	,
అపరిధ్వంసన భావ	,,	విహితషడంగషడర్థ	,,
సంపరిధి తామర దేవ	,,	సహజ భరిత సంహార	,,
చిల్లహరీ హరిదశ్వ	,,	అంతర్గత నిఖిలాండ	,,
[7]ప్రోల్ల సత్సకల విశ్వ	,,	సంతత విశ్వవిభాండ	,,
కృతహిత గతిగత భూత	,,	సచ్చిత్సుఖదాలాప	,,
మతి మథనము ఖాతీత	,,	స్వచ్ఛపరమనిజరూప	,,
అక్షయ మహిమాపార	,,	చిద్గగనాంకితదేహ	,,
కుక్షి జగత్త్రియ పూర	,,	[10]ఉద్గగుణాది సమూహ	,,
సాక్షి పరాపర గోత్రి	,,	వాచక వాచ్య విపక్ష	,,
సూక్ష్మసూక్ష్మ[8] సుగాత్రి	,,	సూచిక బంధ విమోక్ష	,,
గమనవి సర్గానంద	,,	ఆవృత విశ్వకుటుంబ	,,
విమలాచలచి[9]త్కంద	,,	స్వానుభవాంతర్బింబ	,,
కర్మత్రియ నిర్ముక్త	,,	భరిమ షట్పదహితపీఠ	,,
నిర్మల నిజబోధార్క	,,	కరిమపద పాళి[11]తాళిత	,,
ఓతప్రోత సమస్త	,,	గతహేయోపాదేయ	,,
వీతక్లేశ వితస్త	,,	శ్రుతిశిరత్యంతనికాయ	,,
సునిహిత విశ్వకళత్రి	,,	అకుటిల భక్తిసు [12] వేద్య	,,
అనిహత పరికృతి స్వతంత్రి	,,	పరిటిత విశ్వారాధ్య	,,
నిర్మిత విశ్వకులాంగ	,,	సకలశక్తి చైతన్య	,,
శర్మసమగ్రాపాంగ	,,	నిఖిలజగజ్జనమాన్య	,,
త్రిపుట ఘటోపరిసిద్ధ	,,	విశ్వాద్యంగాధ్యస్త	,,
జ్ఞపిత మహామయ శుద్ధ	,,	సౌఖ్యన్యస్త సమస్త	,,

6. నిజాంత 7. ప్రోల్లసత్సర్గపరాస్య, 8. విధాత్రి 9. ద్బిందు 10 ఉద్ధ
11 వాత్రిత 12 భేద్య

నవగుణ జాలనిహార	నమస్తే	భావ నమస్తే భావి[14]	నమస్తే
అవయవ పంచకసార	,,	సద్గురు బసవేశాయ	,,
[13] పూర్ణాంగ త్రయపూర్ణ	,,	మద్గురు బసవేంద్రాయ	,,
పూర్ణాం శాంత్యతికీర్ణ	,,	సద్గురు బసవస్వామి	,,
త్యాగభోగ యోగాంగ	,,	ఉద్గత సద్గుణ భూమి	,,
యోగచతుష్కాష్టాంగ	,,	నమోనమస్తే నమోనమస్తే	
భక్త మనోవన చైత్ర	,,	కం॥ [15] సరస నమస్కృతిగద్యాం	
ముక్త్యానంద కళత్ర	,,	తరపదమణి ఖచిత వాక్ప్ర	
నవరసమయ వసువదాన్య	,,	వర్ణాబ్జాష్టో	
విపుల కలాప్రసూనాఢ్య	,,	త్తర శతనామంగా బస	
ఆద్యనమస్తే వేద్య	,,	వరసంగర్పసిద పాల్కురికి	
తత్త్వ నమస్తే సత్వ	,,	సోమాంకం	

పాల్కురికి సోమనాథుని లఘుకృతులలో పంచప్రకారగద్య, నమస్కారగద్య, అక్షరాంకగద్య, అక్షరాంకపద్యములు, బసవరగడ అనునవి ఆంధ్రపత్రిక ప్రజోత్పత్తి, ఆంగీరస, శ్రీముఖ, భావ, యువసంవత్సరాది సంచికలలో నాపీఠికలతోఁ బ్రకటించియుంటిని. అటుతరువాత 1962 సంవత్సరమున "పాలకురికి సోమనాథకవి లఘుకృతులు" అను పేర 21 లఘుకృతులను ప్రత్యేక పుస్తకరూపమునఁ బ్రకటించియుంటిని. అప్పటికి సోమనాథుని అష్టోత్తర శతనామగద్యము సమగ్రముగ లభింపమిచే నందలి యాద్యంతపాదములు కొన్ని మాత్రము శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి బసవపురాణ పీఠికలోని యాధారములను బట్టి పయిగ్రంథము చివర ననుబంధములోఁ బ్రకటించితిని. ఇప్పుడీగద్యసంపూర్ణముగ మహబూబునగరమునందలి యున్నతపాఠశాలలోఁ బండితులుగానున్న మిత్రులు శివశ్రీ హస్న బాద నాగలింగ శివయోగిగారి తాళపత్రగ్రంథ సంచయమునుండి సేకరించి యీసంచి

---

13 పూర్ణాంశ 14 భావ్య 15 బసవ

కలోఁ బ్రకటించినాను. ఈగద్యము నాలుగేసి మాత్రలుగల నాల్గు
గణములతో మొత్తము పదునాఱు మాత్రలుగల మాత్రాగణము
లతోఁ గూర్చబడినది. కొన్ని పాదములలో మొదటి రెండు గణములు
కలిపి యెనిమిది మాత్రలుగఁ గూర్పఁబడినవి. ఇందుచే నీగద్యఛందో
లక్షణములో కన్నడమందలి మందానిలరగడకును, తెలుఁగునందలి
మధుర గతి రగడకును సరిపోవునని పాఠకులు గ్రహింపఁ గలరు
ద్విపదలలోవలె నిందు రెండేసిపాదములకొక ప్రాసాక్షరము వాడఁ
బడినది. మూఁడవగణములో జాలవఱకు నంత్యానుప్రాసము పాటిం
పఁబడినది.కన్నడభాషామర్యాద ననుసరించి కొన్నిచోట్ల శాంతప్రాసలు
(వర్గాక్షరములు వేనినైనఁ బ్రాసలోఁ గైకొనుట) వాడఁబడినది.
గద్యారంభమున సంస్కృత భాషలో ఉత్పల వృత్త శ్లోకము రచింపఁ
బడినది. అంతమున కన్నడకంద పద్యముగూర్పఁబడినవి. అర్థము సరిగా
గ్రాహ్యముగాని తావుల నేనిందుఁగొన్ని పదములను బరిష్కరించి తాళ
పత్రప్రతిలోని వాని మూలపాఠములను సంఖ్యలతో నధోజ్ఞాపిక
యందుదాహరించితిని. చదువరులు తమకుచితములని తోఁచిన
పాఠములనుగ్రహింపఁదగును. తాళపత్రప్రతిలో 105 పాదములు
మాత్రమేయున్నవి. అందుచేఁ జివరి మూఁడు పాదములు నేను
కూర్చి యిందుఁజేర్చినాఁడను. విజ్ఞులు క్షమింతురుగాక.

ఇట్లు
బండారు తమ్మయ్య
పరిషదధ్యక్షుఁడు.

గ్రంథ స్వీకారము-సమీక్ష

(శ్రీ బండారు తమ్మయ్య.)

1. చిన్నయసూరి జీవితము; హిందూధర్మ శాస్త్రసంగ్రహము- క్రౌను పుటలు 104+136 వెల రు 3-0-0.

2. ఆంధ్రకర్ణాటసారస్వతములు; పరస్పర ప్రభావము. క్రౌను పుటలు 164 వెల రు 3-0-0.

కర్త:—విద్యారత్న, పరిశోధనా పరమేశ్వర. శ్రీనిడుదవోలు వేంకటరావుగారు M A

మదరాసు విశ్వవిద్యాలయాంధ్రశాఖాధ్యక్షులు. (రిటైర్డు)

ప్రతులు దొరకుచోటు:- కృతికర్త-3-6-668 హిమాయత్ నగరు హైదరాబాదు.

1. మిత్రులు శ్రీవేంకటరావుగారి భాషాసేవ చిరవిశ్రుతమయినది.

మదరాసు విశ్వవిద్యాలయాంధ్ర శాఖాధ్యక్షులుగా పనిచేసిన కాలములో వీరుగావించిన పరిశ్రమ, ప్రకటించినగ్రంథములు మఱింత యమూల్యమయినవి. అట్టి గ్రంథములలో నొకటి చిన్నయసూరి జీవితచరిత్ర- బాలవ్యాకరణము, నీతిచంద్రిక మున్నగు ప్రశస్త గ్రంథముల రచయితగా చిన్నయసూరి యాంధ్రులకెల్లఁ జిరస్మరణీయుఁడయి యజరామరకీర్తి నందిన మహనీయ పండితచక్రవర్తి. ఆ మహాపురుషుని జీవితచరిత్ర శ్రీ వేంకటరావుగారి లేఖినినుండి వెలువడుట మనయాంధ్రభాషకు మహాభాగ్యము-అజ్ఞాతములయిన పెక్కు విషయము లీగ్రంథమూలమున వెలువడుట యొక విశేషము-తలిదండ్రులకు లేకలేక కలిగి గారాబముతోఁ బెరిగినకుమారుఁడవుటచేఁ జిన్నయ్యకుఁ బదునాల్గేండ్ల వయస్సు వచ్చువఱకు నేమాత్రము విద్యాసక్తిలేక వృథాగాకాలము గడచెననుట, యొక యద్భుత విషయము. అటు తర్వాతఁ దండ్రిగారి మిత్రులు కంది రామానుజాచార్యులుగారిచే నుద్బోధితుఁడయి వారివలననే యక్షరాభ్యాసాది సం

సాకారముల నొంది శీఘ్రలో వారికడను దనతండ్రిగారియొద్దను విద్యల నభ్యసించి పదునాలుగేండ్లలో ననఁగా ముప్పదేండ్ల వయస్సు వచ్చునరికి మహాపండితుఁ డయ్యెనఁట. "ప్రపేదిరే ప్రాక్తన జన్మ విద్యాః" అనుసూక్తి యాతనియందు సార్థకమయ్యెను. బాలవ్యాకరణ మునకు లక్ష్యలక్షణసమన్వయముగ చిన్నయసూరి నీతి చంద్రిక రచన మొనర్చుటకు మున్ను ఆంధ్రమున వెలసిన వచనరచనలు, అవి క్రమముగా నొందిన పరిణతులనుగూర్చి వేంకటరావుగారు పెక్కు-విషయములను జక్కఁగా వివరించిరి. క్రీ॥ శ॥ 1300 ప్రాంతమున కాక తీయ రెండవ ప్రతాపరుద్రుని కాలమున కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి నరహరి వచనములు, శఠకోపవిన్నపములు ప్రాథమిక వచనరచనలని వీరు వెలువరించిన దొక యపూర్వవిషయము. బాల వ్యాకరణమునకు ముందు వేదము పట్టాభిరామశాస్త్రి, రావిపాటి గురు మూర్తి శాస్త్రి మున్నగు పండితులురచించిన వ్యాకరణములఁ గూర్చిన వివరములుగూడఁ జక్కఁగా నిందు వివృతములయినవి. మొత్తముమీఁద సూరి రచించిన యావత్తు గ్రంథములు- ముద్రితాముద్రితములు- గూర్చిన వివరములిందుఁగలవు ఈగ్రంథము నాంధ్రులెల్లరుఁ దప్పక చదివి యెన్నియో యుపయుక్తవిషయములను గ్రహించుటయుక్తము.

చిన్నయసూరి ఆంగ్లమున తామస్ లండనన్ స్ట్రేంజి దొర గారు రచించిన(Elements of Hindu Law) అను న్యాయశాస్త్ర గ్రంథమునకనువాదముగారచించిన 'హిందూధర్మశాస్త్రసంగ్రహమును' ప్రప్రథమముగ వేంకటరావుగారిందు ప్రకటించుట ముదావహము. లోకోపకారకము. విద్యార్థులకు వచనరచనా పాటవ మలవడుటకయి పాఠ్యగ్రంథముగా సూరి రచించిన నీతిచంద్రికయందలి శైలి, భాష ఆంధ్రులకు సుపరిచితములు. అట్టి శైలిలోఁగాక యీ న్యాయ శాస్త్ర గ్రంథమును సూరి గ్రాంథికభాషయందే సరళమగు శైలిలో

రచించియుంచుట గమనింపఁదగినది. ఇవి వ్యావహారిక భాషావాదుల
గుణపాఠము కాఁదగినది. మచ్చునకు కొన్ని భాగములు.

(1) చాకలి, గొల్ల, యీడిగ, గాండ్ల, సట్టువుల యందు
వీరివంటి కర్మోపజీవులయందును. కుటుంబసంరక్షణ కుపకరిం
స్త్రీలాడంబడికలు చేయవచ్చును. అవ్వి కుటుంబనిమిత్తమయి యుం
వలెను. ఆయొడంబడికలకు భర్త కట్టుపడవలసినది. "స్మృతి చంద్రి
యందలి యాజ్ఞవల్క్య నారద వచనములు. (పుట 46)

(2) శూద్రజాతియందుఁ బుత్రులకు మాతృసంఖ్యఁబట్టి వి
గమని యొంతురుగాని యీయభిప్రాయము సరిగాదు. పుత్రులకందఱ
సమభాగవిధి యెల్లవర్ణములు వారికి సమానమైయుండును. (పుట 7

(స. అ. ౧౮౭౭ అ. నం. ౨౦ లో తీర్పు)

(దాయాధికారము) అవిభక్తకుటుంబములందు దాయమువచ్చుక్రమము
అవిభక్తులయిన సోదరుల యొక్క దాయము పొందువారి పరం
పర, విభక్తునిదాయము పొందువారి పరంపరకంటెఁ గొన్నివిషయము
లందు భిన్నమైయుండును. ఆ సోదరునకు గావలసినభాగము క్రమము
గా వానివానిపుత్రపౌత్రప్రపౌత్రులకు విభక్తద్రవ్యమట్లు చేయును. వీ
లేనిపక్షమందు వాని భాగము వానిసోదరులకు సమానముగాఁ జేయను
గతించిన సోదరునియొక్క భాగము తన తండ్రికిఁగాని తాతకుఁగా
సంక్రమింపనిది ప్రపౌత్రపుత్రునికిరా నేరదు. సోదరులకువచ్చిన భా
ము వారి సంతతియందు ప్రపౌత్రునివఱకు వచ్చును. ఆసంతతివా
లేనిపక్షమందు వారిలోఁ గడపట గతించిన వానియొక్క భార్యకు
వచ్చును. ముందుగతించిన వారి భార్యలకు భాగము రాదు. అవిభక్తు
లయిన సోదరుల యొక్క పుత్రపరంపరయందు దూరతములయి
యవిభక్తజ్ఞాతులవఱకు నాభాగము చేరును. వీరందఱు లేనిపక్షమందు
గడపట గతించిన వాని భార్యకుఁ జేరవలసినది. అదిలేని పక్షమంద
విభక్తులకుఁ జెందును. (పుటలు 10'-103)

ఊర్ధ్వపుండ్రాంకితవదనముతోడి చిన్నయసూరిగంభీరచిత్రము ముఖపత్రముపయి విలసిల్లి ముద్దుగొలుపుచున్నది.

[2] "జననిసంస్కృతంబు సకలభాషలకును", అనుసూక్తి ననుసరించి ఆద్యప్రకృతియగు సంస్కృతముతోడను ద్వితీయప్రకృతియగు ప్రాకృతముతోడను, దక్షిణ దేశభాషలకుఁగల సంబంధము మాట యెట్లున్నను నివి ద్రావిడభాషాకుటుంబమునకుఁ జెందిన స్వతంత్ర సోదర భాషలనియు, సంస్కృతప్రాకృతభాషా జన్యములు కావనియుఁ బలువురు భాషాభిజ్ఞులయభిప్రాయము. ఇందుకుఁ బ్రాతిపదిక వేసిన మహనీయుఁడు Bishop Caldwell అను నాంగ్లపండితుఁడు. ఇందుఁ గూర్చి దేశభాషలలోఁగూడఁ బలుగ్రంథములు రానురాను వెలసినవి. ద్రావిడభాషాకుటుంబమునకుఁ జెందిన తమిళము, మళయాళము, తుళు, కన్నడము, తెలుఁగు అను నయిదు దేశభాషలలోఁ జివరిరెండును మిక్కిలి సన్నిహితమయినవి. వీనికి లిపిసామ్యముకూడ చాల హెచ్చు. రెండింటికిఁగలిపి యొక్కే లిపిని నెలకొలిపెడి వాద మిటీవల బయలుదేఱియుండుట పలువురెఱిఁగినదే. "ఆంధ్రకర్ణాట సారస్వతములు; పరస్పర ప్రభావ"మును గూర్చి శ్రీవేంకటరావుగారీ గ్రంథమును ఆంధ్రప్రదేశసాహిత్యఎకాడమీ వారియాదేశానుసారము రచించి వారిబహుమతినిగూడ గ్రహించియున్నారు. ఈగ్రంథరచనమునకు వారు సర్వవిధముల నర్హులు. సమర్థులునని చెప్పుటయనవసరము. అవతారిక, లిపి, భాష, వ్యాకరణము, ఛందస్సు, సాహిత్యసంప్రదాయములు, తెలుఁగువాఙ్మయము, నన్నయపూర్వయుగము, నన్నయయుగము, శివకవియుగము, తిక్కనయుగము, శ్రీనాథయుగము, శ్రీకృష్ణదేవరాయలయుగము, దక్షిణాంధ్రయుగము, నవీనయుగము, అను 12 ప్రకరణములుగా నిది విభక్తమయినది. ఆంధ్రకర్ణాటకముల సంబంధమనాదియైనది. ఈ భాషలందలి తొల్లింటికవు లుభయభాషలను

కూలంకషముగ నేర్చిన పండితప్రకాండులు, ఆంధ్రమహాభారత రచనకు ఉపక్రమించిన నన్నయభట్టు తన సహాధ్యాయుడైన నారాయణభట్టు సాహాయ్యముతోఁడ నీయుద్యమమునకుఁ గడంగినట్టు గ్రంథావతారికలోనే తెలిసికొనియున్నాఁడు. నన్నయ, నారాయణభట్టు లిరువురు జన్మతః కర్ణాటులేయని యూహించుటకుఁ గూడ నాధారములున్నవి. కన్నడములో భారతమురచించి యాదికవియని పేర్వడసినపంపకవితా వాంధ్రదేశమంకలి వేఁగినాఁటివాఁడనని తానే చెప్పుకొనినాఁడు. కన్నడ కవిత్రయములోని రన్నఁ పొన్నకవులుకూడ నిట్టివారే. ఇఁకనాంధ్రమున శైవకవులలోఁ గణనగాంచిన మల్లికార్జున పండితారాధ్య పాలకురికి సోమనాథాదులుగూడ కర్నాటాంధ్రముల రెంటనుగూడఁ గృతులు రచించియున్నారు. పండితారాధ్యుఁడు తన శివతత్త్వసారమును రెండు భాషలలోఁ గూడ రచించినాఁడు. సోమనాథుని బసవస్తోత్రపదములుగ రచించిన గద్యకృతులు కన్నడులకు తెలుఁగువారికిఁ గూడ సమముగ నుపకరించునవి. దేశిచ్ఛందములలో పొత్తమునంతటిని బూర్తిగా రచించుట యీ రెండుభాషలందునుగానగును కన్నడమున రగడ, షట్పదులలో వెలసిన గ్రంథముల సంఖ్యాకములు. తెలుఁగులో రంగనాథుఁడు, సోమనాథుఁడు తమ ప్రధానకావ్యములను ద్విపదలో వెలయించుట యందఱకు సువిదితమే. ఇట్టు లెన్నోవిధముల కర్నాటాంధ్రములు రెండు మొదటినుండియు సమానధర్మములతో సోదరులవలె వెలసిన విధానములను వేంకటరావుగారు తమగ్రంథమునఁ జక్కఁగా వివరించియున్నారు అన్యోన్యము వీనిలో నొకదానినుండి మఱొకదాని కనువదింపఁబడిన గ్రంథములు పెక్కులున్నవి. ఆంధ్రులు, కన్నడులు గూడ నీగ్రంథము నామూలాగ్రముగఁ జదివి యుభయ సారస్వతముల పరస్పర ప్రభావమును లెస్సగా గుర్తించి జాతీయైక్యమునకయి పాటు పడుట పరమావశ్యకము బహుముఖముల శ్రీ వేంకటరావుగారి సోదర

భాషల సౌందర్యమును జక్కఁగా నిరూపించియున్నారు. గ్రంథాంతమున
ను భయభాషలందలి సమానార్థక ధాతుపదములను జాల నకారాదిగ
నొసంగుటయేగాక, తెనుఁగుఁ కన్నడములలోని సాటి సామెతలనుగూడఁ
బెక్కింటి నకారాదిగఁ గూర్చి శ్రీవేంకటరావుగారు పాఠకులకు మహో
పకారమొనర్చినారు. ఆంధ్రకర్ణాట సోదరులీయుత్తమ గ్రంథమునకు
సుస్వాగతమొసంగి తత్ప్రచారమునకు విశేషముగఁ దోడ్పడెదరుగాక
యని యాశించుచున్నారము.

ప్రణుత్తాయాః క్షతాయాః గజతాయా గజసమూహస్య కాని శిరాంసి "కంశికోంజనో రితి. యాదవః. తేభ్య ఆలీఢాని ముక్తా ఫలాని యస్యా స్తాం చంచత్ఖడ్గలతాం పశ్యంతః పరిపంథిభూవరభటా శ్శత్రుభటా స్సంగ్రామ కేళౌ ఉద్భాటాం చండాం దంష్ట్రాకోటిభి ర్దష్ట్రాంచలైః కరాళం భయావహం వక్త్రకుహరం యస్యా స్తా ముద్భ్రమాం స్వచ్ఛందచారిణీం కాళీం స్మరంతి యోజయతి. అత్రేతి కాళీఖడ్గలతయో రుపమాధ్వనిః స్మరణేన ప్రతీయతే.

పదగతకవిప్రౌఢోక్తిసిద్ధార్థమూలోఽలంకారేణ వస్తుధ్వని ర్యథా

శ్లో. సంగ్రామోద్యతసూర్యరాయవిభుసేనాక్షోదసంఛాదితే
ష్వభ్యర్ణభ్రమదబ్జనిర్యదమృతోత్సిక్తేషు విద్వేషిణామ్
సౌధాగ్రే ష్వభితః ప్రరూఢహరితే ష్వాగత్య నక్తందివమ్
నర్ద త్యంధకవైరిణ స్సమధికక్షైబో మహోక్షో ముహుః.

వ్యాఖ్యానమ్ :—

అత్ర పర్యాయాలంకారే నక్తందివ మితి పదేన శత్రూణా మతిచిరకాలప్రవాసప్రవృత్తిరూపం వస్తు వ్యజ్యతే.

ఉదాహరతి సంగ్రామేతి. సంగ్రామోద్యతస్య యుద్ధసన్నద్ధస్య సూర్యరాయవిభో స్సేనాయాః క్షోదై ర్ధూళిభి రాచ్ఛాదితేషు అభ్యర్ణే సమీపే భ్రమత స్సంచరతో ఽబ్జా చ్చంద్రా న్నిర్యతా ఽమృతేన ఉత్సిక్తే ష్వ భిత స్సమంతా త్ప్రరూఢహరితేషు సముద్గత శిగ్రుషు విద్వేషిణాం సౌధాగ్రేషు నక్తందివం ముహు రాగత్య అంధకవైరిణో హరస్య సమధికక్షైబోఽత్యంతపీవరః మహోక్షః వృషభః 'అచతురేత్యాదినా' నిపాతనా దకారాంతత్వం నర్దతి గర్దతి. నర్దగర్దశబ్దఇత్యాతో ర్లటి పరస్మైపదం యోజయతి. అత్రేతి ఏకత్రా నేకాధేయవర్ణనం పర్యాయాలంకారః.

వాక్యగత స్స యథా

శ్లో. శ్రీసూర్యరాయేంద్రయశోంబురాశేః
కేషాం చి దేవం ప్రతిభాతి బుద్ధిః
న్యూనేషు దేశేషు సురాపగేతి
సుధాపయోరాశి రితీందుభేతి.

వ్యాఖ్యానమ్ :—

అత్ర ఉల్లేఖాలంకారేణ యశసో మందాకిన్యాదిభ్యో వ్యాధిక్యం వ్యజ్యతే. వాక్యగత ముదాహరతి శ్రీసూర్యరాయేంద్రేతి. సురాపగా మందాకినీ ఇందుభా చంద్రికా యోజయతి అత్రేతి. ఏకస్య యశసో బహుధోల్లేఖన ముల్లేఖాలంకారః.

ఉభయశక్తిమూలో యథా

శ్లో. సారస్వతగుణై రమ్య స్సూర్యరాయమహీపతిః
విధృతాశేషభువనో నిద్రాణం తనుతే హరిమ్.

వ్యాఖ్యానమ్ :—

అత్ర నిద్రాణం హరిం తనుత ఇత్యర్థశక్తిమూలతా సూర్యరాయవిభుసుధాసాగరయో రౌపమ్యధ్వనిః. న సుకవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాః ప్రబంధగతాః కిమితి న పరిగణితా ఇతిచే న్న. కవిప్రౌఢోక్తి ష్వేవ తేషా మంతర్భావాత్. అన్యథా కవినిబద్ధవక్తృప్రౌఢోక్త యోపి కిమితి న సిద్ధ్యేయుః. ఏవం చ ప్రబంధాదిగతత్వేన యథాసంభవ ముదాహరణా న్యన్యత్ర ద్రష్టవ్యాని. విస్తరభయా దిహ నోదాహృతాని.

ఉభయశక్తిమూల ముదాహరతి సారస్వతేతి. సరస్వత్యా భారత్యా ఇమే సారస్వతాః. యద్వా సరస్వాం త్సముద్రః తస్యేమే గుణాః సారస్వతాః గాంభీర్యాదయః. "సరో నీరే తటాకే చ, సరస్వతీ

స్యాత్ స్త్రీరత్నే నద్యాం నద్యంతరే గవి, సరస్వతీ నదీభేదే గోవా
వతయో ర్గిరి స్త్రీరత్నే ధనదే పుంసి సరస్వా న్రసికే బుధ" ఇ
రుద్రాజయ్యప్రతాపాః. భువనం లోకః భువనాని జలాని "భువన
ఖేఽప్సు విష్టప" ఇతి కవిదర్పణే. యోజయతి అత్ర తేతి. కవినిబద్ధవక్త్ర
ప్రౌఢోక్తి సిద్ధార్థశక్తి మూలానాం ప్రబంధగతానా మనుదాహరణ
కిం నిమిత్త మిత్యాశంక్య సంగమయతి నన్వి త్యాదినా.

అసంలక్ష్యక్రమవ్యంగ్యంరసాదిధ్వనిః తదగ్రే వక్ష్యతే అసంలక్ష్యే
ఏతదగ్రే వక్ష్య ఇతి నిగమయతి.

గుణీభూతవ్యంగ్యం నిరూప్యతే

మూ. గుణీభూతవ్యంగ్యం మధ్యమం కావ్యం. వాచ్యాద్రమ్య
తయా శబ్దై ర్నిగూహ్య వివక్షితస్యైవ వ్యంగస్య ప్రాధాన్యం. ధ్వనా
తదితరత్త్వం వ్యంగ్యస్య గుణీభావః.

వ్యాఖ్యానమ్ :—

ఏవం ధ్వనిప్రధాన ముత్తమకావ్యం నిరూప్య గుణీభూత
వ్యంగ్యం మధ్యమకావ్యం నిరూపయతి గుణీభూతవ్యంగ్య మితి
వ్యాఖ్యాతం ప్రాక్.

తదష్ట విధమ్

శ్లో. అగూఢ మపరస్యాంగం
వాచ్యసిద్ధ్యంగమస్ఫుటమ్
సంధిగ్ధతుల్యప్రాధాన్యే
కాక్వాక్షిప్త మసుందరమ్
గూఢమేవ చమత్కారి
కశ్చాటీకుచకుంభవత్.

వ్యాఖ్యానమ్ :—

మధ్యమకావ్యస్య ఉక్తలక్షణత్వా ద్విభాగ మాహ అగూఢ మితి. వ్యంగ్యస్య ద్రాక్ప్రతీతా వగూఢత్వం మధ్యప్రతీతౌ గూఢత్వం విలంబితప్రతీతా వస్ఫుటత్వ మితి వివేకః.

అర్థాంతరసంక్రమితవాచ్య మగూఢం యథా

శ్లో. భూయా దభీక్ష్ణం గగనే హిమాంశు
స్సజ్జం శరాసం మదనో దధాతు
స్వైరం చ యోషాస్మి కరగ్రహేణ
శ్రీసూర్యరాయక్షితిపాలమౌళేః.

వ్యాఖ్యానమ్ :—

అత్ర యోషాశబ్ద శ్చంద్రాద్యుత్సవాదియోషాధర్మవిశిష్ట యోషాలక్షకః. తే నైతావత్పర్యంత మితి కర్తవ్యతాజడత్వ మంగీకృత మితి సూచితవస్త్వగూఢం. అస్య లోకపరంపరాప్రాప్తే రగూఢతా.

అగూఢ ముదాహరతి భూయా దితి. హిమాంశు శ్చంద్రః గగనే వ్యోమ్ని అభీక్ష్ణం సదా నతు తదా తదా భూయా త్తిష్ఠతు. ఉదయ మస్తమయం చ హిత్వా తిష్ఠ త్విత్యర్థః. మదనో మార శ్చ సజ్జ మాకృష్టం శరాసం ధనుః స్వైరం దధాతు. అస్మి అహం శ్రీసూర్యరాయక్షితిపాలమౌళేః కరగ్రహణయోషా యమిత్రేణ ఇతి ధాతో సూర్యరాయసార్వభౌమకరగ్రహణేన యోషా భవామీ త్యవగంతవ్యం యోజయతి అత్రేతి. సుగమమ్.

అత్యంతతిరస్కృత మగూఢం యథా

శ్లో. వ్రీడం విముంచ మహిళే! వలనేన చాక్ష్ణో
రంగీకురుష్వ సహసా సఖ! సూర్యరాయమ్

చక్రాంగనా నిజసఖస్య తనోతి హర్ష
మైంద్రీం దిశం ప్రణయతః పరిరంభ తే ఽర్కః.

వ్యాఖ్యానమ్ :—

అత్ర పరిరంభత ఇతి పదస్య స్వార్థతిరస్కారేణ ప్రాగ్భార సంబంధలక్షకత్వం. తేన ప్రాచీదిక్సూర్యయో ర్నాయికానాయకత్వం వ్యంగ్యం. తచ్చ కవిప్రయోగపరంపరాగతత్వా దగూఢమ్.

అత్యంతతిరస్కృత మగూఢ ముదాహరతి వ్రీడ మితి. హే మహిళే! కాంతే! వ్రీడం లజ్జాం విముంచ. అత్ర "మందాక్షం హ్రీ స్త్రపా వ్రీడా లజ్జే" త్యమరసింహేన వ్రీడేతి స్త్రీలింగ ఉక్తః. తథాపి "వ్రీడాదివాభ్యాశగతై ర్విలిల్యే" ఇతి మాఘేన పుంలింగత్వ ముక్తం. తస్మా న్నాత్ర పుంలింగత్వదోషః. సూర్యరాయం వేంకట మహీపతిసూర్యరాయసార్వభౌమం సహసా అతర్కితం యథా తథా "అతర్కితేతు సహసే" త్యమరః. అక్ష్ణో ర్దృష్ట్యో ర్వలనేన అంగీ కురుష్వ. చక్రాంగనా చక్రవాకాంగనా "చక్రం కోకే వ్రజే పుంసి క్లీబం సైన్యరథాంగయోః, గ్రామజాలే కుంభకారభాండే చాపత్యరాష్ట్రయో" రితి ప్రతాపః. నిజసఖస్య చక్రవాకస్య హర్షం తనోతి. అర్కః సూర్యః. అర్కో మఘోని స్ఫటికే. జ్యేష్ఠే భ్రాతరి భాస్కర" ఇతి యాదవః. ప్రణయత స్స్నేహాత్ ఐంద్రీం దిశం ప్రాచీం దిశం పరిరంభ తే ఆలింగతి. పరిపూర్వకరభధాతో రాలింగన మర్థః. "పరిరంభః పరిష్వంగ స్సంశ్లేష ఉపగుహన" మిత్యమరః. కృతినాయికస్య నవోఢాం నాయికాం ప్రతి సఖివచన మేతత్. వ్యాకరోతి అత్రేతి. ప్రాగ్భార ఉదయాద్రిశిఖరే "ప్రాగ్భారః పుంసి శైలాగ్రభాగాతిశయయో ర్మత" ఇతి కోశః.

శబ్దశక్తిమూల మగూఢం యథా

శ్లో. సూర్యరాయమహీపాలో
యువాయం నలినాంబకః
రతిప్రియమనాః కోఽపి
రంజయ త్యఖిలా వధూః.

వ్యాఖ్యానమ్ :-

అత్ర సూర్యరాయవిభో ర్మదనౌపమ్యం వ్యంగ్య మగూఢమ్. శబ్దశక్తిమూల మగూఢ ముదాహరతి సూర్యరాయమహీపాల ఇతి. నలినం పద్మమి వాంబకే నేత్రే యస్య సః అన్యత్ర కుసుమేషుః "అంబకం నేత్రశరయోః" రితి కవిదర్పణే. రతౌ బాహ్యాభ్యంతర సంభోగే ప్రియమనో యస్య సః. రతిప్రియ శ్చ. యోజయతి అత్రేతి. నలినాంబకరతిప్రియప్రభృతిశబ్దానాం కవిప్రయోగబాహుళ్యాదగూఢ మి త్యవసేయమ్.

అర్థశక్తిమూల మగూఢం యథా

శ్లో. యే నాసీ దరిమండలం చ నిఖిలం విధ్వస్తబాహాబలం
యేన క్వాపి చ దీనదుర్గతిధరో లీనః పరం భీతవత్
విశ్రాంతా భుజమండలే వసుమతీ యస్య స్వయం శైశవే
క స్తోతుం పటుధీ స్సుధీ ర్జగతి తం శ్రీసూర్యరాయాధిపమ్.

వ్యాఖ్యానమ్ :—

అత్ర శైశవే పర్వశత్రువిజయగుణశ్చే ద్యౌవనే కిము వక్తవ్య మితి అర్థాపత్తిగూఢా వ్యజ్యతే.

అర్థశక్తిమూల మగూఢ ముదాహరతి యేనేతి. నిఖిల మరి మండలం శత్రుమండలం యేన వేంకటమహీపతిసూర్యరాయసార్వ భౌమేన శైశవే బాల్య ఏవ విధ్వస్తం బాహాబలం యస్య తదాసీ

దభూత్. శైశవ ఇతి సర్వత్ర యోజ్యః. దీనదుర్గతిభర శ్చ దీనజన దారిద్ర్యాతిశయ శ్చ యేన్న పరం భీతవ త్కావ్వపి క్వావా లీనః. వసుమతీ సువర్ణపుష్టా పృథివీ చ స్వయం యస్య భుజమండలే విశ్రాంతా సుఖే నాభూత్ తం తాదృశం శ్రీసూర్యరాయాధిపం స్తోతుం గుణా న్వర్ణయితు మిత్యర్థః. జగతి క స్సుధీః పటుధీః ప్రజ్ఞా వాన్. న కోఽపీత్యర్థః. అర్థశక్తిమూలత్వం యోజయతి అత్రేతి.

అపరాంగమ్

శ్లో. వ్యంగ్యాంగ మితి వాచ్యాంగ మపరాంగం ద్విధా మతమ్.

వ్యాఖ్యానమ్ :—

అపరాంగం విభజతే వ్యంగ్యాంగ మితి స్పష్టమ్.

వ్యంగ్యాంగం యథా

శ్లో. శ్రీసూర్యరాయవిభు యోధభుజాకృపాణీ
ధారావిలోలహృదయారిమహీపతీనామ్.
సంస్తంభయంతి హృదయాని వివర్ణయంతి
గాత్రాణి నేత్రయుగళీ మపి ఘూర్ణయంతి.

వ్యాఖ్యానమ్ :—

వ్యంగ్యాంగపరాంగ ముదాహరతి శ్రీసూర్యరాయేతి. యోజ యతి అత్రేతి. యత్ర రసాదే రసాదిరంగం భవతి తదపి గుణీభూత వ్యంగ్య మేవ భయానకరసస్య వ్యంగ్యభూతశృంగారరసాంగత్వా ద్వ్యంగ్యాంగ మిత్యనుసంధేయమ్.

వాచ్యాంగమ్

శ్లో. శబ్దార్థశక్తిమూలత్వా ద్వాచ్యాంగం ద్వివిధం మతమ్.

వ్యాఖ్యానమ్ :—

వాచ్యాంగం విభజ్యతే శబ్దేతి శబ్దశక్తిమూల మర్థశక్తిమూలం

చేతి వాచ్యాంగం ద్వివిధ మిత్యర్థః.

శబ్దశక్తిమూలవాచ్యాంగ్యం యథా

శ్లో. స్వస్థేభ్యః పర మీప్సితా న్యనుకలం స్వైరం దదానా న్మహో
మందారప్రభృతీన్ ముహుః ప్రతిదినం నిర్వ్యాజయా ప్రజ్ఞయా
న్యక్కృత్వా కవయోఽతిదీనజనతావాంఛాధికస్పర్శనే
శ్లాఘంతే వరసూర్యరాయనృపతిం రాజన్యచూడామణిమ్.

వ్యాఖ్యానమ్ :—

అత్ర స్వస్థేభ్యో దదానా నిత్యనేన దీనేషు విశ్రాణనం నాస్తీతి వ్యంగ్యం కవికర్తృకన్యక్కారరూపవాచ్య స్యాంగమ్.

ఉదాహరతి స్వస్థేభ్య ఇతి. స్వస్థేభ్యః పర మింద్రలోకస్థితేభ్య ఏవ "స్వ రవ్యయం స్వర్గనాకత్రిదివత్రిదశాలయాః" ఇత్యమరః ఈప్సితాని కామితాని 'నపుంసకే భావే క్తః'. అనుకలం ప్రతిక్షణం స్వైరం దదానాన్ మందారప్రభృతీన్ ప్రతిదినం ముహుః నిర్వ్యాజయా నిష్కహానయా ప్రజ్ఞయా త్రైకాల్యగోచరయా "స్మృతి ర్వ్యతీతవిషయా మతి రాగామిగోచరా, బుద్ధి స్తాత్కాలికీ జ్ఞేయా ప్రజ్ఞా త్రైకాల్యగోచరా, ప్రజ్ఞాం నవనవోన్మేషశాలినీం ప్రతిభాం విదు" రిత్యుక్తలక్షణయే త్యర్థః. న్యక్కృత్వా తిరస్కృత్వా అతిదీనజనతాయా వాంఛాధికం స్పర్శనం దాతృత్వం యస్య తం రాజన్యచూడామణిం సూర్యరాయనృపతిం శ్లాఘంతే స్తువంతి. రోజయతి అత్రేతి.

అర్థశక్తిమూలం వాచ్యాంగం యథా

శ్లో. త్ర్యేశశ్యామలకంధరం శశిధరం మధ్యేకళంకం విధుమ్
క్షీరాంభోధి మనల్పశైవలసమాకీర్ణం సనీలోత్పలామ్
స్వర్గం గాం చ విహాయ సంప్రతి భవత్కీర్తిం భజంతి స్థిరాం
శ్రీమద్వేంకటసూర్యరాన్నృపతే! నైర్మల్యలక్ష్మీగుణాః.

గీ. ప్రసవశరుదంతికరము లీపడఁతితొడలు
చిత్తజునికాహళంబు లీచెలియజంఘ
లనుచుఁ బొగడుచుఁ దత్పదాయత్తచిత్తు
లైరి యాదరమునఁ గొంద అధిపసుతులు. 37

సీ. ఒకఁడు చేవంకిపై నొప్పుతామరకెంపు
ముగుదమోవి యటంచు ముద్దుఁగొనియె
నొకఁడు సౌవర్ణకందుక మిందువదనచ
న్గవఁ బోలు నని యక్కునను ఘటించె
నొకఁడు లీలాబ్జంబు ముకురాస్యమోముతోఁ
దులరా దనుచు గోరఁ ద్రుంచివైచె
నొకఁడు తాఁ బెంచినశుకి తలోదరిపల్కు
జాడఁ బల్కునఁ జేయి చాఁచి పిలిచె

గీ. క్షితిపతులు వేడ్క నిటు చమత్కృతుల నలరి
యొకరొకరు తత్ప్రియాహితోద్యోగు లయిరి
లలితచేష్టావిలాసలీలావిభూతి
నవ్వరారోహఁ జూచిన యాక్షణంబ. 38

వ. మఱియును, 39

మ. నను నానందముతోడఁ జూచినది యీనాళీకపత్త్రాక్షి యిం
కను నన్నే వరియించు నీయబల వేడ్కన్నాదెసం బ్రేమ చే
సిన దీయింతి యటంచు రాకొమరు లక్షీణాశులై యుండఁగాఁ
గని యమ్మానినితోఁ గళావతి వివేకస్ఫూర్తితో నిట్లనున్. 40

మ. వనితా చూడుము రాజసూనులను సౌవర్ణాసనాసీనులన్
ఘనతేజోజితభానులన్ త్రిజగతీఖ్యాతోల్లసద్దానులన్
వనజాక్షప్రతిమానుల న్నిఖిలవిద్యావేద్యసుజ్ఞానులన్
వినమత్కల్పసమానుల న్నిఖిలపృథ్వీజానుల న్వేడుకన్. 41

వ. అని మఱియు సవిశేషంబుగా నెఱింగించం దొడంగె. 42

సీ. ధృతిరసాతల మేలుచతురుం డహీనాఖ్యఁ
దగుమహాభోగి యాధార్మికుండు
ధనదుండు వరపుణ్యజనరక్షకుఁడు శంక
రప్రియు వాడి యారాజరాజు
కంభినీప్రియకారి గంభీరవేది మా
నవకుంజరుం డీజనప్రభుండు
నుతలోకహితజీవనుఁడు మణిచాపరా
జితుఁ డీఘనుండు విశేషరసుఁడు

గీ. ప్రతిభ వెలయించి వాహినీపతులఁ బెంచి
ప్రబలె సర్వజ్ఞమౌళి యాప్రభువరుండు
సారసహితప్రకాశుఁడై జగతి నెగడె
లోకబాంధవుఁ డీమేటి లోలనయన. 43

కం. లలనా యితండు మలయా
చల మేలునృపాలుఁ డితనిసాంగత్యమునన్
గల వెన్నఁ జందనద్రుమ
చలకిసలచ్ఛాయఁ గ్రీడ సలుపుట లెపుడున్. 44

వ. మఱియును గల ఫలంబు, 45

కం. ఏలాలతాంతడోలా
ఖేలాలీలావిహారకృతపుణ్యఫల
వ్యాలోలచందనాచల
బాలానిలసేవ గలదు పంకజనయనా. 46

ఉ. ఈతఁడు సింధునాముకుఁ డహీనబలోన్నతజీవనప్రథా
ఖ్యాతగభీరుఁ డార్యవిదితాధికసత్త్వుఁడు వాహినీవిభుం

దాతతభూమిభృద్వరసమాశ్రయుఁ డన్నఁగ వీనిమైత్రిచే
నోతరుణీ లభించు నిఁక నార్జితసౌఖ్యము లిచ్చుఁ గోరినన్. 47

కం. కేళీమనోజ్ఞనవకం
కేళీకోరకితనారికేళీవిలస
త్తాళీతరుతలముల ముది
తాళీ విహరించు దర్పితాళీడితవై. 48

సీ. ఈరాజశేఖరుఁ జేరఁగోరితి వేని
యతనువిభూతిసౌఖ్యంబు దొరకు
నీధరేశుని చెల్మి కిచ్చగించితి వేని
కులగోత్రహితగుణోజ్జ్వలత వెలయు
నీవాహినీనాథుపై వాంఛ యగుఁనేని
గాంభీర్యలావణ్యగరిమ యలరు
నీసార్వభౌమున కాసఁ జెందితి వేని
ధనదప్రియోన్నతిఁ గనుట సులభ
గీ. యీద్విజప్రభుకౌఁగిట నెనయుదేని
కలవు నీతోడు సుప్రభాగౌరవంబు
లిమ్మహాసేనుఁ గామింప నిచ్చయేని
గలుగుఁ జంద్రకీయూనంబు కంజవదన. 49

గీ. అని కళావతి రాజనందనులఁ జూపి
వారివిధములు దెలుప నవ్వారిజాక్షి
విని విననిరీతిఁ జూచి చూడనితెఱఁగున
జనియె నందెవ్వనిని గుఱి సలుపదయ్యె. 50

కం. అంత నృపాలాత్మజు ల
య్యంతిమనం బెఱిఁగి యిండ్ల కేఁగిరి లజ్జా

తాంతాననులై కంతు ల
తాంతశరాసారమునకు నగ్గం బగుచున్. 51

ఉ. వాసవదత్తయు న్నిజనివాసముఁ జొచ్చి సఖుల్ భజింపఁగా
నాసమయమ్మునందు హృదయప్రభుఁ డెవ్వఁ డొకో ప్రసూనబా
ణాసనమూర్తియై నను దయ న్వరియించుఘనుం డటంచుఁ బే
రాసల నిద్రఁ బోవఁ గల నన్నిశ నమ్మదిరాక్షిముందటన్. 52

సీ. సంపూర్ణపూర్ణిమాశశి హసింపఁగఁజాలు
మొలకనవ్వులముద్దుమోమువాఁడు
దళదరవిందసౌందర్యనిధానంబు
లగువాలుఁజూపులసొగసువాఁడు
రథవజ్రరాజిపైఁ బొదలెడుసిందూర
ముద్రపోలిక నొప్పుమోవివాఁడు
కౌస్తుభనిభమణిగ్రైవేయరుచులఁ జొ
క్కపుఁజెంద మన మించుగళమువాఁడు

గీ. తలిరుటాకులఁ బోలుపాదములవాఁడు
శ్యామసుందర మగుమేనిచాయవాఁడు
ధరణిపతిసూతి యొకఁడు ప్రత్యక్ష మయినఁ
గన్నులలర విలోకించెఁ గలికి యపుడు. 53

మ. కని చింతామణిరాజరాజసుతుఁడౌ కందర్పకేతుప్రభుం
డని సైరంధ్రులు దెల్పి రంచు మదిలో నారూఢి భావించి మే
ల్కని స్వప్నస్థితి నిక్క మానసుచుఁ దత్కంజాతపత్రాక్షి యి
ట్లని వర్ణింపఁదొడంగెఁ జిత్తభవబాణాసారమగ్నాంగియై. 54

చ. మరుఁడొ జయంతుఁడో నలుఁడొ మాధవుఁడో ద్విజరాజొ కిన్నరే
శ్వరసుతుఁడో గణింప నరవర్యుల కెందు లభించు నిట్టిసుం

దరత విరించి మెంచి ప్రమదావహరూపసుచారువిభ్రమ
స్ఫురణముకిల్మి నొక్కయెడఁ జూపఁదలంచి యొనర్చె నాతనిన్.

సీ. సోముఁడో పూర్ణిమాసోముఁడో సురసార్వ
భౌముఁడో యామహీపాలవరుఁడు
మారుఁడో గిరిజాకుమారుఁడో దనుజసం
హారుఁడో యాసద్గుణాకరుండు
రాముఁడో భార్గవరాముఁడో రేవతీ
రాముఁడో యామహోద్దామయశుఁడు
మిత్రుఁడో నిటలాక్షమిత్రుఁడో వాణీక
ళత్రుఁడో యానిశ్చలస్వభావుఁ
గీ. డహహ తాదృశరూపరేఖాతిశయము
గలుగనేరదు సాధారణులకు నిజము
గరుడ గంధర్వ యక్ష కింపురుష సిద్ధ
సాధ్యవరులకునైన నిస్సంశయముగ. 56

సీ. మతిఁ గోరునే యిందుమతి యజాత్మపాలు
నతనిఁ గన్గొనుభాగ్య మబ్బియున్న
రంభ కౌబేరిఁ జేరంగ నూహించునే
యతనిఁ గన్గొనుభాగ్య మబ్బియున్నఁ
పౌలోమి దేవతాప్రభునిఁ గామించునే
యతనిఁ గన్గొనుభాగ్య మబ్బియున్న
దమయంతి నలుని బాంధవము లెక్కించునే
యతనిఁ గన్గొనుభాగ్య మబ్బియున్న
గీ. ననుదినంబును మది ముదం బావహిల్ల
నతనికౌఁగిట నుండు పద్మాయతాక్షి

యదియె మరుచేతిపూబంతి యదియె యింతి
యదియె బుధనుతి గుణధన్య యదియె కన్య. 57

మ. అని చింతింపుచు నాలతాంగి స్మరచాపావిర్భవద్బాణవే
దన సైరింపక యుద్ధరావరుని హృత్పద్మంబులో నిల్పి యో
గినిరీతి న్మనవం బొనర్చును విలోకించు న్దిశ ల్మాటికిం
దనచెల్కత్తియలం గుటించియులుగు౯ దైన్యంబునొందున్నగు౯.

వ. అయ్యవసరంబున. 59

సీ. అస్తాచలాగ్రభాగారూఢమందార
జాతప్రసూనగుచ్ఛం బనంగ
జరదంగవిసరవాసరతామ్రచూడచూ
డాచక్రలోహితరోచి యనంగ
సంధ్యాంగనాకుచాంచలచారుమకరికా
పత్రయాచకరసంభ్రమ యనంగ
గంధివల్లభబాలికావేలికాగృహ
ప్రత్యగ్రరత్నదర్పణ మనంగ

గీ. దరళతరవీచికాపరిస్ఫురితచరమ
సలిలనిధితీరవిద్రుమసాల మనఁగ
బ్రబలనక్తంచరాఘునిర్దళనదక్ష
సమయహరిచక్ర మనఁగ భాస్వంతుఁ డలరె. 60

సీ. సుమశరస్యందనసూతమాంజిష్ఠరా
గధ్వజపటవిభ్రాంతి యనఁగ
గగనమహాతటాకప్రాంతసముదిత
కోకనదప్రభాసీక మనఁగ
బశ్చిమాశావిభుప్రాసాదలంబిచా
మీకరయవనికాలోక మనఁగ

వారుణీమత్తదృగ్వారుణీగండమం
డితమణికుండలద్యుతి యనంగ
గీ. గాలకరవాలవిదళితఘస్రమహిమ
రుధిరధారాప్రవాహసంరూఢి వలెరె
నినుఁడు చరమాంబునిధిఁ గ్రుంకు వెనుక వెనుక
డంబు మీఱంగ సాంధ్యరాగంబు మెఱసె. 61

చ. దళితతమాలజాలముల దాయ నిశాచరకోటి మేలు క
జ్జలరుచితోడ ధూమవిభుసారథి రేమెలనాగచూర్ణకుం
తలతతి రాజ నొల్లక వెతం బకుపద్మనిశాపమూర్తి ది
క్కులఁ బచరించెఁ జీకటి యకుంఠితలీల నిలాతలంబునన్. 62

సీ. తర్కించి చూడ నందనవని గాఁబోలు
గణనీయకౌశికాశలన నొప్పె
మది నెంచ దుర్జనహృదయంబు గాఁబోలు
దోషానుబంధసంతుష్టిఁ గనియెఁ
బ్రకటింప వైశ్వానరస్ఫూర్తి గాఁబోలు
నఖిలకాష్ఠాపహారాఖ్యఁ దనరెఁ
గణుతింప దైత్యలోకప్రజ్ఞ గాఁబోలుఁ
బ్రకటితతారకప్రతిభఁ గాంచె
గీ. నన విజృంభించెఁ దిమిర మత్యలఘులీలఁ
ద్రిపురహరకంఠకాళిమఁ దెగడి కమల
వనివిదూరమధువ్రతవ్రాతదేహ
దీధితుల గేలి సేయుచు దిక్కులందు. 63

సీ. నిరతాధ్వజశ్రమోద్ధురభానుహయముఖో
ద్గతఫేనఖండశంకావహములు

తాండవోచ్ఛలదుమాధవజటాతటనట
ద్గంగాంబుకణవిభాసంగతములు
ధారుణీధరభుగ్నదంతావళోద్గీర్ణ
కరశీకరచ్ఛటాసురుచిరములు
వియదిందిరాకుచవితతహారావళీ
ప్రచురముక్తాఫలరుచియుతములు
గీ. తాలయోగీంద్ర విలిఖితగగనఫలక
సురుచిరప్రణవాక్షరశోభితములు
తిమిరదైతేయదంతపంక్తిస్ఫుటములు
చుక్కలంబరపదమునఁ జూడనయ్యె. 64

శా. ధ్వాంతశ్యామలధూమభూమహితసంధ్యారాగవహ్నిప్రభా
క్రాంతాకాశశరావమధ్యరజనీకాంతాకరాంశోద్ధతా
త్యంతప్రస్ఫుటలాజవిభ్రమదశుభ్రాకారసందీపితా
శాంతంబై కనుపట్టె ఋక్షనివహం బక్షీద్వ్యయాపర్వమై. 65

సీ. క్షణదాంగనాకరోచ్ఛలితప్రవాళకం
దుక మంగభవహేమముకుర ముదయ
శైలమందారగుచ్ఛము నభశ్శ్రీశ్రుతి
మణికుండలము శతమన్యుదిగ్వ
ధూఫాలనిహితబంధూకప్రసూనమం
జులబిందుతిలక మస్తోకఘుసృణ
రసలిప్తసంధ్యాఖ్యబిసరుహాలోచనా
స్తనకలశము శచీసౌధశిఖర
గీ. భాసమానసువర్ణకుంభంబు బాల
చంద్రబింబంబు లోహితచ్ఛవిని మెఱసెఁ

ఆంధ్రసాహిత్యపరిషత్తు.

అధ్యక్షులు
విమర్శకాగ్రేసర, ఐతిహాసిక సమ్రాట్టు
శ్రీ బండారు తమ్మయ్య

ప్రధాన కార్యదర్శి, కోశాధికారి
అభినవభోజ
శ్రీ దంటు భాస్కరరావు

సహాయ కార్యదర్శి
శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

కార్యనిర్వాహకవర్గ సభ్యులు

1. శ్రీ కోకా శివనాథశాస్త్రి
2. శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి (బాలవ్యాస)
3. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి (వ్యాకరణ విద్యాప్రవీణ, భాషాప్రవీణ)
4. శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రి (కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర)
5. శ్రీ కుందూరి ఈశ్వరదత్తు
6. శ్రీ జయంతి బుచ్చిరామశర్మ
7. డాక్టరు శ్రీ ఇవటూరి జోగారావు, (యం. బి. బి. యస్.,)
8. శ్రీ చిరువోలు కోటీశ్వరరావు
9. శ్రీ దామెర రాజగోపాలరావు, బి. ఏ.
10. శ్రీ వేదుల రామచంద్రకీర్తి, ఎమ్. ఏ. (ఆనర్సు)
11. శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి (ఉభయభాషాప్రవీణ)
12. శ్రీ కావలి శ్రీరామమూర్తి, బి. ఎ. బి ఎల్.

పత్రికా సంపాదకుడు
శ్రీ కుందూరి ఈశ్వరదత్తు

ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రచురణములు

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

5వ సంపుటము	రు. 15—00
6వ సంపుటము	15—00
7వ సంపుటము	15—00

1—4 సంపుటములు పునర్ముద్రణములు గావింపబడనున్నవి. ప్రతియొక్కటికి వెల రు 15 లు

కవిజనాశ్రయము

వేములవాడ భీమకవి విరచితము.

పెక్కు పాఠభేదములతోఁ గూడిన వెనుకటి విషయ మంతయుఁ గలిగి తిరిగి తృతీయముద్రణ పీఠికతో ముద్రితమైనది వెల రు 1—50.

మాధ్యమిక కారికలు

బౌద్ధాచార్య నాగార్జున ప్రణీతము. కొల్లూరు సోమశేఖర శాస్త్రి విరచిత సుబోధినీవ్యాఖ్యాసహితము మూల్యము రు. 2—50

ఆంధ్రసాహిత్యపరిషత్తు,

కాకినాడ.

Printed by J. Gopalam, B.A. L.T., at Republic Pess, Kakinada.
Edited by K. ISWARADUTT
Published by Andhra Sahitya Parishat, Kakinada.